
'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 253

సోమవారం 27-5-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




రన్నరప్ సింధు

మలేసియా వరల్డ్ టూర్ బ్యాడ్మింటన్ టోర్నీలో వాంగ్ జి చేతిలో ఓటమి -12లో



ప్రీమియం భారమైతే..


రేట్లను ఏటా సవరిస్తున్న బీమా సంస్థలు.. పోర్టతో కంపెనీ మారే చాన్స్ - 13లో



ఢిల్లీ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

ఢిల్లీలోని బేబీ కేర్ న్యూ బోర్న్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగి ఏడుగురు పసికందులు ప్రాణాలు కోల్పోయారు.


వివరాలు 6లో ▸



ఇండియా కూటమి గెలిస్తే..

మెజార్టీగా ఉన్న హిందువులను రెండో తరగతి పౌరులుగా మార్చేందుకు ఇండియా కూటమి కుట్ర పన్నుతోందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



మరణాలు 670కి పైనే..

పపువా న్యూ గినియాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 670కి పైనే అని ఐరాస(ఐవోఎం) తెలిపింది.

వివరాలు 6లో ▸



మానవ తప్పిద మహావిషాదం

రాజ్‌కోట్‌లో గేమ్‌జోన్‌లో ప్రమాద ఘటనపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. మానవ తప్పిద మహా విషాదంగా అభివర్ణించింది.

వివరాలు 6లో ▸





కోల్‌కతాకే కిరీటం

ఐపీఎల్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్

టోర్నీ ఆద్యంతం అద్భుతంగా ఆడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు ఐపీఎల్ 17వ సీజన్‌లో చాంపియన్‌గా అవతరించింది. చెన్నైలో ఆదివారం జరిగిన ఫైనల్లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని కోల్‌కతా జట్టు 8 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఓడించింది. తద్వారా మూడో సారి ఐపీఎల్ టైటిల్‌ను కోల్‌కతా సొంతం చేసుకుంది. ఫైనల్లో ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. అనంతరం కోల్‌కతా జట్టు 10.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసి గెలిచింది. మిచెల్ స్టార్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు లభించింది. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లికి (బెంగళూరు : 741 పరుగులు) 'ఆరెంజ్ క్యాప్' అవార్డు... టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన హర్షల్ పటేల్‌కు (పంజాబ్ కింగ్స్) 'పర్పుల్ క్యాప్' అవార్డు లభించాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్ర జట్టు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డును గెల్చుకున్నాడు. కోల్‌కతా ఆల్‌రౌండర్ సునీల్ నరైన్‌కు 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డు సొంతం చేసుకున్నాడు. 12లో



'స్వచ్ఛ' నాగావళి కోసం.. 5లో

శ్రీకాకుళంలో నాగావళి నదిని శుభ్రం చేయాలనే ఒక యువకుడి ఆలోచనకు వందలాది మంది తోడయ్యారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరిశుభ్రత సేవలో భాగస్వాములయ్యారు. వీరి ఆలోచనకు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ సైతం మద్దతుగా నిలిచి సాయం అందించింది. దీంతో ఆదివారం నిర్వహించిన 'క్లీన్ శ్రీకాకుళం' విజయవంతమైంది.



మావోయిస్టు మిలీషియా సభ్యుల లొంగుబాటు 14లో

- అల్లూరి సీతారామరాజు జిల్లాలో లొంగిపోయిన 13 మంది సభ్యులు
- లొంగిపోయిన ప్రతి సభ్యుడిపైనా కేసులున్నాయి
- లొంగిపోయిన వారి పునరావాసానికి చర్యలు తీసుకుంటాం
- ఎస్పీ తుహిన్‌సిన్హా వెల్లడి



వన విహారం చేద్దాం రండి 5లో

- నల్లమలలో 'జంగిల్ సఫారీ'
- శ్రీశైలం ఘాట్ రోడ్డులో గోర్లెస్ కాలువ ప్రాంతం నుంచి ప్రారంభం.. జీప్సీల్లో ప్రయాణిస్తూ వన్యప్రాణులను ప్రత్యక్షంగా వీక్షించే చాన్స్
- ఆకట్టుకుంటున్న పర్యావరణ విజ్ఞాన కేంద్రం

పిన్నెల్లి హత్యకు పథకం



పల్నాడు జిల్లా కారంపూడిలో టీడీపీ గూండాలు చేసిన విధ్వంసాన్ని చూపిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని

మాజీ మంత్రి పేర్ని నాని ఆందోళన

బెయిల్ ఇవ్వడంతో అంతమొందించేందుకే మూడు తప్పుడు కేసులు.. ఎమ్మెల్యేకు హాని జరిగితే సీఐ నారాయణస్వామి, ఐజీ త్రిపాఠిదే బాధ్యత

పోలీసు వ్యవస్థకు మాయని మచ్చలా తయారైన అధికారులను వదిలిపెట్టం.. వేధిస్తున్న అధికారులు 4 తర్వాత మూల్యం చెల్లించక తప్పదు

సాక్షి, అమరావతి: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వెంటాడి హత్య చేసేందుకు పోలీసుల ద్వారా టీడీపీ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ఆందోళన వ్యక్తం చేశారు. పిన్నెల్లి ప్రాణాలకు ఎలాంటి హాని జరిగినా సీఐ నారాయణస్వామి, గుంటూరు రేంజ్ ఐజీ, డీజీపీదే బాధ్యతని స్పష్టం చేశారు. సీఐ నారాయణస్వామిని అడ్డు పెట్టుకుని తనను అంతమొందించేందుకు టీడీపీ నేతలు కుట్ర చేస్తున్నట్లు ఈసీ, పోలీసు ఉన్నతాధికారులకు పిన్నెల్లి ఫిర్యాదు చేసిన తర్వాత ఆయన ఇంటి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పారామిలిటరీ బలగాలను ఈనెల 14న ఎందుకు వెనక్కి రప్పించారని నిలదీశారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పిన్నెల్లి ఈ కుట్రలపై గవర్నర్, రాష్ట్రపతి, ప్రధానికి మొర పెట్టుకుంటేగానీ పారామిలిటరీ బలగాలను పంపలేదన్నారు. పోలీసు వ్యవస్థకు మాయని మచ్చలా తయారై సంఘ విద్రోహక శక్తుల్లా వ్యవహరిస్తున్న అధికారులకు ముందుంది ముసళ్ల పండుగని హెచ్చరించారు. పల్నాడు, తాడిపత్రి, తిరుపతిలో టీడీపీ గూండాలకు వత్తాసు పలుకుతున్న వారు జూన్ 4 తరువాత తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. పేర్ని నాని ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాల్లో

మిగతా 3వ పేజీలో ▶

తీరం దాటిన రెమాల్



- అర్ధరాత్రి తరువాత బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ మధ్య..
- బెంగాల్‌లో అత్యంత భారీ వర్షాలు.. పలు విమాన, రైలు సర్వీసులు రద్దు
- ఏపీలో పొడి వాతావరణం
- రాష్ట్రంలో 2 నుంచి 4 డిగ్రీలు పెరగనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

- వివరాలు 14,6లో

తాపీగా తప్పుడు కేసులు

పిన్నెల్లికి బెయిల్ రావడంతో మరో మూడు అక్రమ కేసులు.. కారంపూడిలో సీఐ తలకు గాయమైతే వారానికిపైగా ఏం చేస్తున్నట్లు?

నరసరావుపేటలో ఇంట్లో బాంబులు దాచిన టీడీపీ నేత అరవిందబాబును వదిలేసి గోపిరెడ్డిపై కేసులా?

- వివరాలు 3లో



పోలింగ్ అనంతరం నరసరావుపేటలో టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు ఇంట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

ఆ మూడు కేసుల్లోనూ..

'పిన్నెల్లి'కి మధ్యంతర ముందస్తు

బెయిల్ ఇవ్వండి



- ఈవీఎంల కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వగానే హత్యాయత్నం కేసులు పెట్టారు
- ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా నిరోధించేందుకే ఈ తప్పుడు కేసులు
- ఎన్నికల సంఘం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది.. పరిధి దాటి పనిచేస్తోంది
- ఆయన్ను అరెస్టు చేసి తీరాలన్న లక్ష్యంతోనే ఇలా చేస్తోంది
- ఘటనలు జరిగిన పది రోజుల తర్వాత నిందితుడిగా చేర్చారు
- అంత జాప్యం ఎందుకు జరిగిందో పోలీసులు చెప్పడం లేదు
- ఈవీఎంల కేసులో కల్పించిన రక్షణే ఈ కేసుల్లో కూడా కల్పించండి
- హైకోర్టుకు నివేదించిన సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి
- మరోవైపు.. టీడీపీ నేత అస్మిత్‌పై హత్యాయత్నం కేసున్నా బెయిల్‌ను వ్యతిరేకించని పోలీసులు

3లో

ఓటు తెచ్చిన చేటు

కౌలురైతులపై 'మంగళగిరి'లో ఓ సామాజికవర్గం దుర్మార్గం

సాగు కోసం పొలాల వద్దకు రావొద్దని హెచ్చరికలు

నారా లోకేశ్‌కు ఓట్లు వేయకపోవడమే వారు చేసిన నేరం



వాళ్లంతా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కౌలు రైతులు. ఏళ్ల తరబడి టీడీపీ సామాజికవర్గానికి చెందిన భూ యజమానుల వద్ద భూములు కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. మొన్న జరిగిన ఎన్నికలు వారి జీవనోపాధిపై దెబ్బకొట్టాయి. కారణం.. ఆ పెత్తందారులు చెప్పిన పార్టీకి ఓటేయకపోవడమే వారు చేసిన పాపం. తమ మాటను పట్టించుకోలేదన్న ఉక్రోషంతో ఆ భూ యజమానులు రగిలిపోయి ఇకపై తమ భూములను మీకు కౌలుకు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దాపురించిన ఈ వింత పోకడపై 'సాక్షి' ప్రత్యేక కథనం.. 2లో

సీల్ లేదని పోస్టల్ బ్యాలెట్

తిరస్కరించొద్దు



- డిక్లరేషన్‌పై అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, పేరు, హోదా ఉంటే ఆమోదించండి
- అనుమానం వస్తే పోస్టల్ ఫెసిలిటేషన్ సెంటర్‌లోని కౌంటర్ ఫాయిల్‌తో సరిచూడండి
- డిక్లరేషన్‌పై ఓటరు, అటెస్టింగ్ ఆఫీసర్ సంతకాలు లేకపోయినా తిరస్కరించండి
- డిక్లరేషన్ ఫారం విడిగా కవర్-బీలో లేకపోతే ఓపెన్ చేయకుండానే తిరస్కరించొచ్చు
- బ్యాలెట్ పేపర్ నెంబరు డిక్లరేషన్‌పైన ఒకలాగా, ఫారం-13బీ పైన మరొకటి వుంటే తిరస్కరించాలి.. బ్యాలెట్ పేపర్ ఓపెన్ చేసిన తర్వాత ఒకరి కంటే ఎక్కువమందికి సంతకాలు చేసినా తిరస్కరించొచ్చు
- పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై ఏపీ సీఈఓ ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాలు

2లో



నేడు 'హజ్ యాత్ర' ప్రారంభం

- విజయవాడ ఎంబార్గేషన్ పాయింట్ నుంచి వరుసగా రెండో ఏడాది యాత్ర
- రాష్ట్రం నుంచి ఈ ఏడాది 2,580 మంది హాజీల పవిత్ర యాత్ర
- గన్నవరం సమీపంలో క్యాంపు వద్ద వసతి

14లో



మన పులిహోర.. చద్దన్నం అదుర్స్

83 శాకాహార వంటకాల్లో వీటికి 'ఫోర్ స్టార్' రేటింగ్

పప్పుచారు, మిర్చి బజ్జీకీ ఏపీ నుంచి చోటు

మొదటిస్థానంలో దాల్ తడ్కా.. రెండోస్థానంలో షాహీ పన్నీర్

ప్రపంచ ఫుడ్‌గైడ్ 'టేస్ట్ అట్లాస్' నివేదిక

14లో

విజ్ఞాన వనం

విశ్వంలోని విశేషాలకు వేదికగా సుండిపెంట 'ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్క్'

జురాసిక్ పార్క్‌ను మరిపించేలా జంతువులు, పక్షుల ఆకృతులు

ఆకట్టుకుంటున్న డైనోసార్లు, ఆదిమానవుల విశేషాలు

జంతు, జీవజాల పరిణామక్రమాలను తెలిపే చక్కటి వేదిక

పెద్దదోర్నాల: ఒకవైపు చెట్లపై వేలాడుతున్న చింపాజీలు... మరోవైపు డైనోసార్లు... ఇంకోవైపు ఆహారం కోసం వేటాడుతున్న ఆదిమానవులు... ఇలా విశ్వం ఆవిర్భావం నుంచి మానవ పరిణామ క్రమం, జంతు, జీవజాలం సృష్టి, మరణం.. వంటి విశేషాలన్నీ కళ్లముందు ఉంచుతూ ఒక విజ్ఞాన వనంలా దర్శనమిస్తోంది ప్రకాశం జిల్లా సరిహద్దులో సుండిపెంటలోని శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో ఉన్న ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్క్. ఆకట్టుకునే జంతువులు, పక్షుల ఆకృతులు, ఆశ్చర్యపరిచే వివరాలతో ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్క్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ పార్క్‌ను 2012, సెప్టెంబర్ 23వ తేదీన ప్రారంభించారు. ఒక్కసారి ఈ పార్క్‌లోకి అడుగుపెడితే విద్యార్థులు బాహ్యప్రపంచాన్ని మరిచిపోయి పురాతన కాలం వాటి పరిస్థితుల నుంచి నేటి నవనాగరికత దిశగా ఏర్పడిన పరిణామాలన్నింటినీ చూసి ఆశ్చర్య పోతారు. ముఖ్యంగా పార్క్‌లో ఏర్పాటుచేసిన ఆది మానవుల జీవిత విశేషాలు, నాడు వారు ఆహారం కోసం జంతువులను వేటాడే విధానం, జంతు జీవ పరిణామ క్రమం, డైనోసార్‌ల పుట్టుక, జురాసిక్ పార్క్‌ను తలదన్నేలా డైనోసార్‌ల భారీ ఆకృతులు, గిరిజనుల జీవనశైలి, పక్షులు, వన్యప్రాణుల ఆకర్షణీయ శిలాకృతులు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తాయి.



వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని పంచేందుకు ఈ పార్క్ స్వాగతం పలుకుతోంది.

ఎలా వెళ్లాలంటే...

ఈ పార్కు ప్రకాశం జిల్లా సరిహద్దుకు 5కిలో మీటర్ల దూరంలో ఉంది. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో సుండిపెంటలోని శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో ఉన్న ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాలకు చెందిన ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ కార్యాలయానికి అత్యంత సమీపాన, బయోడైవర్సిటీ ప్రాంగణానికి ఎదురుగా రోడ్డు పక్కనే ఈ పార్క్‌ను ఏర్పాటుచేశారు. పెద్దదోర్నాల నుంచి బస్సులో ఎకోలాజికల్ నాలెడ్జ్ పార్క్ వద్దకు చేరుకోవచ్చు. శ్రీశైలం నుంచి కూడా సులభంగా బస్సు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో ఈ పార్క్ వద్దకు వెళ్లవచ్చు.

ఇదంజగత్



ఏదైతేనేం! మీరు చరిత్ర సృష్టించారు చాలు!!

కౌలురైతు: బుల్లా శ్రీనివాసరావు	
సామాజికవర్గం	ఎస్సీ (మాదిగ)
భూ యజమాని	గుంటుపల్లి సరస్వతి
గ్రామం	పెదపాలెం
సాగుచేస్తున్న భూమి	రెండెకరాలు
ఎప్పటి నుంచి	15 ఏళ్లుగా
కౌలు మొత్తం (ఎకరానికి)	రూ.35 వేలు

కౌలురైతు: గొడవర్తి ప్రతాప్‌సింగ్	
సామాజికవర్గం	ఎస్సీ (మాదిగ)
భూ యజమాని	వాసిరెడ్డి వాసు
గ్రామం	పెదపాలెం
సాగు చేస్తున్న భూమి	మూడెకరాలు
ఎప్పటి నుంచి	ఏళ్లుగా చేస్తున్నారు
కౌలు మొత్తం	22 బస్తాలు

కౌలురైతు: షేక్ సద్దాం హుస్సేన్	
సామాజికవర్గం	ముస్లిం
భూ యజమాని	గద్దె శ్రీనివాసరావు
గ్రామం	చిలువూరు
సాగు చేస్తున్న భూమి	నాలుగెకరాలు
ఎప్పటి నుంచి	ఐదేళ్లుగా..
కౌలు మొత్తం	16 బస్తాలు

కౌలురైతు: షేక్ ఖాదర్ భాషా	
సామాజికవర్గం	ముస్లిం
భూ యజమాని	యడ్ల హర్షవర్ధన్‌రావు
గ్రామం	తుమ్మపూడి
సాగుచేస్తున్న భూమి	10 ఎకరాలు
ఎప్పటి నుంచి	35 ఏళ్లుగా
కౌలు మొత్తం	70 వేలు (నిమ్మతోట)

కౌలురైతు: చిలకా తిమోతి	
సామాజికవర్గం	ఎస్సీ (మాదిగ)
భూ యజమాని	పాటిబండ్ల హరిప్రసాద్
గ్రామం	పెదపాలెం
సాగు చేస్తున్న భూమి	ఒకటిన్నర ఎకరం
ఎప్పటి నుంచి	30 ఏళ్లుగా
కౌలు మొత్తం	22 బస్తాలు

కౌలురైతు: షేక్ ఖాంసా	
సామాజికవర్గం	ముస్లిం
భూ యజమాని	లంక గోపాలరావు
గ్రామం	కంఠంరాజు కొండూరు
సాగుచేస్తున్న భూమి	నాలుగెకరాలు
ఎప్పటి నుంచి	14 ఏళ్లుగా
కౌలు మొత్తం	18 బస్తాలు

కౌలురైతు: గంపల శ్రీనివాసరావు	
సామాజికవర్గం	బీసీ (యాదవ)
భూ యజమాని	పుతుంబాక సాయికృష్ణ
గ్రామం	పేరకలపూడి
సాగు చేస్తున్న భూమి	నాలుగెకరాలు
ఎప్పటి నుంచి	22 ఏళ్లుగా
కౌలు మొత్తం	35,000

కౌలురైతు: యలమాటి ప్రసాద్‌కుమార్	
సామాజికవర్గం	ఎస్సీ (మాదిగ)
భూ యజమాని	గుంటుపల్లి సరస్వతి
గ్రామం	పెదపాలెం
సాగుచేస్తున్న భూమి	మూడెకరాలు
ఎప్పటి నుంచి	35 ఏళ్లుగా (తండ్రి నుంచి)
కౌలు మొత్తం	5 బస్తాలు మొదలు 23 బస్తాల వరకు /30 వేలు

కౌలురైతు: దేశబోయిన బాబుయాదవ్	
సామాజికవర్గం	బీసీ (యాదవ)
భూ యజమాని	గుండిమెడ బసవయ్య
గ్రామం	కంఠంరాజు కొండూరు
సాగు చేస్తున్న భూమి	నాలుగెకరాలు
ఎప్పటి నుంచి	35 ఏళ్లుగా
కౌలు మొత్తం	18 బస్తాలు

ఓటు తెచ్చిన చేటు..

కౌలురైతులపై 'మంగళగిరి'లో ఓ సామాజికవర్గం దుర్మార్గం

సాగు కోసం పొలాల వద్దకు రావొద్దని హెచ్చరికలు | **ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు టీడీపీకి చెందిన ఆ వర్గీయుల అల్టిమేటం**

- దశాబ్దాలుగా కౌలుకు చేస్తున్న పేదలపై బరితెగింపు
- వ్యవసాయ సీజన్ ఆరంభంలో ఒక్కసారిగా రోడ్డునపడ్డ కౌలుదారులు
- నారా లోకేశ్‌కు ఓట్లు వేయకపోవడమే వారు చేసిన నేరం
- ఆ సామాజికవర్గానికి చెందిన సంస్థల్లో పనిచేసే వారికీ ఇదే అనుభవం
- నీ పేరు లోకేశ్ రెడ్‌బుక్‌లోకి ఎక్కిందంటూ బెదిరింపులు
- 'ఫ్యాను'కు ఓటేసినందుకే అంటూ లబోదిబోమంటున్న బాధితులు
- ఇల్లు కట్టుకుంటున్నా ఓర్వలేకపోతున్నారని.. మాకిష్టమైన వారికి ఓటు వేసుకునే స్వేచ్ఛ కూడా లేదా అని ఆవేదన
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవులు వస్తున్నాయని కూడా ఏడుపు


తమ బాధలను వివరిస్తున్న దుగ్గిరాల మండలానికి చెందిన కౌలు రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి :

పేద రైతులకు ముఖ్యంగా కౌలుదారులకు మొన్న జరిగిన సాధారణ ఎన్నికలు ఎక్కడాలేని కష్టం తెచ్చిపెట్టాయి. తమ యజమానులు చెప్పిన వారికి ఓటు వేయకపోవడం.. తమ మనస్సాక్షి ప్రకారం వారు నడుచుకోవడమే వారు చేసిన నేరం. తమ మాటకు విలువ ఇవ్వలేదని, తాము చెప్పినట్లు ఓట్లు వేయలేదన్న అక్కసుతో తెలుగుదేశం పార్టీకి కొమ్ముకాసే ఓ ప్రధాన సామాజికవర్గానికి చెందిన వారు బరితెగించి ఇక నుంచి మా భూముల్లోకి అడుగుపెట్టొద్దని చెప్పేస్తున్నారు. మీకు మా భూములను కౌలుకు ఇవ్వడంలేదని తేల్చిచెప్పేయడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలురైతులు వ్యవసాయ సీజన్ ఆరంభంలో ఒక్కసారిగా రోడ్డునపడ్డారు. తాత, తండ్రుల నుంచి ఇప్పటివరకు ఆ భూముల్లో పంటలు పండించుకుంటూ క్రమం తప్పక కౌలు చెల్లిస్తున్న తమను రావద్దని చెప్పడం ఎంతవరకు సమంజసమని వారు ఆవేదనకు లోనవుతున్నారు. మాకిష్టమైన వారికి ఓటు వేసుకునే స్వేచ్ఛ కూడా లేదా అని వాపోతున్నారు. భూమి వారిదైనప్పుడు మా ఓటు మాది కాదా అని యువ కౌలుదారులు ప్రశ్నిస్తున్నారు. ఇలా మాలాంటి పేదలపై పెత్తందారుల దాష్టీకాలు ఇంకెంత కాలమని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ దారుణాలు మంగళగిరి నియోజకవర్గంలోనే చోటుచేసుకుంటున్నాయా? లేక ఇతర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి దాపురించిందా అని గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కౌలురైతులు 'సాక్షి' వద్ద తమ ఆవేదన వ్యక్తంచేశారు.

నియోజకవర్గ ఓటర్లకు డబ్బులు..

ఇక మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని వాటితో పాటు విజయవాడ, గుంటూరు, ఇతర ముఖ్య నగరాల్లోని కార్పొరేట్ విద్యా సంస్థలు, ఆసుపత్రులు, పెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు, వ్యాపార సముదాయాల్లో పనిచేసే నియోజకవర్గ ఓటర్లకు ఎన్నికల బోనస్ అందింది. టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాలంటూ ఆయా ఉద్యోగి స్థాయిని బట్టి 2,500 నుంచి 5,000 వరకు డబ్బులు అకౌంట్లలో పడ్డాయి. చేతికి కూడా ఇచ్చారు. అడక్కపోయినా తమకు ఎన్నికల బోనస్ అందిందని ఆయా గ్రామాలకు చెందిన ఉద్యోగుల నుంచి 'సాక్షి'కి సమాచారం అందింది.

మంగళగిరి నుంచి లోకేశ్ పోటీతో..

టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు తనయుడు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అయిన నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీచేసిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి చేతిలో ఓటమిపాలై, మూడు శాఖల మంత్రిగా పనిచేసిన ఆయన మరోసారి అదే స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన మురుగుడు లావణ్యతో ఈసారి పోటీపడ్డారు. చాలాకాలంగా మంగళగిరి టౌన్, రూరల్, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లోని తన సామాజికవర్గంపై ఆయన ప్రధానంగా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో.. పెదపాలెంకు చెందిన పాటిబండ్ల కృష్ణప్రసాద్ (కేపీ) వైఎస్సార్‌సీపీ నాయకుడిగా కొనసాగుతూ కొద్దినెలల కిందట లోకేశ్ పక్షాన చేరారు. అలాగే, దుగ్గిరాల మండలవాసి, మాజీ ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లోని పారిశ్రామికవేత్తలు, విద్య, వైద్య రంగ సంస్థల ముఖ్యులు, వ్యాపారస్తులు, ఎన్ఆర్ఐల సహకారం కూడా లోకేశ్‌కు తోడైంది. తమ వాడైన లోకేశ్‌కు మద్దతిస్తే ఇవ్వండి, లేదంటే మా సంస్థల్లో మీరు చేస్తున్న ఉద్యోగాలను వదిలేసుకోండని స్పష్టంగా చెప్పారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు.. ఇళ్లలోని పెద్దలకు, మహిళలకు కూడా ఫోన్లుచేసి ఇదే విషయమై బెదిరించారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నామని..

దుగ్గిరాల మండలంలోని వివిధ గ్రామాల్లో పెత్తందారులుగా చలామణి అవుతున్న పలువురు టీడీపీ నాయకులు, మద్దతుదారులు తమను అనేక విధాలుగా బెదిరింపులకు పాల్పడ్డారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు వాపోయారు. మండలంలోని పెదపాలెం, తుమ్మపూడి, చిలువూరు, కంఠంరాజు కొండూరు, పేరకలపూడి, శృంగారపురం, పెనుమోలి, మోరంపూడి, చిన్నపాలెం తదితర 12 పల్లెల్లోని పేద రైతులకు ఈ ఏడాది నుంచి కౌలుకు భూమి ఇవ్వడంలేదని వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందు టీడీపీ సామాజికవర్గానికి రైతులు చెప్పడం పరిశీలనాంశం. 'ఎన్నికలు జరగడం కొత్తేమీ కాదు. దశాబ్దాలుగా జరుగుతున్నాయి. ఎవరికిష్టమైన పార్టీకు వారు ఓట్లు వేసుకుంటున్నారు. ఆ తరువాత ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. ఈసారే కులాలు, మతాలు అంటూ దారుణంగా పరిస్థితులు మారాయి'.. అని వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరయ్య వ్యాఖ్యానించారు.

పదవులు వచ్చాయని పగబట్టారు..



మండలంలోని ఓ ప్రధాన సామాజికవర్గం వారు దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ (పసుపు) యార్డు చైర్మన్ పదవిని దశాబ్దాలుగా అనుభవించారు. ఆ పదవిని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఈసారి ఎస్సీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికిచ్చారు. అప్పటి నుంచే ఆ సామాజికవర్గం జీర్ణించుకోలేకపోతోంది. నియోజకవర్గంలోని ఇతర పదవుల విషయంలోనూ వారిది అదే తీరు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చినందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన కౌలు దారులకు మండలంలో సుమారు 200 ఎకరాల వరకు కౌలుకు ఇవ్వడంలేదనేది మా అంచనా. గత ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో బీసీ వర్గీయురాలిపై పోటీచేశారు. ఫలితం తేలాల్సి ఉంది. ఆయన సామాజికవర్గీయులకు చెందిన భూములు కౌలుకు ఇవ్వడంలేదంటే వారి ఆలోచనా తీరును అర్థం చేసుకోవాలి. ఆయన మంగళగిరి నియోజకవర్గ నాయకుడా? లేక రాష్ట్రస్థాయి లీడరా? అనేది ఆయనే తేల్చుకోవాల్సిన విషయం.

– దుగ్గిరాల వీరయ్య, వైఎస్సార్‌సీపీ, దుగ్గిరాల

రెడ్‌బుక్‌లో పేరు ఎక్కిందంటూ బెదిరింపులు..



35 ఏళ్లుగా మా తాత తండ్రుల కాలం నుంచి మూడెకరాలను కౌలుకు చేస్తున్నాం. వాళ్ల ఇళ్లలో అన్నిరకాల పనులూ చేశాం. వైఎస్సార్‌సీపీ వైపు నిలిచినందుకు మాకు భూమి కౌలుకు ఇచ్చేది లేదంటున్నారు. అమరావతి భూముల అంశంలో మాట్లాడినందుకు.. 'నీ పేరు లోకేశ్ రెడ్‌బుక్‌లో ఎక్కింది. ఎన్నికల ఫలితాలు వచ్చాక నీ సంగతి తేలుస్తా'..మని బెదిరిస్తున్నారు. ఏం జరుగుతుందో, ఏమో!

– యలమాటి ప్రసాద్‌కుమార్, పెదపాలెం

ఇల్లు కట్టుకుంటున్నా ఓర్వలేకున్నారు..



మేం ఇల్లు కట్టుకుంటున్నాం. నిర్మాణ సమయంలో పొరుగు ఇంటిపై కాస్త నీళ్లు పడినా, దుమ్ము రేగినా తట్టుకోలేకపోతున్నారు. పనిచేసే భవన కార్మికులను, పనివాళ్లను తిడుతున్నారు. కారణం మేం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచామని.

– షేక్ బాజీ, చిలువూరు

మీరు పార్టీ మారారని మేమూ మారాలా?



'మీరు ఎందుకు జగన్‌కు మద్దతుగా ఉంటున్నారు? ఆ పార్టీని వదిలేసి లోకేశ్‌కు ఓట్లు వేయండి'.. అని మా గ్రామ పెత్తందారు హుకుం జారీచేశారు. మేం జగన్‌ను వదిలే ప్రసక్తిలేదని నాతో పాటు మా బంధువర్గానికి చెందిన వారందరం స్పష్టంగా చెప్పాం. మీరు పార్టీ మారారని, మమ్మల్ని కూడా మారాలని ఆదేశిస్తే అంగీకరించేదిలేదన్నాం. దీంతో పదిహేనేళ్లుగా కౌలుచేస్తున్న రెండెకరాలను ఇచ్చేదిలేదన్నారు. కౌలు డబ్బులు సీజన్‌కు ముందే చెల్లిస్తాం. ఓట్లు వేయనందుకు పొలం ఇవ్వడంలేదనడం వ్యవసాయ సీజన్ మొదలయ్యే ముందు చెప్పడం ఎంతవరకు న్యాయమో వారే ఆలోచించుకోవాలి.

– బుల్లా శ్రీనివాసరావు, పెదపాలెం

డబ్బులు వెనక్కు ఇచ్చేశారు..



భూమి సత్తువ కోసం జొన్న మొదుళ్లను కట్టర్‌తో పనిచేయించాం. రూ.5వేలు ఖర్చయ్యింది. ఆ మొత్తాన్ని మా భూ యజమాని తిరిగి ఇచ్చేశారు. మూడెకరాలను ఈ ఏడాది కౌలుకు ఇచ్చేది లేనిదీ ఇరవై రోజులు తరువాత చెప్తామన్నారు. ఇక వారు చెప్పేదేంటో అర్థమైపోయింది.

– గొడవర్తి ప్రతాప్‌సింగ్, పెదపాలెం

మేమే సాగు చేసుకుంటామంటున్నారు..



పద్నాలుగేళ్లుగా సాగుచేసుకుంటున్న నాలుగెకరాల పొలాన్ని ఈ దఫా కౌలుకు ఇచ్చేలా లేరు. మేమే సాగు చేసుకుంటామని చెబుతున్నారు. మొన్న ఎన్నికల్లో మేం ఫ్యాన్‌కు ఓట్లేశామని వారికి మాపై కోపం.

– షేక్ ఖాంసా, కంఠంరాజుకొండూరు

మా నాన్నకు వీడియోలు చూపించి బెదిరించారు..



మీ అబ్బాయి వైఎస్సార్‌సీపీలో తిరుగుతున్నాడు. పోలింగ్ కేంద్రంలో ఆ పార్టీ తరఫున గట్టిగా మాట్లాడాడు. ఇవిగో వీడియోలు చూడండని ఇంటికెళ్లి మా నాన్న ఇస్మాయిల్‌కు వాటిని చూపించారు. దీంతో.. ఐదేళ్లుగా చేస్తున్న నాలుగెకరాలను ఇక నుంచి కౌలుకు ఇచ్చేదిలేదని చెప్పారు.

– షేక్ సద్దాం హుస్సేన్, చిలువూరు

సర్పంచ్‌గా గెలిచానని..



మాది తుమ్మపూడి. మా అన్న షేక్ ఖాదర్ బాషా. ప్రస్తుతం ఏడాదికి ఎకరానికి రూ.70 వేలు చొప్పున నిమ్మతోటకు కౌలు చెల్లిస్తూ వచ్చాం. పదెకరాలకు 35 ఏళ్ల పాటు ఎప్పటి కౌలు అప్పుడు ఇచ్చేవాళ్లం. నేను సర్పంచ్‌గా పోటీచేసి గెలిచినందుకు మూడేళ్ల నుంచి నిమ్మతోటను మా అన్నకు ఇవ్వలేదు.

– జానీ బాషా, తుమ్మపూడి సర్పంచ్

మీవి భూములైనప్పుడు మావి ఓట్లు కావా?



మా బాబాయి గంపల శ్రీనివాసరావు 22 ఏళ్లుగా రెండెకరాలు కౌలుకు చేసేవారు. ఎకరానికి రూ.35 వేలు చొప్పున ముందస్తు కౌలు క్రమం తప్పక చెల్లించేవారు. ఎంబీఏ చేసిన నేను బీసీ వర్గం నుంచి పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి సర్పంచ్‌గా గెలుపొందాను. అంతమాత్రాన కౌలుకు భూమి ఇచ్చేదిలేదంటే ఎలా? భూములు వారివి అయినప్పుడు ఓట్లు మావి కావా? వారికి మాత్రమే పార్టీ.. మాకు పార్టీ అంటే ఇష్టం ఉండదా? ఇదెక్కడి న్యాయమో అర్థంకావడంలేదు.

– గంపల గంగాధరరావు, పేరుకలపూడి, సర్పంచ్

పేదింట ఆర్థిక వెలుగుకు ఉపాధి హామీ జేగంట!

- పేదలకు సొంత ఆస్తుల కల్పనపై ప్రభుత్వ దృష్టి
- ఉపాధి హామీ పథకంలో పెనుమార్పులు..
- మట్టి రోడ్లు, పండ్లతోటల పెంపకానికి సన్నాహాలు...
- కోడ్ ముగియగానే అనుమతులు...

ఉపాధి హామీ పథకాన్ని రెండిందాలా ప్రయోజనకరంగా మలచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుంది.. అంతకుముందు టీడీపీ హయాంలో పథకాలను ఎంతగా భ్రష్టుపట్టించాలో అంతగానూ దిగజార్చిన దౌర్భాగ్యాన్ని ఈ రాష్ట్రం చూసింది...అందుకు ఉదాహరణ నీరు-చెట్టు వంటి పథకాలే.. తద్భిన్నంగా జగన్ ప్రభుత్వంలో ప్రజోపయోగమైన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పెద్ద పీట వేసింది.. ఇప్పుడా భవనాలు ఊరూరికీ ప్రజాసేవలు అందిస్తున్నాయి.. ఇది నవ్యాంధ్రకు సరికొత్త అభ్యుదయ సంకేతంగా మారింది.. ఉపాధి హామీ పథకాన్ని పేదలకు మరింతగా అక్కరకొచ్చేలా ఆ కుటుంబాలను సమున్నతంగా ఎదిగేలా చేసే నవ్యావిష్కరణకు ప్రభుత్వం ఆలోచన చేసింది... ఇకపై ఊరూరా మట్టి రోడ్ల నిర్మాణానికి, సన్న చిన్న కారు రైతులను పండ్లతోటల పెంపకానికి ప్రోత్సహించి, ఈ పథకం కింద వాటి సాగుకు గుంతల తవ్వకం వంటి పనులను పేదలకే అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా ఉపాధిహామీ పథకాన్ని బలోపేతం చేయాలన్న ఉన్నత లక్ష్యం దిశగా నిర్ణయాలు తీసుకుంటోంది...ఎన్నికల కోడ్ ముగియగానే ఈ ఆలోచనను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది...

సాక్షి, అమరావతి: ఇకపై ఉపాధి హామీ పథకం కింద కూలీల ద్వారా చేపట్టే పనుల్లోనూ ఆయా పేద కుటుంబాల వ్యక్తిగత ఆస్తుల కల్పనకు వీలున్న పనులకే పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఐదేళ్లల్లో.. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కేటగిరీకి సంబంధించిన నిధులను, ఇతర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అనుసంధానం చేసి, దాదాపు అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున గ్రామ సచివాలయాల భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజీ హెల్త్ క్లినిక్ భవనాలు, డిజిటల్ లైబ్రరీ భవనాలు వంటివి.. ఊరందరికీ శాశ్వతంగా ఉపయోగపడే ఉమ్మడి ఆస్తుల నిర్మాణాలు చేపట్టిన విషయం తెలిసిందే. కూలీల ద్వారా చేపటే పనుల్లోనూ ఆయా పేదలు ఒక పక్క పనులు చేసుకుంటూ, చేసిన పనికి రోజు వారీ కూలి డబ్బులు పొందుతున్నారు. ఇకపై ఆయా పనుల ద్వారా వారే వ్యక్తిగతంగా సొంత ఆస్తులు సైతం ఏర్పాటు చేసుకునే దిశగా ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకర చర్యలు చేపట్టింది. ప్రస్తుత ఎన్నికల కోడ్ ముగియగానే ఈ తరహాలో గ్రామాల్లో కొత్తగా పెద్ద ఎత్తున పనుల అనుమతులు తెలిపేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఓ కార్యాచరణను సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని సమయంలో సైతం రాష్ట్రంలో ఏటా 46 లక్షల నుంచి 48 లక్షల కుటుంబాలు ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పథకం పనులను చేసుకుంటూ, ఏటా ఐదున్నర వేల కోట్ల రూపాయల నుంచి ఆరు వేల కోట్ల రూపాయల వరకు లబ్ధిపొందుతున్నాయి. రాష్ట్రంలో 2019 నుంచి ఇప్పటి వరకు ఆయా కుటుంబాలు ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం పనులు చేసుకోవడం ద్వారా ప్రత్యక్షంగా దాదాపు రూ.27,000 కోట్ల మేర కూలి రూపంలో లబ్ధిపొందాయి. ఇకపై ఆయా పనులు చేసుకునే కూలీలకు వ్యక్తిగత ఆస్తిని తయారు చేసే పనులే ఎక్కువగా ఉండేలా పనులు గుర్తించాలంటూ ప్రభుత్వం గత ఐదేళ్లుగా అనేకసార్లు ఎప్పటికప్పుడు జిల్లా, మండల, గ్రామ స్థాయి ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. చాలాచోట్ల ఇప్పటి దాకా ఎక్కువగా గ్రామాల్లో ఊరచెరువుల్లో పూడికతీత, లేదంటే రైతుల పొలాలకు సాగునీరు వెళ్లే కాల్వలకు పూడిక తీత ..వంటి పనులనే స్థానికంగా చేపడుతున్నారని... ఇక నుంచి ఈ తరహా పనులను వీలైనంత మేర తగ్గించి, పేదలకు రెండు రకాలా ప్రయోజనకరంగా ఉండే పనులను చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోబోతున్నారు.

మట్టి రోడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకానికి పెద్ద పీట..

గ్రామాల్లో పేదలు కూలి పనులు చేసుకుంటూ సొంతంగా ఆస్తుల కల్పనకు ఉపయోగపడేందుకు అవకాశమున్న పనులను గుర్తించే ప్రక్రియను గ్రామాల్లో ఐదు నెలల క్రితమే అధికారులు చేపట్టారు. రోడ్డు వసతి లేని మారుమూల గిరిజన ప్రాంతాల్లో కేవలం కూలీల ద్వారా మట్టి రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దీంతో పాటు సన్న చిన్నకారు రైతులను వివిధ రకాల పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహించి, వాటి సాగులో గుంతల తవ్వకం మొదలు, మొక్కలు నాటే పనులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించడం వంటి పనులకు పెద్ద సంఖ్యలో అనుమతులివ్వడానికి కార్యాచరణను సిద్ధం చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. దీనికితోడు గ్రామాల్లో కొత్తగా చేపల చెరువుల నిర్మాణ పనులకూ అనుమతులు తెలపనున్నట్టు వారు చెబుతున్నారు.

సీల్ లేదని పోస్టల్ బ్యాలెట్ తిరస్కరించొద్దు

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై సీఈఓ ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాలు

సాక్షి, అమరావతి: డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ ఆఫీసర్ స్టాంప్ (సీల్) లేదన్న ఏకైక కారణంతో పోస్టల్ బ్యాలెట్లను తిరస్కరించొద్దని ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. జూన్ 4న రాష్ట్రంలో జరిగే ఓట్ల లెక్కింపులో పోస్టల్ బ్యాలెట్ విషయంలో అనుసరించాల్సిన నిబంధనలను స్పష్టం చేస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లకు, జిల్లా ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఎన్నికల సంఘం ఏర్పాటుచేసిన అటెస్టింగ్ ఆఫీసర్లు కొంత మంది సీల్ వేయకుండా కేవలం సంతకాలు మాత్రమే చేశారని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తమ ఓట్లను తిరస్కరించకుండా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి పలు విజ్ఞాపనలు వచ్చాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న మీనా జూలై 19, 2023లో కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన ఆదేశాలను ఉటంకిస్తూ తాజాగా ఉత్తర్వులను జారీచేశారు. దీని ప్రకారం..

- డిక్లరేషన్ ఫారం మీద అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, పేరు, హోదా తప్పనిసరిగా ఉండాలని, ఇవి ఉండి స్టాంప్ లేకపోయినా వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు.
- ఒకవేళ అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం మీద అనుమానమొస్తే ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద రిటర్నింగ్ ఆఫీసర్లు ఏర్పాటుచేసిన అటెస్టింగ్ ఆఫీసర్ల వివరాలతో సరిపోల్చి నిర్ణయం తీసుకోవాలి.
- అదే విధంగా.. పోస్టల్ బ్యాలెట్ పేపర్ వెనుక రిటర్నింగ్ ఆఫీసరుగానీ లేదా ఫెసిలిటేషన్ సెంటర్ ఇన్‌ఛార్జి సంతకం తప్పనిసరిగా ఉండాలి.
- బ్యాలెట్ పేపర్ వెనుక సంతకం విషయంలో ఏమైనా సందేహాలొస్తే సీరియల్ నెంబర్ ప్రకారం కౌంటర్ ఫాయిల్‌ను పరిశీలించి అది నిజమైన బ్యాలెట్ అవునా కాదా అని నిర్ధారించుకోవాలి. ఒకవేళ సందేహం ఉంటే వాటిని తిరస్కరించాలి.
- అలాగే, ఓటరు కవర్-బీ మీద సంతకంలేదన్న కారణంతో కూడా ఓటును తిరస్కరించకూడదు. డిక్లరేషన్ ఫాం-13ఏ ప్రకారం ఓటరును గుర్తించవచ్చు. ఇవికాక.. బ్యాలెట్ పేపర్ ఉండే ఇన్నర్ కవర్ ఫారం-13బీనీ తెరవకుండానే ఈ సమయాల్లో ఓటును తిరస్కరించవచ్చు..
- కవర్-బీని తెరవగానే, ఓటరు డిక్లరేషన్ ఫారం లేకపోతే, డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ లేదా అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం లేకపోయినా, ఫారం-13ఏ, ఫారం-13బీలో బ్యాలెట్ సీరియల్ నెంబర్లు వేర్వేరుగా ఉంటే బ్యాలెట్ పేపర్ తెరవకుండానే తిరస్కరించొచ్చు. ఈ విధానం అంతా పూర్తయి బ్యాలెట్ పేపరు తెరిచిన తర్వాత ఈ దిగువ పేర్కొన్న సందర్భాల్లో కూడా ఓటును తిరస్కరించొచ్చు.
- ఎవరికి ఓటు వేయకపోతే.. ఒకరి కంటే ఎక్కువ మందికి ఓటువేసినా.. అనుమానాస్పద బ్యాలెట్ పేపరుగా గుర్తించినా.. బ్యాలెట్ పేపరు చిరిగిపోయినా.. అది నిజమైన బ్యాలెట్ అని నిర్ధారించడానికి అవకాశంలేని సమయంలో.. రిటర్నింగ్ ఆఫీసరు ఇచ్చిన కవర్-బీ లేకపోతే.. ఓటరు ఎవరో గుర్తించే విధంగా ఏమైనా గుర్తులు, లేక రాత ఉన్న సందర్భాల్లో తిరస్కరిస్తారు.

ఈ విషయాలను రాజకీయ పార్టీలు, కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన కల్పించేలా రిటర్నింగు అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా మీనా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒక్క ప్రసవమూ చేయని ఎంవోలపై చర్యలు

ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

సాక్షి, అమరావతి : గత కొన్ని రోజులుగా ఒక్క ప్రసవమూ చేయని పీహెచ్‌సీ వైద్యాధికారుల(ఎంవో)పై చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో జీరో ప్రసవాలు ఉండేందుకు వీల్లేదన్నారు. వయోజనులకు బీసీజీ టీకాల పంపిణీలో వెనుకబడిన గుంటూరు, విశాఖపట్నం జిల్లాల అధికారులు వీలైనంత త్వరగా పరిస్థితిని చక్కదిద్దాలని ఓ ప్రకటనలో ఆయన సూచించారు.

నేటి భవితలో..

- టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1: ప్రిలిమ్స్ గట్టెక్కేలా..! టీఎస్‌పీఎస్సీ జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించనుంది. రాష్ట్ర స్థాయిలో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ వంటి ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేసే ఈ పరీక్షలో మొత్తం 563 పోస్టులకు నాలుగు లక్షలకుపైగానే దరఖాస్తులు వచ్చాయి. గతంలో రెండుసార్లు ప్రిలిమ్స్ రాసిన వారు, సివిల్స్ అభ్యర్థులతోపాటు ఫ్రెషర్స్ కూడా పోటీ పడే అవకాశముంది. కాబట్టి ప్రిలిమ్స్‌లో అర్హత సాధించడం అత్యంత కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్ గట్టెక్కేందుకు నిపుణుల ఎగ్జామ్ డే టిప్స్..
- గ్రూప్స్ ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. నిపుణులు రూపొందించిన ఇండియన్ పాలిటీ స్టడీమెటీరియల్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

క్లుప్తంగా...

జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌కు త్వరలో లీగల్ నోటీస్

సీఎస్ కార్యాలయం వెల్లడి

సాక్షి, అమరావతి: విశాఖపట్నం జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌కు త్వరలో లీగల్ నోటీస్ జారీ చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నంలో జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ శనివారం సీఎస్ జవహర్‌రెడ్డిపై చేసిన అసత్యమైన, నిరాధార ఆరోపణలు వాస్తవం కాదని ఇప్పటికే ఖండిస్తూ పత్రికా ప్రకటన, రిజాయిండర్ ఇచ్చినట్లు సీఎస్ కార్యాలయం పేర్కొంది. అయినప్పటికీ మూర్తి యాదవ్ ఆదివారం విశాఖపట్నంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి సీఎస్ జవహర్‌రెడ్డిపై మరోసారి అవే అసత్య, నిరాధారమైన ఆరోపణలను చేయడం తీవ్రంగా పరిగణించినట్లు తెలిపింది. మూర్తి యాదవ్ చేసిన ఆరోపణలకు సంబంధించి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు న్యాయ నిపుణులను సంప్రదించామని, త్వరలోనే లీగల్ నోటీస్ జారీచేస్తామని సీఎస్ కార్యాలయం స్పష్టంచేసింది.

1,200వ రోజుకు చేరిన ఉక్కు పరిరక్షణ దీక్షలు



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

అగనంపూడి(విశాఖ): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం 1,200 రోజులుగా ఉద్యమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్న ఉక్కు ఉద్యమకారులు, వారికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఉద్యమాభినందనలు అని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,200వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును 100శాతం వ్యూహాత్మక అమ్మకాలకు ప్రకటించినప్పటి నుంచి నేటి వరకు అలుపెరగని యోధుల్లా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. కార్మికుల ఉద్యమంతోనే కేంద్ర ప్రభుత్వం కొద్దిగా భయపడి వెనుకడుగు వేస్తుందన్నారు. ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం నేడు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి, ఇబ్బందులకు కేంద్ర ప్రభుత్వంతోపాటు యాజమాన్యం వైఖరి కూడా కారణమన్నారు. యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను కాగ్ కూడా తూర్పారబట్టిందన్నారు. ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు సరఫరా విషయంలో ఏకపక్ష నిర్ణయాలతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఈ దుస్థితికి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఎస్.రామారావు, కె.సత్యనారాయణరావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వైటీ దాస్, విళ్లా రామ్మోహన్‌కుమార్, బొడ్డు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరుడిపై కేసు నమోదు

కండ్లకుంట నుంచి వచ్చి మంగళగిరిలో ఫిర్యాదు చేసిన టీడీపీ కార్యకర్త

మంగళగిరి: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కండ్లకుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నోముల మాణిక్యారావు జిల్లా దాటి గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం విశేషం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెంకట్రామిరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో యువకుడి నిర్బంధం

- విశాఖ పోలీసు కమిషనర్‌కు బాధితుడి తండ్రి ఫిర్యాదు

దాబాగార్డెన్స్ (విశాఖ జిల్లా): చైనా కంపెనీ చెరలో విశాఖకు చెందిన మరో యువకుడు నరకం చూస్తున్నాడు. చినముషిడివాడకు చెందిన టి.శివ తన కుమారుడు రాజేష్ (33) బ్యాంకాక్‌లో పడుతున్న బాధలను సీపీ దృష్టికి ఆదివారం తీసుకెళ్లారు. తన కుమారుడు ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ చదివి విశాఖలో ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో కార్డియాలజీ టెక్నీషియన్‌గా పనిచేసేవాడని, మెరుగైన ఉపాధి నిమిత్తం విదేశాల్లో ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో అన్వేషించి థాయ్‌ల్యాండ్‌లోని క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రో అనే కంపెనీలో చాట్ సపోర్ట్ స్టాఫ్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడన్నారు. అక్కడనుంచి మంచి స్పందన రావడంతో తనొక్కడే గత నెల 25న విశాఖ నుంచి బయల్దేరి వెళ్లాడని ఆయన సీపీ దృష్టికి తీసుకెళ్లారు. 26న థాయ్‌లాండ్‌లోని ఫ్లిప్పర్ హౌస్ అనే హోటల్‌లో బసకు దిగినట్లు రాజేష్ సమాచారమిచ్చాడని చెప్పారు. ఆ తర్వాత ఈ నెల 10 నుంచి తాను ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు 66808795908 ఫోన్ నంబర్ నుంచి కుటుంబ సభ్యులకు వాట్సాప్‌కాల్ చేశాడని.. తాను ఎంపికైన సంస్థలో ఉద్యోగం ఇవ్వకుండా బ్యాంకాక్ తరలించారని, మయన్మార్ సరిహద్దుల్లోని ఓ చైనీస్ కంపెనీలో తనను నిర్బంధించారని, ఫోన్ కూడా లాగేసుకున్నట్లు రాజేష్ తమకు సమాచారమిచ్చాడని శివ పోలీసులకు తెలిపారు. తన కుమారుడిని కాపాడాలని కోరారు.

ఆ మూడు కేసుల్లోనూ ‘పిన్నెల్లి’కి

మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వండి

- ఈవీఎంల కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వగానే హత్యాయత్నం కేసులు పెట్టారు
- ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా నిరోధించేందుకే ఈ తప్పుడు కేసులు
- హైకోర్టుకు నివేదించిన సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి
- టీడీపీ నేత అస్మిత్‌పై హత్యాయత్నం కేసున్నా బెయిల్‌ను వ్యతిరేకించని పోలీసులు
- పోలీసుల తరపున వాదనలు వినిపించిన ప్రైవేటు న్యాయవాది
- పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను పక్కన పెట్టేందుకు వ్యూహరచన
- హైకోర్టు చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి
- నిమ్మగడ్డకు సేవలు అందించిన న్యాయవాదే ఈ కేసులోనూ హాజరు
- ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న డీజీపీ కార్యాలయం



సాక్షి, అమరావతి: ఈవీఎంల ధ్వంసం కేసులో హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసిన వెంటనే పోలీసులు వేర్వేరుగా మరో మూడు కేసులు నమోదు చేయడాన్ని సవాలుచేస్తూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హత్యాయత్నం చేశానంటూ నమోదు చేసిన ఈ కేసుల్లో తనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ అత్యవసరంగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా నిరోధించేందుకే తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఆదివారం అయినప్పటికీ ఈ వ్యాజ్యాల అత్యవసర దృష్ట్యా న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తన ఇంటి వద్దే విచారణ చేపట్టారు. దాదాపు రెండు గంటలపాటు వాదనలు కొనసాగాయి. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

ఎన్నికల సంఘం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది..

పిన్నెల్లి తరపున సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టుచేసి తీరాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ అసాధారణ రీతిలో వ్యవహరిస్తోందన్నారు. ఎప్పుడూ కూడా ఎన్నికల కమిషన్ ఇలా వ్యవహరించలేదన్నారు. నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ కక్ష సాధింపు ధోరణి చూపుతోందని.. తన పరిధి దాటి వ్యవహరిస్తోందని తెలిపారు. పిన్నెల్లి అరెస్టు విషయంలో డీజీపీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని, అది ఎందుకో అర్థంకావడం లేదన్నారు. ఈవీఎంల ధ్వంసం కేసులో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన వెంటనే తెల్లారేలోపు పిన్నెల్లిపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారన్నారు. అప్పటివరకు ఆ కేసుల గురించి కనీస ప్రస్తావన కూడా తేలేదన్నారు. ఘటన 13న జరిగితే పది రోజుల తరువాత పిటిషనర్‌పై కేసు నమోదు చేశారన్నారు. అలాగే, మరో కేసును కూడా ఘటన జరిగిన పది రోజుల తరువాత నమోదు చేశారని తెలిపారు. ఓ కేసులో ఫిర్యాదుదారు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి అని తెలిపారు. హత్యాయత్నం చేశారని పది రోజుల తరువాత ఫిర్యాదు చేసిన ఆ వ్యక్తి, ఘటన జరిగిన రోజునే ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. కట్టుకథ అల్లి, ఎలాగైనా పిన్నెల్లిని అరెస్టుచేయాలన్న దురుద్దేశంతోనే ఈ కేసులు నమోదు చేశారని నిరంజన్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. ఈ మూడు కేసులు కూడా ఎన్నికలకు సంబంధించినవేనని.. ఒకే అంశంపై మూడు ఎఫ్ఐఆర్‌లు చెల్లవన్నారు. కేసుల నమోదులో పది రోజుల జాప్యం ఎందుకు జరిగిందో చెప్పడంలేదన్నారు. పిన్నెల్లి దాడిచేశారని చెబుతూ ఓ నిమిషం వీడియోను బయటపెట్టారని, వెబ్‌క్యాస్టింగ్ ఉన్నప్పుడు మొత్తం వీడియోను పరిశీలించి ఆ తర్వాతే చర్యలు తీసుకుని ఉండాల్సిందని నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఇప్పుడు మూడు కేసులు పెట్టారని, రేపు ఇంకొన్ని కేసులు పెడతారని, వీటి వెనుక ఎవరున్నారో పోలీసులకు బాగా తెలుసునన్నారు.

అలా చేయడం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అవమానించడమే..

ఈ కేసులో డీజీపీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని, అందుకే రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) ఉండగా, పోలీసుల తరపున వాదనలు వినిపించుకునేందుకు మరో ప్రైవేటు న్యాయవాదిని నియమించుకునే ప్రయత్నం చేశారన్నారు. ఇలా చేయడం పీపీని అవమానించడమేనన్నారు. ఒకవేళ ప్రైవేటు న్యాయవాది ప్రత్యేకంగా వాదనలు వినిపించాలనుకుంటే అందుకు ప్రభుత్వం జీఓ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. అలాంటి పరిస్థితి లేకపోవడంతో, ఫిర్యాదుదారు అయిన పోలీసు తరపున ఆ న్యాయవాది హాజరవుతున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాస్తవానికి తమ ముందస్తు బెయిల్‌ను పీపీ తీవ్రంగా వ్యతిరేకించారని, అయినా కూడా ఓ ప్రైవేటు న్యాయవాదిని నియమించుకోవాలని ప్రయత్నించారంటే తెర వెనుక ఎంత వ్యూహ రచన జరుగుతోందో అర్థంచేసుకోవచ్చునన్నారు. ఈవీఎం ధ్వంసం కేసులో జూన్ 6 వరకు అరెస్టు నుంచి రక్షణనిచ్చారని, ఈ కేసుల్లో కూడా అలాంటి రక్షణనే ఇవ్వాలని నిరంజన్‌రెడ్డి కోర్టును అభ్యర్థించారు. అలాగే, హత్యాయత్నం చేశారని చెప్పినంత మాత్రాన ఆ సెక్షన్ కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదని.. అందుకు నిర్దిష్ట విధానం ఉందని ఆయన వివరించారు. సహ నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పిన్నెల్లిపై మరో కేసు పెట్టారని, ఇది ఎంతమాత్రం చెల్లదన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా పిన్నెల్లిని నిలువరించడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్, పోలీసులు పనిచేస్తున్నారని న్యాయమూర్తికి నిరంజన్‌రెడ్డి తెలిపారు.

పిన్నెల్లి తీవ్ర నేరాలకు పాల్పడ్డారు..

తరువాత పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈవీఎంల కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసే సందర్భంలో పిన్నెల్లిపై నిఘా పెట్టాలని ఈ కోర్టు పోలీసులను ఆదేశించిందన్నారు. అయితే, ఇప్పటివరకు పిటిషనర్ ఆచూకీ తెలీలేదని, ఇది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనన్నారు. దర్యాప్తులో వెలుగుచూసిన వాస్తవాల ఆధారంగా కేసులు పెట్టామని తెలిపారు. పిన్నెల్లి తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని, అందువల్ల ఆయన మధ్యంతర ముందస్తు బెయిల్‌కు అర్హుడు కారన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేస్తామన్నారు. కౌంటింగ్ రోజున మరిన్ని అల్లర్లు సృష్టించే అవకాశం ఉందన్నారు.

పోలీసుల తరఫున ప్రైవేటు న్యాయవాది అసాధారణం..

ఇదిలా ఉంటే.. పిన్నెల్లి విషయంలో పోలీసు ఉన్నతాధికారుల చర్యలు అసాధారణంగా ఉన్నాయి. అందుకు ఆదివారం హైకోర్టులో జరిగిన పరిణామాలే నిదర్శనం. ఫిర్యాదుదారుగా ఉన్న పోలీసు తరపున ఓ ప్రైవేటు న్యాయవాది హాజరుకావడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. పోలీసు ఫిర్యాదుదారుగా ఉన్న కేసుల్లో ఇప్పటివరకు ఆ పోలీసు తరపున ప్రైవేటు న్యాయవాది హాజరైన ఉదంతాలు హైకోర్టు చరిత్రలో ఇప్పటివరకు లేవు. సాధారణంగా పోలీసుల తరపున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటరే హాజరవుతుంటారు. అయితే, పిన్నెల్లి విషయంలో డీజీపీ కార్యాలయం ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. కారంపూడి కేసులో ఫిర్యాదుదారు అయిన సీఐ నారాయణస్వామి తరపు న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ హాజరయ్యారు. వాస్తవానికి.. పిన్నెల్లిపై ఉన్న కేసుల్లో పోలీసుల తరపున వాదనల కోసం అశ్వనీకుమార్‌నే నియమించుకోవాలని డీజీపీ కార్యాలయం భావించింది. అయితే, అందుకు ప్రభుత్వం జీఓ జారీచేయాల్సి ఉండటంతో వారి ప్రయత్నాలు కార్యరూపం దాల్చలేదు. చివరకు నారాయణస్వామి తరపున అశ్వనీకుమార్‌ను రంగంలోకి దించారు. అశ్వనీకుమార్ మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కు అత్యంత సన్నిహితుడు. ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు రమేష్‌కుమార్ ఎన్నికల సంఘం తరపు న్యాయవాదిగా అశ్వనీకుమార్‌ను నియమించారు. తన పదవీ విరమణ తరువాత కూడా వ్యక్తిగతంగా నిమ్మగడ్డ రమేష్‌కుమార్ కేసులు అశ్వనీ వాదించారు. ఇప్పుడు పిన్నెల్లి కేసులో అశ్వనీకుమార్ తెరపైకి రావడం వెనుక కూడా నిమ్మగడ్డ ఉన్నారన్న వాదన వినిపిస్తోంది. అలాగే, టీడీపీ, జనసేన నాయకుల తరపున కూడా అశ్వనీకుమార్ కేసులు వాదించారు.

పిన్నెల్లిని ఎప్పుడు నిందితుడిగా చేర్చారో చెప్పండి..

ఈ సమయంలో సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి స్పందిస్తూ.. ముందస్తు బెయిల్ మంజూరు చేసిన వెంటనే ఈ కేసులు పెట్టారని, ఆ విషయం తెలిసి కూడా తామెలా బయటకు రాగలమన్నారు. ఈ కేసులన్నీ కూడా పాత తేదీలతో నమోదు చేశారని తెలిపారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. క్రైం నెంబర్ 59లో పిన్నెల్లిపై ఎప్పుడు కేసు నమోదు చేశారని ప్రశ్నించారు. 23న చేశారని నిరంజన్‌రెడ్డి చెప్పగా, కాదని 22నే చేశామని పీపీ నాగిరెడ్డి చెప్పారు. ఇది పచ్చి అబద్ధమని, ఈవీఎంల కేసులో హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చిన తరువాతే పిన్నెల్లిని నిందితునిగా చేర్చారన్నారు. ఇక్కడే పోలీసుల కుట్ర బయటపడుతోందన్నారు. పోలీసులు పీపీకి సైతం వాస్తవాలు చెప్పడం లేదన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇప్పటికే పారా మిలటరీ బలగాలను రంగంలోకి దించారన్నారు.

పిన్నెల్లి చరిత్రను చూడండి..

అనంతరం.. సీఐ నారాయణస్వామి తరపు న్యాయవాది ఎస్. అశ్వనీకుమార్ వాదనలు వినిపిస్తూ, ముందస్తు బెయిల్ మంజూరు చేసేటప్పుడు పిటిషనర్ పిన్నెల్లి చరిత్రను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. 2019 ఎన్నికల్లో కూడా ఇలాగే ఆయన పలు నేరాలకు పాల్పడ్డారన్నారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి, క్రైం నెం 59లో పూర్తి వివరాలను తమ ముందుంచాలని పీపీని ఆదేశించారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

అస్మిత్ విషయంలో మాట్లాడని పోలీసులు

ఇక తాడిపత్రిలో జరిగిన అల్లర్లకు సంబంధించి టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఆ కేసులో ఆయనకు హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కానీ, ఈ కేసు విచారణ సందర్భంగా పోలీసులు ఎక్కడా కూడా ఆయన ముందస్తు బెయిల్‌ను వ్యతిరేకించలేదు. కేవలం షరతులు విధించాలని మాత్రమే కోరారు. అదే సమయంలో ఈవీఎంల కేసులో పిన్నెల్లి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మాత్రం తీవ్రంగా వ్యతిరేకించారు. వాస్తవానికి.. ఆ కేసులో పిన్నెల్లిపై హత్యాయత్నం ఆరోపణలు లేవు. కానీ, టీడీపీ అభ్యర్థి అస్మిత్‌పై ఉన్నాయి. అయినా కూడా పోలీసులు అస్మిత్ విషయంలో ఓ రకంగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి విషయంలో మరో రకంగా వ్యవహరించారు. ఇదంతా కూడా పోలీసులు కావాలనే చేస్తున్నారనేందుకు ఇది ప్రత్యక్ష నిదర్శనం.

తాపీగా తప్పుడు కేసులు

పిన్నెల్లికి బెయిల్ రావడంతో మరో మూడు అక్రమ కేసులు

సాక్షి, అమరావతి: రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఈసీ నియమించిన పోలీసు అధికారులు స్వామి భక్తి చాటుకునేందుకు బరి తెగిస్తున్నారు. పోలింగ్ రోజు పల్నాడు, అనంతపురం, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు నిదర్శనం. పల్నాడులో ప్రధానంగా మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజు టీడీపీ శ్రేణులు విధ్వంసం సృష్టించేందుకు కుట్ర చేస్తున్నట్లు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆర్వో (రిటర్నింగ్ అధికారి) నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వరకూ, ఎస్పీ నుంచి డీజీపీ దాకా పలుదఫాలు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న రెంటచింతల మండలంలో ఎన్నికల రోజు భారీగా పారా మిలటరీ బలగాలను మోహరించగా, టీడీపీ మద్దతుదారులున్న చోట్ల హోంగార్డులతో సరిపెట్టడం గమనార్హం.

తాపీగా సీఐ ఫిర్యాదు..

మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసంపై ఈనెల 20న నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతా నుంచి ఎడిట్ చేసిన ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఈవీఎం ధ్వంసమైనట్లు పీవో లాగ్ బుక్‌లో ఎక్కడా నమోదు చేయలేదు. పోలింగ్‌కు విఘాతం కలిగినట్లు పేర్కొనలేదు. సిట్ కూడా దీని గురించి ప్రస్తావించలేదు. ఈ ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి పాల్గొన్నట్లు చెప్పలేదు. ఈనెల 18న డీజీపీకి సిట్ ఇచ్చిన నివేదికలోనూ ఆ ప్రస్తావనే లేదు. అసలు వెబ్‌కాస్టింగ్ నుంచి అది ఎలా లీకైంది? నిజమైనదేనా? మార్ఫింగ్ చేసిందా? అనే విషయాలను ధ్రువీకరించుకోకుండా పిన్నెల్లిని అరెస్టు చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాలు జారీ చేశారు. దీన్ని సవాల్ చేసిన పిన్నెల్లికి హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో పోలీసులు మరో మూడు అక్రమ కేసులు బనాయించారు. ఈ నెల 14న కారంపూడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను చెదరగొడుతుండగా తన తలకు గాయమైందని, ఆ ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి ఉన్నారంటూ సీఐ నారాయణస్వామి తాపీగా ఈనెల 22న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఒక కేసు నమోదైంది. పోలింగ్ రోజు తనను హత్య చేయడానికి పురిగొల్పారని ఆరోపణలు చేసిన ఓ టీడీపీ నేత ఫిర్యాదు ఆధారంగా మరో కేసు నమోదు చేయగా, తనను చంపుతానని బెదిరించారంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మూడో కేసును పిన్నెల్లిపై నమోదు చేశారు. వీటిని పరిశీలిస్తే కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు ఇలా చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

టీడీపీ గూండాలకు చట్టం చుట్టమా?

నరసరావుపేటలో పోలింగ్ రోజు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారు. గోపిరెడ్డి దొరకకపోవడంతో ఆయన మామపై పచ్చ మూక దాడి చేసింది. అయితే హత్యాయత్నానికి పాల్పడ్డ టీడీపీ గూండాలపై కేసు నమోదు చేయకుండా ఆ కేసును పోలీసులు గోపిరెడ్డిపై బనాయించడం విస్మయం కలిగిస్తోంది. నరసరావుపేట టీడీపీ అభ్యర్థి అరవిందబాబు ఇంట్లో పెట్రోల్ బాంబులు, మారణాయుధాలు లభ్యమైతే ఆయనపై చిన్న కేసుతో సరిపుచ్చారు. పోలింగ్ మర్నాడు కారంపూడిలో టీడీపీ మూకలు పేట్రేగినా పోలీసులు కనీసం నిలువరించే ప్రయత్నం చేయలేదు.

పిన్నెల్లి హత్యకు పథకం

▶ మొదటి పేజీ తరువాయి

టీడీపీ మూకల విధ్వంసకాండను రుజువు చేసే పలు వీడియోలను ప్రదర్శించారు.

పిన్నెల్లి 2009 నుంచి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మాచర్లలో వైఎస్సార్‌సీపీకి బలమైన పునాది వేశారు. మాచర్లలో టీడీపీ అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తోందని, గట్టి భద్రత కల్పించి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపాలని కోరుతూ ఈనెల 11న ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్, పోలీసు ఉన్నతాధికారులకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వినతిపత్రం అందచేశారు.

- మాచర్ల నియోజకవర్గంలో ఇప్పటివరకూ అల్లర్లు జరగని ప్రాంతాల్లో పారా మిలటరీ బలగాలను నియమించిన అధికారులు ఘర్షణలు చోటుచేసుకునే చోట్ల మాత్రం హోంగార్డులతో సరిపుచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై టీడీపీ మూకలు దాడి చేస్తుంటే ప్రేక్షకపాత్ర వహించడం ద్వారా పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు కుట్ర చేశారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులను భయభ్రాంతులకు గురి చేసి టీడీపీ మూకలు రిగ్గింగ్‌కు పాల్పడ్డాయి.
- ఈనెల 13న పోలింగ్ రోజు పాల్వాయి గేట్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసమైనట్లు పీవో లాగ్ బుక్‌లో ఎందుకు నమోదు చేయలేదు? అరక్షణమైనా పోలింగ్‌కు విఘాతం కలిగిందా? ఈనెల 17న విచారణకు వెళ్లిన సిట్ బృందానికైనా ఈవీఎం ధ్వంసం గురించి చెప్పారా? ఈనెల 18న డీజీపీకి సిట్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలోనూ ఎమ్మెల్యే పిన్నెల్లి పేరు లేదు. ఈవీఎంను పిన్నెల్లి ధ్వంసం చేసినట్లు ఆ నివేదికలో ఎక్కడా లేదు. మీడియాకు సిట్ విడుదల చేసిన నివేదికే అందుకు తార్కాణం.
- ఈనెల 20న లోకేశ్ ట్వీట్ ఆధారంగా పిన్నెల్లిని అరెస్టు చేయాలని ఈసీ మర్నాడు ఆదేశించింది. లోకేశ్‌కు ఆ వీడియో ఎలా వచ్చిందని మీడియా ప్రశ్నిస్తే తన కార్యాలయం నుంచి లీక్ కాలేదని, ఎలా వచ్చిందో విచారణలో తేలుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి పేర్కొనడం హాస్యాస్పదం.
- ఈసీ ఉత్తర్వులపై పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించి ఈనెల 22న బెయిల్ తెచ్చుకుంటే అదే రోజు ఆయనపై తప్పుడు కేసు బనాయించారు. ఈనెల 14న కారంపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చెదరగొట్టేటప్పుడు తనకు గాయమైందని, తనపై దాడి చేసిన వారిలో పిన్నెల్లి ఉన్నారని ఈనెల 22న సీఐ నారాయణస్వామి తాపీగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. పిన్నెల్లి పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చి తప్పుడు కేసు బనాయించారు. సీఐకి 14న గాయమైతే 22 వరకూ స్టేట్‌మెంట్ ఇవ్వకుండా ఏం చేశారు?
- పోలింగ్ మర్నాడు పారా మిలటరీ బలగాలు మాచర్లలో ఉన్నా పక్కనే ఉన్న కారంపూడిలో సీఐ నారాయణస్వామి, ఎస్సై రామాంజనేయులు అండతో చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన టీడీపీ రౌడీమూకలు విధ్వంసానికి తెగబడ్డాయి. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేసినా పోలీసులు పట్టించుకోలేదు.
- టీడీపీకి లొంగిపోయిన ఎన్నికల వ్యవస్థ, పోలీసు వ్యవస్థలు పిన్నెల్లిపై కక్ష కట్టి తప్పుడు కేసులు బనాయిస్తున్నాయి. మాచర్లలో ఎన్నికల హింసకు సంబంధించి ఎస్పీ, డీఎస్పీ, ఎస్సై సస్పెండైనా ఐజీ త్రిపాఠీకి సన్నిహితుడైన సీఐ నారాయణస్వామిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గతంలో కారంపూడి ఎస్ఐగా ఉన్నప్పుడు అత్యంత వివాదాస్పదంగా వ్యవహరించి సస్పెన్షన్‌కు గురైన నారాయణస్వామిని సీఐగా ఎలా నియమిస్తారు? ఆయన వ్యవహార శైలిపై గత నెల 8నే ఎమ్మెల్యే పిన్నెల్లి ఫిర్యాదు చేసినా ఈసీ పట్టించుకోలేదు.
- పోలింగ్ రోజు టీడీపీ కార్యకర్తను హత్య చేసేందుకు పురిగొల్పారని, మహిళలను చంపుతానని బెదిరించారని పిన్నెల్లిపై ఈనెల 23న మరో రెండు కేసులు నమోదు చేశారు. ఇలా ఇంకెన్ని తప్పుడు కేసులు బనాయిస్తారో డీజీపీ వెల్లడించాలి. పిన్నెల్లిని కౌంటింగ్‌కు రానివ్వకుండా చేసి దౌర్జన్యాలకు తెగబడాలని టీడీపీ కుట్రలు చేస్తోంది. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన ఈసీ అందుకు వంత పాడటం దారుణం.

‘కాంబోడియా’ కేసులో మరో ఇద్దరు ఏజెంట్ల అరెస్టు

- డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల పేరిట యువకులకు వల
- కమీషన్‌కు కక్కుర్తిపడి నట్టేట ముంచుతున్న ఏజెంట్లు
- చైనా కంపెనీల చేతిలో చిక్కుకుని లబోదిబో

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): విదేశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటింగ్ ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకులను విదేశాలకు తరలిస్తున్న మరో ఇద్దరు ఏజెంట్లను విశాఖపట్నం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆపరేషన్ కాంబోడియా పేరిట సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న సుమారు 25 మంది యువకులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ చొరవతో క్షేమంగా విశాఖకు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇంకా కాంబోడియాలో చిక్కుకొని ఉండిపోయిన బాధితులను తీసుకొచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ రవిశంకర్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన విడుదలచేసిన ప్రకటన వివరాలు ఇలా ఉన్నాయి. సైబర్ నేరాలను అరికట్టడానికి, వాటి మూలాలు ఛేదించడానికి విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప పర్యవేక్షణలో విశాఖ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. కాంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ వంటి దేశాలకు యువకులను పంపిస్తున్న గాజువాక, భానుజీనగర్ ప్రాంతానికి చెందిన కన్సల్టెన్సీ ఏజెంట్‌ను అదుపులోకి తీసుకోగా విస్తుపోయే వాస్తవాలు బయటికి వచ్చాయి. కన్సల్టెన్సీ ఏజెంట్ కొలుకుల వీరేంద్రనాథ్(37) ఇంజనీరింగ్ చదివి 2023 నుంచి కాంబోడియా దేశానికి ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకులను పంపిస్తున్నాడు. అనకాపల్లికి చెందిన రామకృష్ణను పరిచయం చేసుకొని, తాను కాంబోడియా దేశం నుంచి వచ్చానని, అక్కడికి కంప్యూటర్ సిస్టమ్ ఆపరేటర్‌గా పంపిస్తే మంచి కమీషన్ వస్తుందని చెప్పాడు. కంప్యూటర్ నాలెడ్జ్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 17 మంది నుంచి రూ.లక్షా 20 వేల చొప్పున తీసుకుని పంపించారు. వారికి ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు కమీషన్ లభించింది. అధిక మొత్తంలో లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో వీరేంద్రనాథ్, అతని భార్య శ్రీప్రియ కాంబోడియా ఏజెంట్‌కు అనేక మంది సిస్టమ్ ఆపరేటర్స్‌ను పలు దఫాలుగా పంపించారు. వీరిలో కొంతమందిని విజిటింగ్ వీసాపైన బ్యాంకాక్ పంపించి అక్కడ నుంచి కాంబోడియా దేశం బోర్డర్ వద్ద ఆ దేశ వీసా తీసుకుని అక్కడి చైనా కంపెనీలకు ఈ నైపుణ్యం గల వ్యక్తులను 2500 నుంచి 4,000 అమెరికన్ డాలర్లకు విక్రయించారు.

చీకటి రూమ్‌లో బంధించి..

అక్కడికి వెళ్లిన యువకులను చైనా కంపెనీలు అదుపులోకి తీసుకుని ఓ చీకటి గదిలో బంధించేవారు. వివిధ రకాల సైబర్ నేరాలు ఏ విధంగా చేయాలనే అంశంపై బలవంతంగా స్క్రిప్ట్ ఇస్తూ ట్రైనింగ్ ఇవ్వడమే గాక సైబర్ నేరాలు చేయిస్తున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే వారిని చిత్రహింసలకు గురిచేస్తారు. ఆహారం, నీరు ఇవ్వకుండా కట్టిపడేస్తుంటారు. వారి వలలో చిక్కుకున్న తర్వాత బయటపడడం అసాధ్యం. చేసిన నేరాల ద్వారా సంపాదించిన డబ్బులో 1 శాతం కమీషన్ ఇస్తూ 99 శాతం కంపెనీలే తీసుకుంటాయి. వీరంతా ఉత్సాహంగా పనిచేసేందుకు పలు రకాల ఎంటర్‌టైన్‌మెంట్స్ అలవాటుచేస్తారు. పబ్స్, కేసినో గేమ్స్, మద్యపానం, జూదం, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యక్రమాలకు సంపాదించిన డబ్బును ఖర్చుపెట్టేలా తయారు చేస్తున్నారు. చైనా కంపెనీ చెర నుంచి తప్పించుకుని నగరానికి చేరుకున్న బాధితుడు పెమ్మడి చిరంజీవి, కల్యాణ్, శేఖర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిటీ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాద్ విచారణ చేపట్టగా స్కామ్ బయటపడింది. ఈ రాకెట్‌లో ప్రధాన నిందితుడు చుక్క రాజేష్, అతని వద్ద పని చేస్తున్న సబ్ ఏజెంట్లు గాజువాకకు చెందిన సబ్బవరపు కొండలరావు, మన్నెన జ్ఞానేశ్వరరావును ఇంతకుముందే అరెస్టు చేశారు. తాజాగా కొలుకుల వీరేంద్రనాథ్, కొమ్ము ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

ప్రత్యేక బృందం

దీని వెనుక ప్రధాన ముఠాను కనిపెట్టడానికి లోతైన దర్యాప్తు చేపడుతున్నట్టు సీపీ తెలిపారు. అందుకు స్పెషల్ పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఏజెంట్ల చేతిలో మోసపోయినట్లయితే సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాదరావు (సెల్ నంబర్ 9490617917)కు, కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0891–2565454కు, లేదా సీపీ వాట్సాప్ నంబరు 9493336633కు ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు 1930కి నంబర్‌కు కూడా కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌పై టీడీపీ నేతల దాడి

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మార్కెట్ కమిటీ చైర్మన్, రవినాయక్‌పై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. మండలంలోని సరిమడుగు పంచాయతీ గుండ్లగుట్టతాండాలో శనివారం రాత్రి శ్రీ సొప్పలమ్మ దేవత జాతర ఉత్సవాలు జరిగాయి. గ్రామంలో డీజేలు ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి చెందిన కల్యాణ్‌నాయక్ బైక్ పై వెళ్లడానికి డీజే వాహనాన్ని పక్కకు తీయాలని కోరాడు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నాయకులు కృష్ణానాయక్, తవిరేనాయక్, రెడ్డిశేఖర్‌నాయక్, సుధాకర్‌నాయక్, రాజశేఖర్‌నాయక్‌లు తమ అనుచరులతో కలిసి మూకుమ్మడిగా దాడికి దిగారు. ఈ దాడిలో కల్యాణ్‌కు గాయాలయ్యాయి. ఈ దాడిని అడ్డుకునేందుకు రవినాయక్ వెళ్లగా, ఆయనపైనా కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దీంతో రవినాయక్ భార్య అరుణమ్మ, వారి కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లగా, వారిపై కూడా మూకుమ్మడిగా దాడులకు దిగారు. రవి నాయక్‌తోపాటు వైఎస్సార్‌సీపీకి చెందిన రామ్మూర్తినాయక్, లక్ష్మమమ్మ, రుక్మిణమ్మ, కల్యాణ్‌కుమార్, అరుణలకు గాయాలయ్యాయి.

నేను ఆలోచించటానికి ప్రయత్నిస్తున్నాను. వాస్తవాలతో నన్ను కంగారు పెట్టవద్దు.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 27 మే 2024

ఆంగ్ల ఆధ్యాత్మికవాది

ఒక మనిషి ఇంత రాయగలడా అని ఆశ్చర్యానికి గురిచేసే రచయిత జి.కె. చెస్టర్‌టన్. ఇరవయ్యో శతాబ్దపు ఈ సుప్రసిద్ధ ఆంగ్ల రచయితకు ఇది 150వ జయంతి సంవత్సరం. 1874 మే 29న లండన్‌లో జన్మించిన గిల్బర్ట్ కీత్ చెస్టర్‌టన్ నవలలు, కథలు, నాటికలు, కవితలు, సాహిత్య విమర్శ, కళా విమర్శ, చరిత్ర, వ్యాసాలతో సుమారు 80 పుస్తకాలను వెలువరించారు. 'నెపోలియన్ ఆఫ్ నాటింగ్ హిల్', 'ద మ్యాన్ హూ వజ్ థర్స్‌డే' ఆయన గొప్ప నవలలు. 'ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్' పత్రికకు ఏకంగా 30 ఏళ్లపాటు; 'డైలీ న్యూస్'కు 13 ఏళ్లపాటు వీక్లీ కాలమ్స్ రాశారు. మొత్తంగా సుమారు 4,000 వ్యాసాలు! ఆరడుగుల నాలుగు అంగుళాల ఎత్తు, 130 కిలోల బరువుండే ఈ భారీకాయుడు స్టేషన్లలో కూడా రాసేవారు. రాతలో ఎంతగా మునిగిపోయేవాడంటే, ప్రతిసారీ ఎక్కాల్సిన రైలును మిస్సయ్యేవారు. పలు కార్యక్రమాల్లో తలమునకలుగా ఉంటూ, తర్వాత ఏం చేయాలో మరిచిపోయేవారు. ఒకసారైతే, 'హార్బరో మార్కెట్‌లో ఉన్నాను. నేనెక్కడ ఉండాల్సింది?' అని భార్యకు టెలిగ్రామ్ పంపారు. భర్త అన్ని వ్యవహారాలనూ చూసుకునే ఫ్రాన్సెస్ 'ఇంటికి వచ్చెయ్యండి' అని జవాబిచ్చారు.

'ఆయన ప్రతిదాని గురించి ఎంతో కొంత, అలాగే దాన్ని అందరికంటే మెరుగ్గా చెప్పారు' అంటారు చెస్టర్‌టన్ భావజాలాన్ని ప్రచారం చేయడానికి నెలకొల్పిన 'అమెరికన్ చెస్టర్‌టన్ సొసైటీ' సహవ్యవస్థాపకుడు డేల్ అహ్లెక్విస్ట్. క్రైస్తవ మతంలోని థీమ్స్, సింబాలిజం చెస్టర్‌టన్ రచనల్లో ఎక్కువగా కనబడతాయి. క్రైస్తవంలోని ప్రేమ, కారుణ్యం వైపు ఎందరినో ఆయన ఆకర్షించారు. నాస్తికుడైన బ్రిటిష్ రచయిత సీ.ఎస్.లూయిస్‌ను తిరిగి క్రైస్తవుడిగా మారేట్టుగా చెస్టర్‌టన్ రచనలే ప్రభావం చూపాయి. సతతం విశ్వాసిగా మసలుకోవడమే కాక, ఎంతోమందిని విశ్వాసం వైపు మళ్లించడం, శత్రువులను కూడా ద్వేషించకపోవడం వంటి అంశాలను చూపుతూ చెస్టర్‌టన్ బీటిఫికేషన్‌కు యోగ్యమైన కారణాలున్నాయని వాదిస్తారు క్యాథలిక్ రచయిత జోసెఫ్ పియర్స్. భిన్న భావజాలానికి చెందిన జార్జ్ బెర్నార్డ్ షా, హెచ్.జి.వెల్స్, బెర్ట్రాండ్ రసెల్ లాంటి రచయితలతో విభేదిస్తూ చెస్టర్‌టన్ తీవ్రమైన వాదాలు జరిపేవారు. అయినా వాళ్ల స్నేహం చెడలేదు. శత్రువును కూడా ప్రేమించమనే భావనే ఆయన్ని అలా మసలుకునేట్టు చేసింది. ఆయన ఈ ప్రేమగుణంలోంచి పుట్టిందే ప్రీస్ట్ డిటెక్టివ్ 'ఫాదర్ బ్రౌన్' పాత్ర. శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా కేసులను పరిశీలించే షెర్లాక్ హోమ్స్‌లా కాకుండా అనుమానం, ఆధ్యాత్మిక అవగాహనల ఊతంతో నేరస్థుల మనసుల్లోకి చొచ్చుకెళ్లి వారిని పట్టుకుంటాడు ఫాదర్ బ్రౌన్.

చెస్టర్‌టన్ పారిశ్రామికీకరణను వ్యతిరేకించారు. ధార్మిక జీవితాన్ని ప్రవచించారు. ఐరిష్ జాతీయోద్యమానికి ఊతమిచ్చారు. ఐరిష్ ప్రజలు ఇంగ్లిష్‌వారికి భిన్నమైనవారనీ, వారు తమవైన సంప్రదాయాలను కాపాడుకుంటూ తమ సొంత దేశంలో సొంత విధానంలో స్వతంత్ర పాలనకు అర్హులనీ వాదించారు. అయితే, ఆయన్ని ఇరవయ్యో శతాబ్దపు విలువైన థింకర్‌గా పరిగణించడానికి ఒక కారణం– 'డిస్ట్రిబ్యూటిజం' (పంపిణీవాదం)ను ఆయన ఎత్తుకున్న తీరు! చెస్టర్‌టన్ సోదరుడు సీసిల్, అతడి స్నేహితుడు హిలైర్ బెల్లోక్ 'డిస్ట్రిబ్యూటిజం' ఆర్థిక తత్వాన్ని వృద్ధి చేశారు. మొదటి ప్రపంచ యుద్ధంలో సీసిల్ చనిపోయాక చెస్టర్‌టన్ దీనికి ప్రధాన ప్రచారకర్తగా మారడమే కాక, ప్రధానంగా ఈ భావధార ప్రచారం కోసం 'జీకేస్ వీక్లీ' నడిపారు. నియంత్రణ లేని క్యాపిటలిజం, సోషలిజాలకు భిన్నమైన మూడో పంథాగా ఉంటూ, ఆస్తులు, రాజకీయాధికారాల పంపిణీ జరగాలంటుంది ఈ వాదం. 'మూడు ఎకరాలు – ఆవు' అనేది వీరి స్లోగన్.

సూత్రప్రాయంగా జాతీయవాదానికి చెస్టర్‌టన్ వ్యతిరేకి కాకపోయినా, తన మూలాలను విస్మరించే జాతీయవాదానికి అర్థం లేదంటారు. అందుకే భారత జాతీయోద్యమాన్ని 'అది భారతీయమూ కాదు, అంత జాతీయమూ కాదు' అని నిరసించారు. 1909లో 'ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్'లో చెస్టర్‌టన్ రాసిన ఒక వ్యాసం మహాత్మా గాంధీ మీద 'పిడుగుపాటు'లా పడింది. వెంటనే దానికి చిన్న పరిచయం రాస్తూ 'ఇండియన్ ఒపీనియన్'లో పునర్ముద్రింపజేశారు. 'వాళ్ల దేశానికి మన పార్లమెంట్ కావాలి, మన జ్యుడీషియరీ కావాలి, మన పత్రికలు కావాలి, మన సైన్స్ కావాలి. భారత జాతీయవాదులు ఇవన్నీ కోరుకోవడమంటే వాళ్లు ఇంగ్లిష్‌వారిలా ఉండాలనుకుంటున్నారు' అన్నారు చెస్టర్‌టన్. అది సహేతుకమని గాంధీజీ బలపరుస్తూ, 'స్వతంత్రంగా ఉండాలంటే ఇండియా తనకు తానుగా ఉండాలి, బ్రిటన్‌లా మారకూడదు. అదే పనిగా అనుకరిస్తే మన దేశం హిందుస్థాన్ కాదు, ఇంగ్లిషిస్థాన్ అవుతుంది' అని రాశారు.

విస్తృతిలో, భావధారలో తెలుగు సాహిత్య శిఖరం విశ్వనాథను కొంతవరకూ స్ఫురింపజేసే చెస్టర్‌టన్‌కు రావాల్సినంత కీర్తి రాలేదన్నది కొందరి వాదన. ఇరవయ్యో శతాబ్దపు గొప్ప రచయిత, ఆలోచనాపరుడు అయినా చెస్టర్‌టన్ విస్మరణకు గురికావడానికి ఆయన అన్ని రకాలుగా రాయడమే కారణమన్నది దీనికి వివరణ. 'ఒక్కమాటలో రచయితలు ఫలానా వర్గంలోకి ఇట్టే ఒదగకపోతే వాళ్లు చీలికల్లోంచి కిందికి జారిపోయే ప్రమాదం ఉంది' అంటారు అహ్లెక్విస్ట్. అయినా ఆయన్ని తలకెత్తుకునే వాళ్లు ఉంటూనే ఉన్నారు. చెస్టర్‌టన్‌ను ఎడ్గార్ అలెన్ పోతో పోల్చారు బోర్హెస్. 'చెస్టర్‌టన్‌కు ప్రపంచం తగినంత కృతజ్ఞత చూపలే'దని అన్నారు జార్జ్ బెర్నార్డ్ షా. అయితే జాన్ పైపర్ వ్యాఖ్యానం చెస్టర్‌టన్‌కు తగిన నివాళి: 'చెస్టర్‌టన్ కోసం నేను దేవుడికి కృతజ్ఞత చెబుతాను' అన్నారాయన.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.చవితి సా.4.44 వరకు, తదుపరి పంచమి **నక్షత్రం:** పుర్వాషాఢ ఉ.10.25 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.44 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.23 నుండి 1.15 వరకు తదుపరి ప.2.58 నుండి 3.50 వరకు, **అమృతఘడియలు:** ఉ.5.41 నుండి 7.15 వరకు, తదుపరి రా.3.31 నుండి 5.05 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం: 6.24
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

ప్రధాని ఇంటర్వ్యూలు ఇలా ఉన్నాయా?

కామెంట్
కరణ్ థాపర్

ఒక ప్రధానమంత్రితో ముఖాముఖి అన్నది ఆయన విమర్శకులపై దాడి చేయటానికి వేదికగా ఉండకూడదు. అంతేకాదు, సరైన విమర్శలకు ఆయన్ని స్పందింపజేసేలా ఉండాలి. స్పందింప 'చేయటం' అనే క్రియ ముఖ్యం. ప్రశ్నడిగి వదిలేస్తే ఏ ప్రధాని అయినా ఆ ప్రశ్నను తప్పించటానికి, సమాధానాన్ని దాటవేయటానికి చూడొచ్చు. అలా చేయకుండా, సమాధానం కోసం పదే పదే ఒత్తిడి తేవడం ఇంటర్వ్యూ చేసేవారి బాధ్యత. అంతేకాదు, వీక్షకుల తరపున ప్రశ్నలు అడుగుతున్నామన్న స్పృహను వారు కలిగి ఉండాలి. అలాగే ఇంటర్వ్యూ చేసేవారు బెరుకుగా, ప్రధానికీ తనకూ వ్యత్యాసం ఉందన్న గ్రహింపుతో ఉన్నట్లుగా ప్రశ్నలు అడగకూడదు. ప్రధానిని తను కఠినమైన ప్రశ్నలు కూడా అడగగలడు అనే భావన వీక్షకులలో కలిగించాలి.

ఇప్పటి బి.బి.సి. ఛైర్మన్ సమీర్ షా ఒకప్పుడు 'లండన్ వీకెండ్ టెలివిజన్' లో నా మొదటి బాస్. టెలివిజన్ ఇంటర్వ్యూలలో ప్రశ్నలు అడగటం గురించి నాకు తెలిసిన చాలా విషయాలు ఆయన నేర్పించినవే. వాటిలో ముఖ్యమైన పాఠం... వీక్షకుల తరపున ప్రశ్నలు అడుగుతున్నామన్న స్పృహను మనం కలిగి ఉండటం. అందుకే మీ ప్రశ్నలు సందర్భోచితంగా ఉండాలి. సమాధానం వచ్చేవరకు మీరు పట్టుపట్టి ఉండాలి. లేదంటే మీరు సమాధానం రాబట్టలేక పోతున్నారని వీక్షకులకు స్పష్టమైపోతుంది.



కనుక టీవీలో ప్రధానమంత్రి ఇంటర్వ్యూలను చూస్తున్నప్పుడు నేను ఏం వినాలని కోరుకుంటాను? ఏముందీ, వీక్షకుడిగా నా తరపున ఆ ప్రశ్నలు అడుగుతున్నట్లుంటే కనుక, నా ప్రశ్నలు ఎలా ఉండి ఉండాలి అని ఆలోచిస్తుంటాను.

ముందుగా, ప్రధాని వేటిని తన విజయాలుగా భావిస్తున్నారో వాటి గురించి తెలుసుకోవాలనుకుంటాను. ఆయనకు ఎదురైన సవాళ్లకు, బహిర్గతమైన వాస్తవాలకు, చేసిన తప్పులకు, కప్పిపుచ్చుకునేందుకు చేసిన ప్రయత్నాలకు ఆయన ఏ విధంగా స్పందిస్తారో కూడా తెలుసుకోవాలని అనుకుంటాను. సంభాషణ ఏకపక్షంగా కాకుండా రెండు వైపుల నుండీ ఉండాలని కోరుకుంటాను. కాబట్టి సంభాషణలో ప్రధానిని అంతరాయపరచటం ఉంటుంది. కొన్నిసార్లు అంతరాయాలు అవసరం కూడా!

రెండోది – ఒక ప్రధానమంత్రితో ముఖాముఖి అన్నది ఆయన విమర్శకులపై దాడి చేయటానికి వేదికగా ఉండకూడదు. అంతేకాదు, సరైన విమర్శలకు ఆయన్ని స్పందింపజేసేలా ఉండాలి. స్పందింప 'చేయటం' అనే క్రియ ముఖ్యం. ప్రశ్నడిగి వదిలేస్తే ఏ ప్రధాని అయినా ఆ ప్రశ్నను తప్పించటానికి, సమాధానాన్ని దాటవేయటానికి చూస్తారు. అలా చేయకుండా, సమాధానం కోసం ఒత్తిడి తేవడం ఇంటర్వ్యూ చేసేవారి బాధ్యత.

మూడవది – ఇంటర్వ్యూ ఆసాంతం.. ఇంటర్వ్యూ చేసేవారు, ప్రధానీ ఇద్దరూ కూడా సమానమే. అలాంటప్పుడు మాత్రమే ఇంటర్వ్యూ ప్రధానిని బాధ్యుడిని చేస్తుంది. కనుక ఇంటర్వ్యూ చేసేవాళ్లు ఆయన్ని 'సర్' అని పిలవకూడదు. అలా అనడం అంటే ఆయన్ని ఉన్నత పీఠం మీద ఉంచినట్లు! అలాగే ఇంటర్వ్యూ చేసేవారు బెరుకుగా, ఆయనకూ తనకూ వ్యత్యాసం ఉందన్న గ్రహింపుతో ఉన్నట్లుగా ప్రశ్నలు అడగకూడదు. ప్రధానిని తను కఠినమైన ప్రశ్నలు కూడా అడగగలడు అనే భావన వీక్షకులలో కలిగించాలి.

నాల్గవది – అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తప్పనిసరిగా ఇంటర్వ్యూ చేసేవారు లేవనెత్తిన అంశాలకు సంబంధించినవై ఉండాలి. కొద్దిపాటి ఊకదంపుడును అర్థం చేసుకోవచ్చు కానీ, అడగని వాటికి జవాబు చెబుతూ, అడిగిన వాటికి విరుద్ధమైన సమాధానం ఇస్తూ పీఎం పూర్తిగా దారి మళ్లేందుకు అనుమతించకూడదు. అలా జరిగితే మర్యాదపూర్వకమైన బలవంతపు అంతరాయం అవసరం. పీఎం అదే పనిగా దారి మళ్లుతూ ఉంటే ఒకటి కంటే ఎక్కువ సార్లు అంతరాయాలు ఉండొచ్చు.

ఐదవది – ఇంటర్వ్యూయర్‌కు వ్యూహం అవసరం. ఏదో అడగటానికి అన్నట్లుగా ప్రశ్నలు అడగకూడదు. ఒక స్పష్టమైన లక్ష్యం ఉండాలి. ఎప్పుడూ కూడా అడగకూడని ఒక ప్రశ్నకు ఉదాహరణ: 'ఈసారి మీరు కచ్చితంగా గెలుస్తారు, అయితే 2029లో కూడా గెలుస్తారా?'

ఇప్పుడు, సంబంధిత పీఎం స్వభావం, వ్యక్తిత్వాలకు అనుగుణంగా స్పందించేందుకు తగిన సామర్థ్యాన్ని ఇంటర్వ్యూ చేసే వ్యక్తి కలిగి ఉండాలి. ఉదాహరణకు, ఒక ప్రధాని తను చేసిన ప్రతి పనీ దేశం కోసమే చేశానని దేశభక్తి ఢంకాను బజాయిస్తుంటే... ప్రధాన మంత్రులందరి విషయంలోనూ అది సహజమే కదా అని అనండి. అలా అనడం ఆయన్ని ప్రత్యేకమైన వ్యక్తిగా నిలిపి ఉంచదు. లేదా, అందరికీ తెలిసి ప్రధాని చెప్పిన ఒక విషయం గురించి, లేదా ఆయన చేసిన ఒక పని గురించి నిర్ద్వంద్వంగా ప్రధాని తాను అనలేదని, చేయలేదని వాదిస్తుంటే... అప్పుడు దానిని సమయ సందర్భ, స్థల కాలాలతో సహా గుర్తు చేసే స్థితిలో ఇంటర్వ్యూయర్ ఉండాలి. ఆ విషయంలో స్పష్టంగా ఉండాలి. ఎందుకంటే అది ప్రధానమంత్రిని సవాలు చేయటం వంటిది. ఇంటర్వ్యూయర్ సిద్ధపడి ఉండాల్సిన వాటిలో ఇదొక సహేతుకత కలిగి ఉండాల్సిన భాగం.

కొన్నిసార్లు స్పష్టమైన ప్రశ్నలు లేవనెత్తాలి. ఎందుకంటే అవి ఆ ఇంటర్వ్యూ ఇస్తున్న ప్రధానికి సంబంధించినవై ఉంటాయి. వాటిని విస్మరించలేము. ఉదాహరణకు, ఆ ప్రధాని తను భగవంతుని వాహకమని విశ్వసిస్తుంటే ఇంటర్వ్యూ చేసే వ్యక్తి కొంతవరకైనా ఆయన్ని శంకిస్తున్నట్లుగా.. అది మీకెలా తెలుసు? మీరలా అనడం హేతుబద్ధమేనా? అని అడిగి తీరాలి. లేదా, ప్రధానిని అనుకరిస్తూ జీవనం సాగించే హాస్యగాడికి ఆయనపై పోటీ చేసేందుకు అనుమతి లభించకపోతే మీరు అందుకు అనుమతిస్తారా అని ఆ ఇంటర్వ్యూయర్ అడగాలి. ఆయన చికాకు పడుతూ కోపగించుకుంటున్నా కూడా పట్టు వదలక అడిగి తీరాలి. అంతేకాదు, ప్రధాని ఎల్లప్పుడూ తనను తాను తృతీయ పురుషలోనే ఎందుకు చెప్పుకుంటారు? గొప్ప కోసమా? అని ఇంటర్వ్యూయర్ ప్రశ్నించాలి.

చివరిగా – నేనిక్కడ రాసిన వాటిని ఒక స్వచ్ఛమైన మనసు గల, గౌరవనీయులైన ప్రధాని అంగీకరిస్తారన్న నమ్మకం నాకుంది. గుర్తుంచుకోండి! ప్రజలను ఆకట్టుకోవటానికి తన ఇంటర్వ్యూను ఉపయోగించుకోవాలని ఆయన అనుకుంటారు. వాళ్ళకు చీకాకు తెప్పించాలనుకోరు. ఆ సంగతి మర్చిపోవద్దు. సమీర్ నాతో చెప్పిన మరొక మాట ఇది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

అదిగో.. నవలోకం...

మరో ప్రపంచాన్ని నిర్మించటం సాధ్యమే! మొదట అదెలా ఉండాలన్నది ఊహించుకోవాలి. అది – ద్వేషం వ్యవస్థీకృత స్వభావం కాని ప్రపంచం అయ్యుండాలి. ద్వేషం చివరికి ద్వేషించే వారినే భస్మం చేస్తుంది.
– సామిత్ర, విజిటింగ్ ఫెలో

పోరాట ఉపశమనం

బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు నమోదు అవటం గౌరవ న్యాయ స్థానంపై నమ్మకం కలిగిస్తోంది. మహిళా రెజ్లర్ల పోరాటానికి ఇది పెద్ద విజయం. ఆడపడుచులు కష్ట సమయాలను గడపాల్సి వచ్చినా పోరాడాలన్న వారి నిర్ణయం ఉపశమనాన్ని కలిగిస్తుంది. మహిళా రెజ్లర్‌లను ట్రోల్ చేసిన వారు కూడా సిగ్గుపడాలి. సత్యమేవ జయతే!
– భజరంగ్ పూనియా, ఒలింపిక్ మెడలిస్ట్

అవేం మాటలు?!

మీ నాయకుడిని తెలివిగా ఎన్నుకోవడం ఈ మాటల డయేరియాను అంతం చేయటానికి ఏకైక మార్గం. మన నాయకులు ఒకరిని ఒకరు విమర్శించుకుంటున్న స్థాయిని బట్టి చూస్తే భారత రాజకీయ చరిత్రలోనే ఈ ఎన్నికలు ఓ కీలక ఘట్టం కానున్నాయి.
– డాక్టర్ పి. కామత్, కార్డియాలజిస్టు

ఏకపక్ష ధోరణి

ఇజ్రాయెల్, దాని మిత్ర పక్షాలు గాజాపై దాడులను తక్షణం నిలిపివేయాలని ఐ.సి.సి. తాజాగా కోరింది. మంచిదే! మరి అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడులలో అనేకమంది అమాయకులు, మహిళలు, పిల్లలు మరణించటంపై ఐ.సి.సి. ఎందుకని ఒక్క ప్రకటన కూడా చేయలేకపోయింది?
– సుబ్రహ్మణ్యస్వామి, రాజకీయ నేత

ఇంత కాలమా!!

డాక్టర్ నరేంద్ర దాభోల్కర్‌ను హత్య చేసిన ఇద్దరికి జీవిత ఖైదు పడింది. పది సంవత్సరాలుగా వారు 'అనుమానిత నేరస్థులు'గానే ఉన్నారు. ఇన్నాళ్లకు (అసలైన) దోషులుగా జైల్లో ఉండబోతున్నారు. మన దర్యాప్తు, న్యాయ వ్యవస్థ ఇంత నిదానంగా ఉంటే ఎలా?
– స్వాతీ వైద్య, టీచర్

తర్కమే అంతిమం

న్యాయవాదులం, కనీసం మా సర్కిల్‌లో ఉన్నవాళ్లమైనా... చట్టపరమైన అంశాల విషయంలో ఉద్వేగ రహితంగా ఆలోచిస్తాం. మా వ్యక్తిగత రాజకీయ భావాలు మా తార్కిక బుద్ధిని మబ్బులా కమ్మేయకుండా జాగ్రత్త పడతాం. చాలు కదా!
– నవరూప్ సింగ్, న్యాయవాది

నిజం లేదు

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయటానికి వెళ్లే ముస్లిములకు దుబాయ్‌కి చెందిన ఒక 'ముస్లిం సంస్థ' ఆర్థిక సహాయం ప్రకటించినట్లుగా సోషల్ మీడియాలో ఒక లేఖ వైరల్ అవుతోంది. అందులో వాస్తవం లేదు.
– ప్రతీక్ సిన్హా, ఎడిటర్, ఆల్ట్ న్యూస్

వేషధారులు

అజిత్ భారతి, సింఘా అనేవారు స్త్రీ వేషధారణలో అట్టారి– వాఘా సరిహద్దులో నిర్బంధించబడ్డారు. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌ను ఇచ్చిన తీర్పుపై వారిద్దరూ కలత చెందారట. భారత న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం లేనందున పాకిస్తాన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వారు తెలిపారు!!
– డాక్టర్ గౌరవ్ కుమార్, సోషల్ యాక్టివిస్ట్

నాజీలే 'నాజీ... నాజీ' అని తిడితే!

అభిప్రాయం
సంగిరెడ్డి హనుమంత రెడ్డి

మే 4న అమెరికన్ రిపబ్లికన్ పార్టీ కమిటీ సమావేశం జరిగింది. అక్కడ 'జనవరి 6 ఖైదీలు' పాడిన 'జాతీయ' గీతానికి పూర్వ అధ్యక్షుడు ట్రంప్ ఆకర్షితులయ్యారు. 2020 ఎన్నికల్లో ఓడినా ట్రంప్‌ను అధ్యక్షునిగా కొనసాగించాలని పార్లమెంటు, సుప్రీంకోర్టుల కేంద్ర స్థలం కాపిటల్‌పై 2021 జనవరి 6 న దాడి జరిగింది. జో బైడెన్ గెలుపు నిర్ధారణకు ఏర్పాటైన పార్లమెంటు ఉభయ సభల సమావేశం విచ్ఛిన్నం దీని లక్ష్యం. ఈ దాడిలో వెయ్యి మంది ట్రంప్ మద్దతుదారులు 9 మంది అధికారులను చంపారు. రికార్డులు, జాతీయ ఆస్తి ధ్వంసమయ్యాయి. ఆ దుశ్చర్యలో నిర్బంధించబడ్డ 20 మందితో ట్రంప్ 'అందరికీ న్యాయం' దాతృత్వ సంస్థను స్థాపించారు. జనవరి 6 ఖైదీల పాట కచేరీలతో వచ్చే లాభాలను కాపిటల్ దాడి నిందితుల చట్టపర ఖర్చులకు వినియోగిస్తారు. అనామక కళాకారుడు ఈ పాట రికార్డును చేశారు. జాతీయ జెండాపై విశ్వాస ప్రతిజ్ఞతో ట్రంప్ పాడే పాట ఇది. 6 సార్లు 'అమెరికా' పదంతో ముగిసే ఈ పాట కచేరీని ట్రంప్ చాలా సార్లు ఏర్పాటుచేశారు.

మే 4 సభలో బైడెన్ పై ట్రంప్ తిట్ల వర్షం కురిపించారు. బైడెన్ నాజీ 'గెస్టపో' పాలన చేస్తున్నారన్నారు. గెస్టపో అపఖ్యాతి పాలైన హిట్లర్ రాజకీయ రహస్య పోలీసు వ్యవస్థ. అది ఐరోపా దేశాల నుంచి యూదులను బహిష్కరించింది. యూదుల నరమేధానికి తోడ్పడింది. బహిరంగ తిట్ల పురాణం ట్రంప్ అలవాటు. ట్రంప్ నేరాలపై న్యూయార్క్ కోర్టు విచారణ సాగుతోంది. ట్రంప్ మోసాల పుట్టని న్యాయవాదుల వాదన. బైడెన్ పాలన కూడా కార్పొరేట్లను, ఆయుధ వాణిజ్యవేత్తలను ప్రోత్సహించేదే. కాని ఈ పాలనను నాజీ– పాశవిక ఫాసిస్టు పాలనతో, అమానవీయ గెస్టపో దురంతాలతో పోల్చడం అన్యాయం. మన ప్రధాని మోదీ దేశ ముస్లింలను చొరబాటుదారులు, అధిక సంతానవంతులన్నట్లు బైడెన్ ఎవరినీ తిట్టలేదు. ట్రంప్ పాలనే హిట్లర్ పాలనకు దగ్గరగా ఉంది. శ్వేతేతర మహిళా పార్లమెంటు సభ్యులను మీ దేశాలకు పొమ్మని తిట్టారు. అమెరికా పరువు రక్షణ, ఘనత పునరుద్ధరణ వంటి జాత్యహంకార నినాదాలను ఎత్తిచూపినవారిని మాతృ సంభోగులన్నారు.

జర్మన్ జాతి పవిత్రతను, రక్తాన్ని యూదులు అపవిత్రం చేస్తున్నారని హిట్లర్ అనేవారు. అమెరికా రక్తాన్ని వలసజీవులు విషమయం చేస్తున్నారని, దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని, రాజకీయ ప్రత్యర్థులు చీడపురుగులని ట్రంప్ మంట రేపారు.

బవరియ రాజ్య ప్రభుత్వాన్ని పడగొట్టి అధికారాన్ని చేజిక్కించుకోడానికి హిట్లర్ 1923 నవంబర్ లో తిరుగుబాటుచేశాడు. అది విఫలమయ్యింది. అయితే కుట్రలో చనిపోయినవారిని అమరవీరులని హిట్లర్ కీర్తించేవారు. వారి పేర వేడుకలు జరిపేవారు. 2021 జనవరి 6 ట్రంప్ కాపిటల్ దాడి అలాంటిదే. అందుకే ట్రంప్ కాపిటల్ దాడి ఘటనను వేడుకగా జరుపుకుంటున్నారు. టైమ్స్ పత్రిక ఇంటర్వ్యూ లో జనవరి 6 దాడిలో పోలీసులను చంపినవారిని దేశభక్తులని ట్రంప్ పొగిడారు. ట్రంప్, మోదీ ఏకభావజాల 'దేశభక్తులు, రాజ్యాంగ, ప్రజా రక్షకులు.'

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, । 94902 04545

ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు జరుగుతున్న వేళ, యావత్ ప్రపంచం ఈ ఎన్నికల ప్రక్రియను నిశితంగా గమనిస్తున్న సమయంలో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) చుట్టూ విమర్శలు రాజుకుంటూ ఉండటం ఆందోళనకరం. తాజా సార్వత్రిక ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం 7 ఫేజుల్లో నిర్వహిస్తోంది. ఒక్కో దశ పోలింగ్ ముగిసిన వెంటనే ఈసీ పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తోంది. అయితే తుది అంకెల ప్రకటన వెల్లడించటానికి మొదటి దశలో ఈసీ 11 రోజులు, రెండో దశలో 4 రోజుల సమయం తీసుకోవటం వివాదాస్పదంగా మారింది. పైగా అంకెల్లో కూడా భారీ మార్పు కనిపించింది. 5–6శాతం ఓటింగ్ శాతం తేడా ఎందుకు వచ్చింది.



దీనిపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ సుప్రీం కోర్టు తలుపుతట్టింది. ప్రతి పోలింగ్ బూత్‌కు సంబంధించి ఆ రోజు జరిగిన ఓటింగ్ వివరాలు ఉండే ఫారమ్–17సీ అంశం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈసీ వ్యవహార శైలి అనుమానాలు రేకెత్తిస్తోంది. అందరిలో కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవి:

1. మాచర్ల ఉదంతం తీసుకుంటే వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎమ్‌ను ధ్వంసం చేసిన వీడియో ఆధారంగా ఈసీ ఆయనపై పలు కేసులు దాఖలు చేసింది. వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈవీఎమ్‌ను ధ్వంసం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే. ఎవరూ కాదనరు. అదే సమయంలో టీడీపీ నాయకులు యథేచ్ఛగా బూత్ లలో జొరబడి, వైసీపీ ఏజెంట్లపై దాడి చేసి రిగ్గింగ్ చేసుకుంటూ ఉంటే ఈసీ ఎందుకు మౌనం పాటించింది? రిగ్గింగ్ జరుగుతోందని వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి పదే పదే ఫిర్యాదు చేసినా ఎందుకు రిగ్గింగ్ జరగనిచ్చింది? 2. ఈసీ వెబ్‌కాస్ట్‌లో రికార్డ్ అయిన వీడియో లోకేష్ చేతికి ఎలా వచ్చింది? 3. ఆ వీడియో లీక్ అయ్యిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి చెప్పటం బాధ్యతారాహిత్యమే కదా! సచివాలయంలోని ఈసీ ఆఫీసులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ చేయలేదా? 4. పిన్నెల్లి ఈవీఎమ్ పగులగొట్టిన 20 సెకన్ల వీడియో మాత్రమే బయటకు వచ్చింది. అంతకు ముందు రిగ్గింగ్ జరిగిన వీడియోలను ఈసీ ఎందుకు బయటపెట్టలేదు? 5. ఈవీఎమ్ ధ్వంసం అయినా చిప్ బానే ఉంది. రీ పోలింగ్ అవసరం లేదని ఈసీ తేల్చింది. మరి ఈ చిప్‌లో రికార్డ్ అయినదంతా టీడీపీ వాళ్ల రిగ్గింగ్ ఓట్లు కదా! ఈ విషయాన్ని ఈసీ ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదు? 6. సీఈఓ చెప్పిన వివరాల ప్రకారమే 11 ఈవీఎమ్‌లు పోలింగ్ రోజు ధ్వంసం అయ్యాయి. మరి మిగిలిన 10 ఈవీఎమ్‌లను ధ్వంసం చేసింది ఎవరు? 7. పిన్నెల్లిపై చర్యలు తీసుకున్నట్లే వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ఎందుకు ప్రకటించలేదు. ఆ వీడియోలను ఎందుకు రిలీజ్ చేయలేదు? 8. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 వంటివి జర్నలిజం ముసుగులో టీడీపీకి అడ్డగోలుగా ప్రచారం చేస్తూ వైసీపీపై విషం చిమ్ముతుంటే ఈసీ ఎందుకు వాళ్ళను కట్టడి చేయలేదు? 9. పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ముందు రోజు రాత్రి ఉన్నపళంగా పోలీసు అధికారులను మార్చటం వెనుక ఎవరి ఒత్తిళ్లు పని చేశాయి?

ఈ ప్రశ్నలు, అనుమానాలు ప్రజల్లో, ఎన్నికల బరిలో ఉన్న రాజకీయ పార్టీల్లో ఉంటే... ఈసీ నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తుందన్న విశ్వాసం ఎలా కలుగుతుంది?

– ఆర్.ఎస్

ప్రేమను పంచాలి!

మన భారతీయ విశ్వాస వ్యవస్థలో ప్రేమకు అత్యంత ఉన్నత స్థానం ఉంది. ప్రేమను పంచమని మన ఇతిహాస పురాణాలు అనేకం చెబుతున్నాయి. మన పెద్దలూ అదే మాట చెబుతూ ఉంటారు. అయితే ప్రేమ అంటే నిర్వచనం ఏమిటనేది ఒక్కమాటలో చెప్పేది కాదు. వ్యక్తుల మధ్య, మనుషులు–ఇతర జీవుల మధ్య ఉండే ప్రేమ రూపాలు మార్చుకుంటూ ఉంటుంది. అంటే ప్రేమ అనేక రకాలన్నమాట.

జ్యోతిర్మయం

కరుణ, దయ, జాలి, కారుణ్యం, పాశం, బంధుత్వం, అభిమానం, విశ్వాసం, ప్రేమ, భక్తి... ఇవన్నీ ప్రేమకు సంబంధించిన రకరకాల పేర్లుగా భావించవచ్చు. బలహీనులపై చూపే ప్రేమకు జాలి అని పేరు. తెలివితేటల బలం, శారీరక బలం లేని వారిపట్ల చూపే ప్రేమ పేరు కరుణ. పశుపక్ష్యాదుల పట్ల చూపే ప్రేమ పేరు కారుణ్యం. దీన్నే జీవకారుణ్యం అంటారు. మన పౌరాణిక శిబి చక్రవర్తి చూపిన ప్రేమ ఇలాంటిదే. బంధువులు, సొంతవాళ్ళ పట్ల వారికి డబ్బున్నా, లేకున్నా చూపే ప్రేమను బంధుత్వం అంటారు. ఓ యజమాని తన దగ్గర పని చేసే వారి పట్ల చూపే ప్రేమ వేరు. తల్లిదండ్రులకు బిడ్డకు మధ్య ఉండేది పాశం. తన కుమారుడైన శ్రీరాముడు అడవులకు వెళ్లాడనే దిగులుతోనే దశరథ మహారాజు మరణించడం చూస్తే ప్రేమ పాశం ఎంత బలమైనదో అర్థమవుతుంది. స్నేహితుల పట్ల చూపే ప్రేమకు మరోపేరు అభిమానం. అంతస్థులు చూడకుండా చూపే ప్రేమ అసామాన్యం. ఇందుకు తగిన ఉదాహరణ కృష్ణుడు– కుచేలుని పట్ల చూపించిన ప్రేమ. ఇక పని చేసే వారు యజమాని పట్ల చూపే ప్రేమ పేరు విశ్వాసం. భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రేమ అని చెప్పడం కద్దు.

ప్రేమ ప్రేమలా ఉండాలన్నారు ఓషో. ప్రేమకు సాటి ప్రేమే. దానికి ఎటువంటి మెరుగులు దిద్దవలసిన అవసరం లేదు. ఎందుకంటే ప్రేమ ఎప్పుడూ పరిపూర్ణంగా ఉంటుంది. కానీ దీనిని అర్థం చేసుకోకుండా లేనిపోని చిక్కుల్లో పడి మనసును పాడుచేసుకునే వారే ఎక్కువ మంది. కనుక ప్రేమను ప్రేమగా ఉంచుదాం. ప్రేమను పంచుదాం. ప్రేమను పొందుదాం!

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

ఒకటి నుంచి తిరుమలలో హనుమజ్జయంతి ఉత్సవాలు

తిరుమల: తిరుమలలోని అంజనాద్రి ఆకాశ గంగ ఆలయం, జపాలి తీర్థంలో జూన్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు హనుమాన్ జయంతి నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఆకాశ గంగలోని శ్రీఅంజనాదేవి– శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయంలో 1న మల్లెపూలు, 2న తమలపాకులు, 3న ఎర్ర గన్నేరు, కనకాంబరం, 4న చామంతి, 5న సింధూరంతో అభిషేకాలు చేయనున్నారు. అలాగే జపాలిలో ప్రతిరోజూ మధ్యాహ్నం దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. 1న హరికథ, 2న అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల సంకీర్తనలు, 3న పురంధరదాస సంకీర్తనలు, 4న హిందూధర్మ ప్రచార పరిషత్ వారి భజన, 5న అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల హరికథ గానం ఉంటుంది. రోజూ సాయంత్రం వేళ ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులచే నృత్య కార్యక్రమాలు ఉంటాయి. అదే విధంగా నాద నీరాజనం వేదికపై ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య శ్రీ హనుమాన్ జననం, శ్రీ హనుమంతునికి సంబంధించిన ఇతర ఆసక్తికరమైన అంశాలపై ప్రముఖ వేద పండితులచే ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు.

'స్వచ్ఛ' నాగావళి కోసం..

- నది శుభ్రతకు ముందుకొచ్చిన 250 మంది
- సహాయమందించిన శ్రీకాకుళం మున్సిపల్ యంత్రాంగం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నాగావళి నదిని శుభ్రం చేయాలనే ఒక యువకుడి ఆలోచనకు వందలాది మంది తోడయ్యారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరిశుభ్రత సేవలో భాగస్వాములయ్యారు. వీరి ఆలోచనకు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ సైతం మద్దతుగా నిలిచి సాయం అందించింది. దీంతో ఆదివారం నిర్వహించిన 'క్లీన్ శ్రీకాకుళం' విజయవంతమైంది. శ్రీకాకుళం నగరానికి చెందిన కె.జీవన్ తన ఇన్‌స్టాగామ్ ద్వారా ఇచ్చిన పిలుపుతో సిద్ధార్థరాజ్, ప్రమోద్ నాయుడు, యోగేష్‌నాయుడు ముందుకొచ్చారు. యశ్వంత్, ప్రశాంత్, మధు, హరీష్, ప్రణీత్, భరత్, హర్ష, లక్కీ, స్వరూప్‌దుష్యంత్ వీరికి తోడువచ్చారు. వీరి స్ఫూర్తిగా మరికొంతమంది నది వద్దకు చేరుకున్నారు. అందరూ చేతులు వేయడంతో క్లీన్ శ్రీకాకుళం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. వీరి కృషిని మెచ్చి స్పందించిన మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసరు.. సిబ్బందిని పంపించారు. మొత్తం 250 మంది నాగావళి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన సామగ్రిని దాతలు అందించవచ్చని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 79811 07423, 99632 95929 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


మద్యం మత్తులో రైలు కింద చేతులు పెట్టిన యువకుడు

- మోచేతుల వరకు తెగిపడిన రెండు చేతులు
- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స


బాధితుడు ఈశ్వరరావు

చీరాల రూరల్ : మద్యం మత్తులో ఓ యువకుడు తన రెండు చేతులను రైలుకింద పెట్టడంతో మోచేతుల వరకు తెగిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి బాపట్ల జిల్లా పేరాల వడ్డే నాగేశ్వరరావు బజారుకు చెందిన అల్లాడి ఈశ్వరరావు అనే యువకుడు మద్యం మత్తులో తన రెండు చేతులను కారంచేడు రైల్వేగేటు సమీపంలో విజయవాడ వైపు వెళ్లే రైలుకింద పెట్టడంతో రెండు చేతులూ మోచేతుల వరకు తెగిపోయాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితుడిని చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

అనంత్ అంబానీ వివాహానికి విశాఖవాసి 'చిరు' కానుక


చిరుధాన్యాలతో తయారు చేసిన అనంత్ అంబానీ, రాధికా మర్చెంట్‌ల చిత్రం

ఏయూక్యాంపస్: రిలయన్స్ సంస్థల అధినేత ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వివాహానికి విశాఖ చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ అపురూప బహుమతి సిద్ధం చేశారు. చిరుధాన్యాలతో అనంత్ అంబానీ, రాధిక మర్చెంట్‌ల చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. ఈ నెల 28 నుంచి 30 వరకు వీరి ప్రీ వెడ్డింగ్ వేడుకల్ని వివిధ దేశాల్లో నిర్వహిస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని విజయ్‌కుమార్ చిరుధాన్యాలతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. త్వరలో దీన్ని అనంత్ అంబానీ కుటుంబానికి పంపనున్నారు. అనంత్ అంబానీ ప్రత్యేకంగా వంతారా అడవిని ఏర్పాటు చేసి ఏనుగులను సంరక్షిస్తున్న విధానం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని, అందుకే చిరుధాన్యాలతో వీరి చిత్రపటాన్ని తీర్చిదిద్దానని విజయ్‌కుమార్ చెప్పారు.

వన విహారం చేద్దాం రండి

నల్లమలలో 'జంగిల్ సఫారీ'

శ్రీశైలం ఘాట్ రోడ్డులో గోర్లెస్ కాలువ ప్రాంతం నుంచి ప్రారంభం


పెద్దపులి


శ్రీశైలం ఘాట్ రోడ్డులో జంగిల్ సఫారీ ప్రారంభమయ్యే ప్రాంతం


ఎలుగుబంటి


జింకలు


పర్యాటకులు అడవిలో పర్యటించేందుకు వినియోగించే జీప్సీలు

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యం... ఈ పేరు వింటేనే ప్రకృతి ప్రేమికుల మనసు పులకిస్తుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వేచ్ఛగా సంచరించే పెద్దపులులు, చిరుతలు, జింకలు, దుప్పులు మరెన్నో వన్యప్రాణులు కనువిందు చేస్తాయి. దట్టమైన అటవీ ప్రాంతంలో పచ్చని పచ్చికబయళ్ల నడుమ వన్యప్రాణులను వీక్షిస్తూ ఓపెన్ జీప్సీల్లో పర్యటిస్తూ ఉంటే ఆ అనుభూతి చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇలాంటి అద్భుత అవకాశాన్ని అటవీశాఖ పర్యాటకులకు కల్పించింది. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్‌రోడ్డులో తుమ్మలబైలు సమీప ప్రాంతం నుంచి 'జంగిల్ సఫారీ' పేరుతో అటవీ ప్రాంత సందర్శనకు ఏర్పాట్లు చేసింది. వివిధ ప్యాకేజీలతో పర్యాటకులు సురక్షితంగా అటవీ ప్రాంతాన్ని చుట్టి వచ్చేలా జాగ్రత్తలు తీసుకుంది.

విభిన్న ప్యాకేజీలతో టైగర్ సఫారీ..

పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే రహదారిలోని 24వ కిలో మీటరు వద్ద ఉన్న గోర్లెస్ కాలువగా పిలిచే ప్రాంతం నుంచి ఓపెన్ జీప్సీల్లో 'టైగర్ సఫారీ' ప్రయాణం మొదలవుతుంది. మొదటి ప్యాకేజీగా రాను, పోనూ కలిపి 26 కిలో మీటర్ల మేర ప్రయాణం ఉంటుంది. దీని ధర రూ.2,400. (ఆరుగురు) లోతట్టు అటవీ ప్రాంతంలోని నరమామిడి చెరువు, వ్యూ పాయింట్, పులిచెరువు తదితర ప్రాంతాల మీదుగా సాగే ఈ ప్రయాణం తిరిగి ముఖ ద్వారం వద్దకు చేరుకోవటంతో ముగుస్తుంది. రెండవ ప్యాకేజీ ధర రూ.4 వేలు(ఆరుగురు). ఈ ప్యాకేజీలో 40 కిలో మీటర్ల మేర నల్లమలలో ప్రయాణం ఉంటుంది. నల్లమలలోని పెద్దారుట్ల గేట్, పెద్దారుట్ల వాచ్ టవర్, బేస్ క్యాంపు, పుల్లలదొన, గుడిమెట్ల, పులిచెరువు తదితర ప్రాంతాల మీదుగా ప్రయాణం ఉంటుంది.

కనువిందు చేస్తున్న వన్యప్రాణులు

జంగిల్ సఫారీలో భాగంగా నల్లమలలో జీప్సీ వాహనంలో పర్యటిస్తున్న సందర్శకులకు రాజసానికి ప్రతీకగా నిలిచే పెద్దపులులు కనువిందు చేస్తుంటాయి. పులిచెరువు, నరమామిడి చెరువు ప్రాంతాల్లో స్వేచ్ఛగా సంచరిస్తున్న పెద్దపులులు, చిరుతలు, కృష్ణజింకలు, దుప్పులు, నెమళ్లు తారసపడుతుండటంతో పర్యాటకులు అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతున్నారు. అదేవిధంగా జంగిల్ సఫారీ ప్రారంభమయ్యే గోర్లెస్ కాలువ ప్రాంతం వద్ద ఏర్పాటుచేసిన పర్యావరణ విజ్ఞాన కేంద్రం సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ కేంద్రంలో పెద్దపులి, జింకలు, కృష్ణజింక, నీల్‌గాయ్, సాంబార్, హనీబ్యాడ్జర్, మూషిక జింకలు, రెడ్ జంగిల్ ఫౌల్, గ్రే జంగిల్ ఫౌల్, హార్న్‌బిల్ పక్షులు, గుడ్లగూబ, నెమలితోపాటు ఎన్నో రకాల పక్షుల అందమైన ఆకృతులను ప్రతిష్ఠించారు. దీంతోపాటు సరికొత్త టెక్నాలజీతో ఒక్కో వన్యప్రాణి బొమ్మ వద్ద నిలబడినప్పుడు ఆ వన్యప్రాణి అరుపులతోపాటు దానికి సంబంధించిన పూర్తి వివరాలు లౌడ్ స్పీకర్‌లో వినబడేలా ఏర్పాట్లుచేశారు. వాహనాలు ప్రయాణించే దారి పొడవునా ఉండే వివిధ జాతుల వృక్షాలపై వాటి పేర్లతో కూడిన బోర్డులను ఏర్పాటుచేసి సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు నల్లమలలోని దట్టమైన అటవీ ప్రాంతంలో సాగే ఈ జంగిల్ సఫారీని సుశిక్షితులైన అటవీ సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రయాణం మధ్యలో వాహనాలు మరమ్మతులకు గురైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించి మరో వాహనాన్ని ఘటనాస్థలానికి పంపించేలా అధునాతన టెక్నాలజీతో కూడిన వాకీటాకీలను వినియోగిస్తున్నారు.

బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ కమిటీ ఎన్నిక


గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ జాతీయ నూతన కమిటీ ప్రతినిధులు

అధ్యక్షుడిగా ఎలమంచిలి ప్రవీణ్

తిరుపతి కల్చరల్ (తిరుపతి జిల్లా): గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్ని రాష్ట్రాల ప్రతినిధులైన అధ్యక్ష, కార్యదర్శులతో ఆదివారం తిరుపతిలో జరిగిన ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. మస్కట్ దేశం నుంచి వచ్చిన షకీల్ నలాకట్ ఎన్నికల పరిశీలకుడుగా వ్యవహరించారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడుగా డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ (ఆంధ్రప్రదేశ్), ప్రధాన కార్యదర్శిగా వి.జి.బాబు (కేరళ), కోశాధికారిగా జైకుమార్ (కేరళ), ఉపాధ్యక్షులుగా తన్వీనర్ ఖాన్ (ఉత్తరప్రదేశ్), అన్నెసోని (మహారాష్ట్ర), టి.శేఖర్ (ఉత్తరాఖండ్), షకీల్ (కేరళ), సహాయ కార్యదర్శులుగా పంకజ్ త్యాగి (ఉత్తరప్రదేశ్), వినోద్ (బెంగాల్), మహేష్‌శర్మ (రాజస్థాన్). యూనిస్ బాష (ఆంధ్రప్రదేశ్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జోష్, పల్యాష (కర్ణాటక), సురేష్‌శర్మ (మధ్యప్రదేశ్), సతీష్ (పాండిచ్చేరి), శేఖర్ (హరియాణ), అసోసియేట్ కార్యదర్శిగా అనురాగ్ చౌదరి (ఉత్తరఖాండ్), చీఫ్ క్యాపిటర్‌గా సుభాష్ బదనా (ఢిల్లీ), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా యోగేష్ (నాగపూర్), ఇర్ఫాన్ (కేరళ), గౌరీశంకర్ (ఒడిశా), ప్యాట్రన్‌గా ఈశ్వర్‌ప్రకాష్ (ఆంధ్రప్రదేశ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా శివప్రసాద్ (ఆంధ్రప్రదేశ్), చైర్మన్‌గా మోహన్ సింగ్ రాథోడ్ (మధ్యప్రదేశ్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 206 ఆర్గనైజేషన్లలో సేవచేసే భాగ్యం లభించిందని, కొత్తగా గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గం తనను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నాలుగేళ్లలో భారతదేశం నలుమూలల కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేస్తామని, ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.టి.రవికుమార్ ఆదివారం దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఐఏఎస్ అధికారి లక్ష్మిశా ఉన్నారు.


తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.టి.రవికుమార్

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 83,866 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.15 కోట్లు సమర్పించారు. టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఔషధాల కన్నా.. అవగాహన మిన్న

తెలంగాణ

దయాబెటిస్ ఎక్స్‌పోలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ


ప్రొఫెసర్ బీకే సహాయ్‌కు జీవితకాల సాఫల్య పురస్కారం అందజేస్తున్న అతిథులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఔషధాలు మాత్రమే కాదు.. అవగాహన కూడా పెంచుకోవాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. మధుమేహంపై అవగాహన పెంచే ఉద్దేశంతో మోహన్ డయాబెటిక్ సెంటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జేఆర్‌సీ సెంటర్‌లో ఆదివారం డయాబెటిస్ ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ తనకు డయాబెటిస్ వచ్చిన తొలిరోజుల్లో వ్యాధి నియంత్రణ గురించి వైద్యులు కల్పించిన అవగాహన ఎంత ముఖ్యమైనదో..తర్వాత తనకు అర్థమైందన్నారు. ఈ మధ్య కొందరు డయాబెటిస్ రివర్స్ చేస్తామంటున్నారని, అయితే అది అసాధ్యమని అభిప్రాయపడ్డారు అవగాహనతోనే దీనికి అడ్డుకట్ట వేయగలమని, రోగి మాత్రమే కాకుండా రోగి కుటుంబసభ్యులు కూడా ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మోహన్ డయాబెటిక్ సెంటర్ నిర్వాహకుడు డా.మోహన్ తమకు సీనియర్ అని, అప్పట్లోనే రీసెర్చ్ పేపర్లు రాసేవారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వైద్య కళాశాల మాజీ ప్రొఫెసర్ సీనియర్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ బి.కె..సహాయ్‌కు జీవితసాఫల్య పురస్కారం అందించారు.

మీషో కూపన్ల పేరిట సైబర్‌మోసం

స్క్రాచ్ చేస్తే గిఫ్ట్‌లు అంటూ గాలం • అప్రమత్తంగా ఉండాలన్న సైబర్ భద్రత నిపుణులు



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్ అయిన మీషో పేరిట సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసానికి తెర తీస్తున్నారని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీషో కంపెనీ నుంచి వచ్చిందని భ్రమపడేలా ఓ ఫామ్‌ను, స్క్రాచ్ కార్డును డిజైన్ చేసి సైబర్ నేరగాళ్లు పోస్ట్ చేస్తున్నారు. వీటిని అందుకున్న వారిని అందులోని కార్డును స్క్రాచ్ చేయాలని సూచనల్లో పేర్కొంటున్నారు. అలా స్క్రాచ్ చేసిన తర్వాత అందులో మీరు లక్కీ కస్టమర్ కింద లక్కీ కూపన్‌లో కారు, బంగారం వంటి ఖరీదైన బహుమతులు గెలుచుకున్నారని ఉంటుంది. ఇలా లక్కీ డ్రా తగిలిన వారు వెంటనే మీ స్క్రాచ్ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, మేం అడిగే వివరాలు నమోదు చేయాలని చెబుతారు. ఏదైనా సందేహాలుంటే మీకు ఇచ్చిన దరఖాస్తులోని నంబర్లకు ఫోన్ చేయాలని సూచిస్తున్నారు.

వివరాలిస్తే అసలుకే మోసం...

ఎవరైనా అమాయకులు ఈ ఉచ్చులో చిక్కితే ఇక సైబర్ నేరగాళ్లు తమ విశ్వరూపం చూపిస్తున్నారు. ఇలా స్క్రాచ్ కార్డుపై ఉన్న క్యూర్ కోడ్ స్కాన్ చేసి అందులో సూచించిన విధంగా వివరాలు నమోదు చేస్తే ఇక అసలు మోసం మొదలవుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే అనుమానాస్పద యాప్‌లు మనకు తెలియకుండానే మన ఫోన్‌లోకి ఇన్‌స్టాల్ అవుతాయి. అదేవిధంగా మనం నమోదు చేసే బ్యాంకుఖాతా, వ్యక్తిగత వివరాలన్నీ తీసుకుంటున్న సైబర్ నేరగాళ్లు బ్యాంకుఖాతాల్లోని డబ్బులు కొల్లగొడుతున్నారు. ఇలాంటి కూపన్లు వస్తే నమ్మవద్దని, ఎలాంటి వివరాలు వారితో పంచుకోవద్దని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో పట్టణప్రాంతాలకే పరిమితమైన ఈ తరహా మోసాలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా జరుగుతున్నాయని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

బుల్లి చేపలతో భలే మేలు!

సంపూర్ణ ఆరోగ్యం, ఆయుష్షు

- గుండె జబ్బుల నియంత్రణకు దివ్య ఔషధం కవళ్లు
- గర్భిణులకు బలవర్ధకమైన ఆహారం నెత్తళ్లు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గోదారోళ్లు తిండి పెట్టి చంపేస్తారురా బాబూ అంటుంటారు. గోదావరి తీరంలో లభించే రుచికరమైన చేపలు అటువంటివి మరి. ఒకప్పుడు ముక్క లేనిదే ముద్ద దిగదనే నానుడి గోదావరి జిల్లాలకే ప్రత్యేకం. ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈబాపతు జనం పెరిగిపోయారు. అందులోనూ చేపలు దొరకాలే కానీ ఎంతటి వారైనా ఇట్టే లొట్టలేసుకుని లాగించేస్తున్నారు. గోదావరిలో దొరికే పండుగప్ప, కొయ్యింగ, కొరమేను, సీజనల్‌గా ఆగస్టులో లభించే పులస వంటి పది రకాల చేపలంటే మాంసాహార ప్రియులు పడి చస్తారు. ఇంతకాలం పెద్ద చేపలనే ఇష్టపడేవారు ఇప్పుడు చిన్న చేపలపైనా మక్కువ చూపిస్తున్నారు. చిన్న చేపలు రుచికి రుచి.. బలవర్ధకమైన మాంసాహారం, సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తాయి.

సముద్రపు చేపలకు గిరాకీ

సముద్రపు ఉప్పు నీటిలో లభించే చేపలంటే మాంసాహార ప్రియులు ఇష్టపడతారు. పీతలు, రొయ్యలు, ట్యూనా, వంజరం, కోనం, చందువ తదితర రకాల చేపలకు మార్కెట్‌లో భలే గిరాకీ. ఇటువంటి చేపలు కాకినాడ రేవు నుంచి దక్షిణాదిన తమిళనాడు, కేరళతో పాటు ఒడిశా, మహారాష్ట్రలకు ఎగుమతి చేస్తున్నారు. పెద్ద చేపలతో పాటు చిన్నచిన్న చేపలకు కూడా ఇప్పుడిప్పుడే డిమాండ్ పెరుగుతోందని మత్స్యకారులు చెబుతున్నారు. చూడటానికి అరంగుళం, అంగుళం, ఒకటిన్నర అంగుళాల సైజులో ఉండే ఈ చిన్న చేపలు కొన్ని రకాల జబ్బులకు దివ్యౌషధమని వైద్యులు నిర్ధారిస్తున్నారు. ఈ జాబితాలో నెత్తళ్లు, కవళ్లు, కట్టచేపలు, పరిగెలు, కానగంత తదితర చేపలు ఉన్నాయి. పెద్ద చేపల కంటే చిన్న చేపలు మంచివని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చిన్న చేపల్లో తక్కువ స్థాయిలో మెర్క్యురీ, అధిక స్థాయిలో మినరల్స్ ఉండటంతో ఆరోగ్యానికి మంచిదంటున్నారు. చిన్న చేపల్లో ఒమేగా–3 యాసిడ్స్ ఎక్కువగా ఉండటంతో మెదడు చురుగ్గా పని చేసేందుకు దోహదపడుతుంది. చిన్న చేపల్లో కలుషితాల స్థాయి కూడా తక్కువ మోతాదులో ఉంటుంది. పెద్ద చేపల కంటే చిన్న చేపల ధర కూడా తక్కువే. పండుగప్ప, వంజరం, ట్యూనా, కొరమేను వంటి కేజీ, కేజీన్నర ఉండే ఒక పెద్ద చేప కొనాలంటే కనీసం రూ.వెయ్యి వెచ్చించాలి. అదే కేజీ చిన్న చేపలు కావాలంటే రూ.100 నుంచి రూ.200 పెడితే దొరికేస్తాయి. వివిధ రకాల పండ్లు, కూరగాయల నుంచి అదనంగా లభించే ఐరన్, జింక్ చిన్న చేపల ద్వారా పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు. చిన్న చేపలను ఆహారంగా తీసుకునే మహిళల్లో రక్తహీనత తగ్గి శక్తిమంతులవుతారు. ప్రధానంగా గర్భిణులు, ప్రసవం అయిన మహిళలకు నెత్తళ్లు రకం చిన్న చేపలు ఎంతో బలవర్ధకమైన ఆహారంగా గ్రామీణ మహిళలు భావిస్తారు. అల్పాదాయ దేశాల్లో మధ్యతరగతి, పేద వర్గాలు చిన్న చేపలనే ఎక్కువగా ఆహారంగా తీసుకుంటారు. వారంతా ఆరోగ్యవంతులుగా, బలవంతులుగా ఉంటారని వరల్డ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ తాజా అధ్యయనంలో పేర్కొంది. మహిళా సాధికారత కోసం ఒడిశా రాష్ట్రం మిషన్ శక్తి చొరవతో రెండేళ్ల క్రితం పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. దీని ద్వారా 7 మిలియన్లకు పైగా చిన్న చేప పిల్లలను ఉత్పత్తి చేసిందని అధ్యయనం చెబుతోంది. వీటిని మహిళా స్వయం సహాయక బృందాలకు పంపిణీ చేసి, గ్రామీణ మహిళల్లో శక్తిసామర్థ్యాల పెంపునకు ఇతోధికంగా తోడ్పాటు అందించారు. స్విట్జర్లాండ్, కాంబోడియా వంటి దేశాల్లో స్వదేశీ చిన్న చేపలను కూరగాయల ఉత్పత్తితో పాటు మిళితం చేయడం గమనార్హం.


నెత్తళ్లు


చిన్న చేపల్లో బలవర్ధకమైన కవళ్లు

కవళ్లతో గుండె జబ్బుల నివారణ

చిన్న చేపల్లో ప్రధానంగా కవళ్లు ఆహారంగా తీసుకుంటే కాల్షియం, మినరల్స్, విటమిన్–డి వంటి పోషకాలు లభిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వీటిని ఆహారంగా తీసుకునే వారిలో గుండె జబ్బులకు ఆస్కారం ఉండదంటున్నారు. ఈ చేపలు చూసేందుకు చాలా చిన్నగా ఉంటాయి. వ్యావహారికంగా వీటిని ఆయిల్ సర్డిన్స్‌గా, శాస్త్రీయంగా సర్డెనెళ్ల లొంగిసెప్స్‌గా పిలుస్తారు. ఈ చేపల్లో పాలి అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్‌లు అధికంగా ఉండటం వలన గుండె జబ్బులను తగ్గిస్తాయి.

నెత్తళ్లతో కీళ్ల నొప్పులు మాయం

సిల్వర్ కలర్‌లో కనిపించే నెత్తళ్ల చేపలు చాలా చిన్నగా ఉంటాయి. ఆంకూవీస్ అని వ్యవహారికంగా పిలిచే ఈ చేపల శాస్త్రీయ నామం స్టోల్ ఫోరస్ ఇండికస్. నెత్తళ్లలో కాల్షియం ఎక్కువగా ఉండడంతో కీళ్ల నొప్పుల నివారణకు పనికొస్తాయి. గర్భిణులు, వృద్ధులకు ఎంతో బలవర్ధకమైన ఆహారంగా భావిస్తారు. నెత్తళ్లు 100 గ్రాములు ఆహారంగా తీసుకుంటే 200 కిలో క్యాలరీల శక్తి, 45 గ్రాముల ప్రొటీన్లు, 3.3 గ్రాముల కొవ్వు పదార్థాలు, 1,400 మిల్లీగ్రాముల కాల్షియం, 2 గ్రాములు మిగిలిన ఖనిజాలు, 67 మిల్లీ గ్రాముల కొలెస్ట్రాల్ లభిస్తాయని కాకినాడ ఎస్‌ఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

చిన్న చేపల్లో కాల్షియం ఎక్కువ



చిన్న చేపల్లో కాల్షియం, విటమిన్–ఎ పుష్కలంగా ఉంటాయి. ఈ చేపలను ఆహారంగా తీసుకుంటే ఎముకలకు, కళ్లకు మేలు జరుగుతుంది. సహజంగా పెద్ద చేపలు ఇష్టంగా తీసుకుంటారు. పెద్ద చేపల కంటే చిన్న చేపలు బలవర్ధకం. గర్భిణులకు, ప్రసవానంతరం బలవర్ధకమైన ఆహారంగా నెత్తళ్లు పెట్టడం పల్లెల్లో ఆనవాయితీగా వస్తున్నదే.

– టి.సుమలత, ప్రిన్సిపాల్, ఎస్ఐఎఫ్‌టీ, కాకినాడ

చిన్న చేపలను ముళ్లతో తింటే మేలు



చిన్న చేపల్లో ముళ్లు లేతగా ఉంటాయి. అందులో కాల్షియం, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. గొంతులో గుచ్చుకుంటాయనే అనుమానం లేకుంటే చిన్న చేపలను ముళ్లతో తినడమే మేలు. ప్రకృతిలో దేని ద్వారానూ లభించనంత కాల్షియం చిన్న చేపల్లో లభ్యమవుతుంది. ఈ కాల్షియం ఎముకలు గుల్ల బారడాన్ని నివారించి, ఆస్టియోపొరాసిస్ వంటి సమస్యలను దూరం చేస్తుంది. చిన్న చేపల నుంచి లభ్యమయ్యే ప్రొటీన్ వల్ల కండ పుష్టి ఏర్పడి, శరీర నిర్మాణానికి దోహదపడుతుంది.

– డాక్టర్ తొమ్మూర్తి గౌరీశేఖర్, ఎముకల వైద్య నిపుణుడు, కాకినాడ

యూపీలో ఆఖరి పోరాటం!

13 స్థానాలకు జూన్ 1న పోలింగ్ ● వారణాసిపైనే అందరి దృష్టి



ఉత్తరప్రదేశ్‌లో సుదీర్ఘ సార్వత్రిక ఎన్నికల సంగ్రామం ఆఖరి అంకానికి చేరుకుంది. 6 విడతల్లో 67 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ముగిసింది. మిగతా 13 సీట్లలో జూన్ 1న చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. 2019లో వీటిలో 11 స్థానాలు బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కైవసం కాగా బీఎస్పీకి 2 దక్కాయి. ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి, సీఎం యోగి కంచుకోట గోరఖ్‌పూర్ సహా కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

వారణాసి... మోదీ హ్యాట్రిక్ గురి

కాశీ విశ్వేశ్వరుడు కొలువుదీరిన ఈ లోక్‌సభ స్థానంలో 1991 నుంచి కమలనాథులు పాతుకుపోయారు. 2004లో కాంగ్రెస్ నెగ్గినా 2009లో బీజేపీ దిగ్గజం మురళీ మనోహర్ జోషి గెలుపొందారు. 2014లో ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీ ఇక్కడ తొలిసారి బరిలో దిగారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై 3.7 లక్షలకు పైగా మెజారిటీతో గెలిచారు. 2019లో మెజారిటీని 4.8 లక్షలకు పెంచుకున్నారు. ఈసారి హ్యాట్రిక్ కోసం ఉవ్విళ్లూరుతున్నారు. కాంగ్రెస్ తరఫున పీసీసీ చీఫ్ అజయ్ రాయ్, బీఎస్పీ నుంచి అథర్ జమాల్ లారీ రేసులో ఉన్నారు. ఈసారి మోదీ మెజారిటీ పెరుగుతుందా, లేదా అన్నదే ప్రశ్నగా కనిపిస్తోంది.

గోరఖ్‌పూర్... భోజ్‌పురీ వార్

సుప్రసిద్ధ గోరఖ్‌నాథ్ ఆలయానికి నెలవు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కంచుకోట. ఆయన గురువు మహంత్ అవైద్యనాథ్ 1989 నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. తర్వాత యోగి 1998 నుంచి 2014 దాకా ఐదుసార్లు నెగ్గారు. ఆయన సీఎం కావడంతో జరిగిన ఉప ఎన్నికలో అనూహ్యంగా ఎస్పీ గెలిచినా 2019లో బీజేపీ ప్రముఖ భోజ్‌పురి నటుడు రవికిషన్‌ను బరిలోకి దించి 3 లక్షల మెజారిటీతో కాషాయ జెండా ఎగరేసింది. ఈసారీ ఆయనే పోటీలో ఉన్నారు. ఎస్పీ నుంచి భోజ్‌పురి నటి కాజల్ నిషాద్, బీఎస్పీ నుంచి జావెద్ సిమ్నాని బరిలో ఉన్నారు. కాంగ్రెస్ దన్నుతో బీజేపీకి ఎస్పీ గట్టి పోటీ ఇస్తోంది.

గాజీపూర్.. త్రిముఖ పోరు

ఇక్కడ 2014లో బీజేపీ, 2019లో ఎస్పీ గెలిచాయి. ఎస్పీ నుంచి అఫ్జల్ అన్సారీ, బీఎస్పీ నుంచి ఉమేశ్ సింగ్, బీజేపీ నుంచి పరాస్ నాథ్ రాయ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 20 శాతం ఎస్సీలు, 11 శాతం ముస్లింలు ఉంటారు. ఓటర్లు ఒక్కోసారి ఒక్కో పార్టీకి పట్టం కడుతున్న నేపథ్యంలో త్రిముఖ పోరు ఉత్కంఠ రేపుతోంది. గాజీపూర్ పరిధిలోని 5 అసెంబ్లీ సెగ్మెంట్లలో 4 ఎస్పీ చేతిలోనే ఉన్నాయి!

చందౌలీ... టఫ్ ఫైట్

దేశంలోనే అత్యంత వెనకబడ్డ ప్రాంతాల్లో ఒకటి. ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువ. 2014, 2019ల్లో మోదీ వేవ్‌లో బీజేపీ ఖాతాలో పడింది. సిట్టింగ్ ఎంపీ మహేంద్రనాథ్ పాండే ఈసారి హ్యాట్రిక్‌పై గురి పెట్టారు. ఎస్పీ నుంచి వీరేంద్ర సింగ్, బీఎస్పీ నుంచి సత్యేంద్రకుమార్ మౌర్య పోటీలో ఉన్నారు. బీజేపీకి ఎదురుగాలి వీస్తోంది.

మీర్జాపూర్... ప్రాంతీయ పార్టీల హవా

ఒకప్పుడు బందిపోటు రాణి ఫూలన్ దేవి అడ్డా. 1996, 1999లో ఆమె ఎస్పీ తరఫున విజయం సాధించారు! 2001లో ఆమె హత్యానంతరం బీఎస్పీ రెండుసార్లు గెలిచింది. 2014లో అప్నాదళ్ నుంచి అనుప్రియా పటేల్ ఘనవిజయం సాధించారు. 2016లో పార్టీ బహిష్కరణతో అప్నాదళ్(ఎస్) పేరుతో కొత్త పార్టీ పెట్టి ఎన్డీఏ దన్నుతో 2019లో మళ్లీ నెగ్గారు. ఈసారి కూడా ఎన్డీఏ నుంచి బరిలో ఉన్నారు. ఎస్పీ నుంచి రమేశ్ చంద్ర బింద్, ఎస్పీ తరఫున మనీశ్ తివారీ రేసులో ఉన్నారు. మీర్జాపూర్‌లో వెనకబడిన వర్గాలు 49 శాతం, ఎస్సీ, ఎస్టీలు 25 శాతం ఉంటారు.

కుషీనగర్... హోరాహోరీ

గౌతమ బుద్ధుడు మహాపరినిర్వాణం (శరీర త్యాగం) చేసిన చోటు కావడంతో ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులు, పర్యాటకులు ఏటా భారీగా వస్తుంటారు. 2008లో ఈ నియోజకవర్గం ఏర్పాటైంది. 2009లో కాంగ్రెస్ జోనీ కొట్టగా 2014, 2019ల్లో బీజేపీ పాగా వేసింది. సిట్టింగ్ ఎంపీ విజయ్ కుమార్ దూబే ఈసారీ బరిలో ఉన్నారు. ఎస్పీ నుంచి అజయ్ ప్రతాప్ సింగ్ (పింటూ). బీఎస్పీ నుంచి శుభ్ నారాయణ్ చౌహాన్ పోటీ చేస్తున్నారు. బీఎస్పీ చీల్చే ఓట్లు కీలకం కానున్నాయి.

పోలింగ్ జరిగే మొత్తం స్థానాలు...
మహారాజ్‌గంజ్, గోరఖ్‌పూర్, కుషీనగర్, దేవరియా, బన్స్‌గావ్ (ఎస్సీ), ఘోసి, సలేంపూర్, బలియా, ఘాజీపూర్, చందౌలీ, వారణాసి, మీర్జాపూర్, రాబర్ట్స్‌గంజ్ (ఎస్సీ)

‘రెమాల్’తో బెంగాల్ అతలాకుతలం

- తీవ్ర తుపానుతో 120 కిలోమీటర్ల వేగంతో గాలులు
- పశ్చిమబెంగాల్‌లో అత్యంత భారీ వర్షాలు
- లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- విమానాలు, రైళ్లు రద్దు

కోల్‌కతా: తీవ్ర తుపాను ‘రెమాల్’ ధాటికి పశ్చిమబెంగాల్ అతలాకుతలమవుతోంది. దీని ప్రభావంతో గంటకు 110–120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బెంగాల్ తీర ప్రాంత జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, కోల్‌కతా పరిసర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వివరించింది. తీరప్రాంతాల నుంచి 1.1 లక్షల మందిని ఆదివారం యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. రెమాల్‌తో నష్టం తక్కువేనని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఉత్తర, దక్షిణ పరగణాల జిల్లాల్లోని బలహీన నిర్మాణాలు, విద్యుత్, సమాచార వ్యవస్థలు, కచ్చా రోడ్లు, పంటలు, తోటలకు నష్టం వాటిల్ల వచ్చని చెప్పారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈస్టర్న్, సౌత్ ఈస్టర్న్ రైల్వేలు ఆది, సోమవారాల్లో కొన్ని రైళ్లను రద్దు చేశాయి. కోల్‌కతా విమానాశ్రయం అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి 21 గంటలపాటు బయలుదేరాల్సిన, రావాల్సిన 394 సరీ్వసులను రద్దు చేశారు. పోలీసులు, ఫైర్ సిబ్బందితోపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశారు. బెంగాల్‌తోపాటు ఉత్తర ఒడిశాలో 26, 27వ తేదీల్లో తుపాను ప్రభావంతో అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అస్సాం, మేఘాలయ, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ తుపాను ప్రభావం తీవ్రంగానే ఉంటుందని అంచనా వేసింది. రక్షణ, సహాయక కార్యక్రమాల సన్నద్ధతపై అధికారులతో ప్రధాని మోదీ ఆదివారం సమీక్ష జరిపారు.

బంగ్లాదేశ్‌లో...

బంగ్లాదేశ్‌లోని పేరా, మోంగ్లా పోర్టుల్లో అత్యంత ప్రమాద 10వ నంబర్ హెచ్చరికను, కోక్స్ బజార్, చిట్టోగ్రామ్‌లలో 9వ నంబర్ హెచ్చరికలను ఎగురవేశారు. అలలు సాధారణం కంటే 8 నుంచి 12 అడుగుల వరకు ఎత్తులో ఎగసిపడుతున్నాయి. 8 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చిట్టగాంగ్ ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులను రద్దు చేశారు.


మేం అలాగే చేస్తాం

- మతప్రాతిపదికన ఎన్నికల ప్రచారం చేస్తున్నారన్నాసరే..
- ఆర్టికల్ 370, యూసీసీ, ముస్లిం కోటాపై అమిత్ షా వ్యాఖ్య

న్యూఢిల్లీ: విపక్షాల విమర్శలకు జడిసేదిలేదని బీజేపీ అగ్రనేత అమిత్ షా స్పష్టంచేశారు. ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌర స్మృతి, ముస్లింలకు కోటాను వ్యతిరేకిస్తూ ఎన్నికల ప్రచారంలో బీజేపీ మతం అంశాన్ని ముందుకు తెస్తోందని విపక్షాలు విమర్శించినాసరే తాము అలాగే చేస్తామని కుండబద్దలు కొట్టారు. ఆదివారం పీటీఐతో ఇంటర్వ్యూలో షా వెల్లడించిన విషయాలు, ప్రస్తావించిన అంశాలు ఆయన మాటల్లోనే..

మేం అప్పుడు ఓడిపోయాం కదా!

‘‘రాజ్యాంగంలో లేనివిధంగా మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు విపక్షాలు ఇస్తామంటే వ్యతిరేకిస్తున్నాం. ఆర్టికల్ 370ని రద్దు చేశాం, ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొచ్చాం. చేసిన పనులనే చెప్పుకుంటున్నాం. వద్దు అని విపక్షాలు అన్నాసరే మేం అలాగే చేస్తాం. కావాలనే పోలింగ్ శాతాలను ఈసీ ఆలస్యంగా వెల్లడిస్తూ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విపక్షాలు అంటున్నాయి. ఈవీఎంలను బీజేపీ తమకు అనుకూలంగా మార్చేస్తోందని విపక్షాల చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదు. తెలంగాణ, పశ్చిమబెంగాల్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలప్పుడూ ఈసీ ఇలాగే చేసింది. అప్పుడు ఆ రాష్ట్రాల్లో మేం ఓడిపోయాంకదా. ఆ ఎన్నికలు పారదర్శకంగా జరిగితే ఈ ఎన్నికలు కూడా అంతే పారదర్శకంగా జరుగుతున్నట్లే లెక్క. ఓడిపోతానని రాహుల్ గాంధీ ఊహించారు. అందుకే ముందే ఏడ్చేసి, ఏవో కారణాలు చెప్పేసి విదేశాలకు వెళ్లిపోతారు. జూన్ 6న విదేశాలకు వెళ్తారేమో. అందుకే ఏదో ఒకటి చెప్తున్నారు’’



‘400’ అనేది నినాదం కాదు

‘‘ మేం 399 సీట్లు సాధిస్తే ‘ మీకు 400 రాలేదుగా’ అని విపక్షాలు విమర్శిస్తే అది వారి విజ్ఞతకే వదిలేస్తా. ఈసారి 400 సీట్లు గెలుస్తాం అనేది మా నినాదం కాదు. విజయావకాశాలను లెక్కగట్టి చెప్పిన సంఖ్య అది. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల వల్లే మేం ఈసారి ఎక్కువ స్థానాల్లో గెలవబోతున్నాం. పేద కుటుంబమహిళకు ఏటా రూ.1 లక్ష ఇస్తామని కాంగ్రెస్ అమలుచేయలేని వాగ్దానా లిస్తోంది. 2–3 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలిస్తోంది. రూ.1 లక్ష సంగతి దేవుడెరుగు గతంలో హామీ ఇచ్చినట్లు(హిమాచల్ ప్రదేశ్‌లో) రూ.1,500 అయినా ఇస్తారేమో చూద్దాం.

బెంగాల్, ఒడిశాలోనూ మాదే హవా

‘‘పశ్చిమబెంగాల్‌లో 24–30 సీట్లు, ఒడిశాలో 16–17 సీట్లు గెలుస్తాం. తమిళనాడులోనూ ఓటు షేర్ పెంచుకుంటాం. ఈసారి కేరళలో ఖాతా తెరుస్తాం. వచ్చే ఐదేళ్లలో దేశమంతటా ఉమ్మడి పౌరస్మృతి అమలుచేస్తాం. మండే ఎండాకాలంలో కాకుండా వేరే కాలంలో ‘ఒకే దేశం–ఒకే ఎన్నికలు’ అమలుచేస్తాం. సంబంధిత బిల్లునూ పార్లమెంట్‌లో ప్రవేశపెడతాం. ఆర్మీలో యువత కోసం అగ్నివీర్‌ను మించిన అద్భుత పథకం లేదు. నాలుగేళ్ల సర్వీస్ తర్వాత చక్కని ప్రతిభ కనబరిచిన వారికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగం ఉంది కదా’’.

ఆర్మీ చీఫ్ పదవీ కాలం నెల పొడిగింపు

న్యూఢిల్లీ: దేశ ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీ కాలాన్ని కేంద్రం మరో నెలపాటు పొడిగించింది. ‘ఆర్మీ స్టాఫ్ జనరల్ మేజర్ సి.మనోజ్ పాండే పదవీ కాలాన్ని జూన్ 30వ తేదీ వరకు పొడిగించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ మే 26వ తేదీన ఆమోదించింది. ఆర్మీ రూల్స్– 1954లో రూల్ 16ఏ(4) ప్రకారం ఇది అమల్లోకి వస్తుంది’ అని రక్షణ మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 2022 ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టిన జనరల్ పాండే ఈ నెల 31వ తేదీన రిటైరవ్వాల్సి ఉంది.

అమెరికాలో సుడిగాలుల బీభత్సం

11 మంది దుర్మరణం

వ్యాలీ వ్యూ (టెక్సాస్): అమెరికాలో టెక్సాస్, ఒక్లహోమా, అర్కాన్సాస్ రాష్ట్రాల్లో భీకర సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. ట్రక్కుల పార్కింగ్ స్టేషన్, ఇళ్లను తుడిచిపెట్టేస్తూ సాగిన విధ్వంసకాండలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్లహోమాలో టోర్నడోలు భీకర వినాశనానికి కారణమయ్యాయి. భీకర గాలుల ధాటికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వేలాది ఇళ్లలో జనం అంధకారంలో మగ్గిపోయారు.

‘ఇండియా’ కూటమి గెలిస్తే

హిందువులు రెండో తరగతి పౌరులే..

- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తారు
- మొత్తం రిజర్వేషన్లు ముస్లింలకే కట్టబెడతారు
- ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో మోదీ

మీర్జాపూర్/దేవరియా: దేశంలో మతపరంగా మెజార్టీగా ఉన్న ప్రజలను(హిందువులు) రెండో తరగతి పౌరులుగా మార్చేందుకు ప్రతిపక్ష ‘ఇండియా’ కూటమిలోని పార్టీలు కుట్ర పన్నుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ఓటు బ్యాంక్‌కు మతపరంగా రిజర్వేషన్లు కట్టబెట్టడమే లక్ష్యంగా రాజ్యాంగాన్ని మార్చేందుకు పథకం రచిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్, ఘోసీ, దేవరియాలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి మాట్లాడారు. ప్రతిపక్షాలు దేశంలో కులాల మధ్య చిచ్చు పెడుతున్నాయని మండిపడ్డారు. వేర్వేరు కులాలు పరస్పరం కొట్టు



కొనేలా చేయడమే ఇండియా కూటమి ధ్యేయంగా మారిపోయిందన్నారు. కులాలను బలహీనపర్చి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. బహిరంగ సభల్లో మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

రాజ్యాంగాన్ని మళ్లీ రాస్తారు..

‘‘ప్రతిపక్షాలు సాగిస్తున్న కుట్రల గురించి ప్రజలను హెచ్చరించడానికే ఈ రోజు పూర్వాంచల్‌కు వచ్చా. విపక్ష కూటమికి అధికారం కట్టబెడితే మొదట రాజ్యాంగాన్ని మార్చేస్తారు. మతపరంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలుగా రాజ్యాంగాన్ని మళ్లీ రాస్తారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తారు. మొత్తం రిజర్వేషన్లు ముస్లింలకే కట్టబెడతారు. ముస్లింలను రాత్రికి రాత్రే ఓబీసీ కేటగిరీలో చేరుస్తారు. ఓబీసీ కేటగిరీ కింద వారికి రిజర్వేషన్లు కల్పిస్తారు. మెజార్టీ ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చేయాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు భావిస్తున్నాయి.

ఇంతకంటే అన్యాయం ఉంటుందా?

2014 కంటే ముందు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రికి రాత్రే చట్టాన్ని మార్చేసింది. పలు పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలను మైనార్టీ విద్యాసంస్థలుగా గుర్తించింది. దాంతో ఆయా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు దక్కడం లేదు. అక్కడ కేవలం ముస్లింలకే ప్రవేశాలు లభిస్తున్నాయి. గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల బిడ్డలకు ఇంతకంటే అన్యాయం ఇంకేదైనా ఉంటుందా?

మూడోసారీ మాదే విజయం

ఒక మంచి ఇల్లు కట్టించాలంటే 10 మంది తాపీ మేస్త్రీలను నియమించుకుంటారా? అలా ఎవరూ చేయరు. ఒక్కరికే అప్పగిస్తారు. విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు వస్తారట! ఏడాదికొకరు అధికారంలో ఉంటారట! ఇదెక్కడి చోద్యం. ఇలా జరగడం ఏక్కడైనా ఉందా? పదవి కాపాడుకోవడానికి ఆరాటపడే ప్రధానమంత్రి ఇక ప్రజలకేం చేస్తారు. దేశాన్ని బలోపేతం చేయగలరా? బలమైన దేశం కోసం బలమైన ప్రధాని కావాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. మాకు రెండు సార్లు అధికారం అప్పగించారు. మూడోసారి కూడా మమ్మల్ని గెలిపించబోతున్నారు. ఓడిపోయేవారికి ఓటు వేసి ఓటు వృథా చేసుకోవద్దని ప్రజలు నిర్ణయానికొచ్చారు’’ అని మోదీ స్పష్టం చేశారు.

ఛాయ్ కప్పులు కడుగుతూ...

బాల్యంలో ఛాయ్ కప్పులు, ప్లేట్లు కడుగుతూ, కస్టమర్లకు ఛాయ్‌లు అందిస్తూ పెరిగానని ప్రధాని మోదీ అన్నారు. ఛాయ్‌కి, తనకు మధ్య లోతైన అనుబంధం ఉందని చెప్పారు.

ఢిల్లీ ఆస్పత్రిలో ఘోర అగ్నిప్రమాదం.. ఏడుగురు నవజాత శిశువులు మృతి

- మరో ఐదుగురిని కాపాడిన స్థానికులు
- శనివారం అర్ధరాత్రి జరిగిన ఘటన
- ఆస్పత్రి యజమాని అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని వివేక్ విహార్‌లో శనివారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బేబీ కేర్ న్యూ బోర్న్ హాస్పిటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు పసికందులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో మొదలైన మంటలు చుట్టుపక్కలున్న మరో రెండు భవనాలకు సైతం వ్యాపించినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు. మొత్తం 16 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చామన్నారు. ఆస్పత్రి రెండో అంతస్తులో నిల్వ ఉంచిన ఆక్సిజన్ సిలిండర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని చెప్పారు. మంటలు వ్యాపించిన ఆస్పత్రి భవనం నుంచి మొత్తం 12 మంది శిశువులను బయటకు తీసుకురాగా వారిలో ఏడుగురు చనిపోయారని ఫైర్ చీఫ్ అతుల్ గర్గ్ చెప్పారు. మిగతా ఐదుగురిలో కొందరు స్వల్పంగా గాయపడ్డారన్నారు. మంటలను గమనించిన స్థానికులు, షహీద్ సేవా దళ్ కార్యకర్తలు కలిసి భవనం వెనుక వైపు నుంచి నిచ్చెనల ద్వారా పైకెక్కి చిన్నారులను కిందికి తీసుకువచ్చారని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రి సిబ్బంది పరారైనట్లు చెబుతున్నారు. ఆస్పత్రి యజమాని నవీన్ కిచిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని షాదారా డీసీపీ సురేంద్ర చౌదరి చెప్పారు. ఈ దారుణంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర విచారం వెలిబుచ్చారు. ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబాలను కోరారు.



ఆస్పత్రి వెనుకవైపు నుంచి శిశువులను తీసుకొస్తున్న స్థానికులు, ఫైర్ సిబ్బంది

పపువా న్యూ గినియా విషాదం.. మరణాలు 670కి పైనే..

మెల్‌బోర్న్: పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూ గినియాలో శుక్రవారం కొండచరియలు విరిగిపడి గ్రామాన్ని నేలమట్టం చేయడం తెల్సిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 670కిపైనే అని ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ మైగ్రేషన్(ఐవోఎం) ఆదివారం తెలిపింది. ఎంగా ప్రావిన్స్ అధికారులు, బాధిత యంబలి గ్రామస్తులు అందించిన సమాచారాన్ని బట్టి 150కిపైగా ఇళ్లు భూస్థాపితం కాగా వాటిలోని 670 మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు ఐవోఎం అంచనా వేసింది. క్షతగాత్రులు, గల్లంతైన వారి సంఖ్యలో స్పష్టత రాలేదని పేర్కొంది. ఆదివారం ఐదు మృతదేహాలను వెలికి తీసినట్లు స్థానిక అధికారులు చెప్పారు. మట్టి, బండరాళ్లు, చెట్లు మూడు నుంచి నాలుగు ఫుట్‌బాల్ మైదానాలంత విస్తీర్ణంలో 6 నుంచి 8 మీటర్ల లోతున గ్రామాన్ని భూస్థాపితం చేశాయని, లోపల చిక్కుకున్న వారు బతికి బట్టకట్టేందుకు అవకాశాలు తక్కువని ఐవోఎం అంటోంది. మరోవైపు స్థానిక గిరిజన తెగల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. శనివారం జరిగిన ఘర్షణలో ఎనిమిది మంది చనిపోయారు. దాంతో సహాయక సిబ్బంది, అత్యవసరాలను చేరవేయడానికి ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది.

మానవ తప్పిద మహావిషాదం

- రాజ్‌కోట్ గేమ్‌జోన్ దుర్ఘటనపై గుజరాత్ హైకోర్టు వ్యాఖ్య
- 33కు పెరిగిన మరణాల సంఖ్య

అహ్మదాబాద్: రాజ్‌కోట్‌లో గేమ్‌జోన్‌లో అగ్నిప్రమాద ఘటనపై గుజరాత్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. మానవ తప్పిద మహావిషాదంగా అభివర్ణించింది. ఘటనను సూమోటోగా స్వీకరించిన జస్టిస్ బీరేన్ వైష్ణవ్, జస్టిస్ దేవాన్ దేశాయ్‌ల హైకోర్టు ధర్మాసనం ఈ కేసును ఆదివారం విచారించింది. ‘‘ ప్రాథమిక ఆధారాలను చూస్తే ఇది మానవతప్పిదమే స్పష్టంగా తెలుస్తోంది. ఏ చట్టనిబంధనల కింద ఇలాంటి గేమింగ్ జోన్లు, రీక్రియేషనల్ కేంద్రాలను ఏర్పాటుచేశారు?’ అని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ‘‘ గుజరాత్ కాంప్రిహెన్సివ్ జనరల్ డెవలప్‌మెంట్ కంట్రోల్ రెగ్యులేషన్స్(జీడీసీఆర్) నిబంధనల్లో ఉన్న లొసుగులను తెలివిగా వాడుకున్నట్లు తెలుస్తోంది. గేమింగ్ జోన్లు రాజ్‌కోట్‌తోపాటు అహ్మదాబాద్, వడోదర, సూరత్‌లలో ఉండటంతో ఆయా నగర మున్సిపల్ కార్పొరేషన్ల తరఫు అడ్వకేట్లు అందర్నీ సోమవారం తమ ఎదుట హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ‘‘ నిరభ్యంతర సర్టిఫికెట్, నిర్మాణ అనుమతులు వంటి వాటి నుంచి తప్పించుకునేందుకు టీఆర్‌పీ గేమ్ జోన్ నిర్వాహకులు ఏదో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకుని చిన్నారులు రక్షణను గాలికొదిలేశారు. గేమ్‌జోన్‌లో అనుమతి లేని, మండే స్వభావమున్న పెట్రోల్, ఫైబర్, ఫైబర్ గ్లాస్‌షీట్లను భద్రపరిచిన చోటులోనే అగ్నిప్రమాదం జరిగింది’ అని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

15మంది జాడ గల్లంతు

ఆదివారం నాటికి మృతుల సంఖ్య 33కు పెరిగింది. మరో 15 మందికిపైగా జనం జాడ తెలీడం లేదని అధికారులు వెల్లడించారు. నానామావా రోడ్‌లోని ఘటనాస్థలిని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సందర్శించారు. తర్వాత క్షతగాత్రులను ఆస్పత్రిలో కలిసి పరామర్శించారు. చనిపోయిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉన్నారు. ‘ ఘటన కారకులందరినీ ఉరితీయాలి. ఏ ఒక్కరికీ బెయిల్ కూడా దొరకొద్దు. బెయిల్ ఇస్తే వారిని నేనే చంపేస్తా’ అని ఏకైక కుమారుడు, నలుగురు బంధువులను పోగొట్టుకున్న ప్రదీప్‌సిన్హ్ చౌహాన్ ఆవేశంగా చెప్పారు. ఇటీవల నిశ్చితార్థమైన ఒక జంట సైతం ప్రమాదంలో అగ్నికి ఆహుతైంది. గేమ్‌జోన్ ఉన్న అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు ఎలాంటి ఫైర్ ఎన్‌ఓసీ సర్టిఫికెట్ లేదని ఎఫ్ఐఆర్‌లో రాసి ఉంది.

ఎలక్షన్ బీట్

ఆరో విడతలో 63.36 శాతం

న్యూఢిల్లీ: లోకసభ ఎన్నికల్లో భాగంగా ఆరో విడతలో 8 రాష్ట్రాలు, యూటీల్లో శనివారం 58 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తాజా గణాంకాల ప్రకారం పోలింగ్ 63.36 శాతానికి పెరిగింది. పశ్చిమబెంగాల్ పరిధిలోని ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో 82.71 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారి ఆదివారం వెల్లడించారు. ఇప్పటివరకు ముగిసిన ఆరు దశలను పరిశీలిస్తే అన్నింటికన్నా తక్కువగా ఐదో దశలో 62.2 శాతం పోలింగ్ నమోదైంది. ఆరో దశ కింద 2019లో 59 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 64.4 శాతం పోలింగ్ నమోదైంది. ప్రతి దశలోని తుది పోలింగ్ శాతాలు ఓట్ల లెక్కింపు తర్వాతే అందుబాటులోకి వస్తాయని కేంద్ర ఎన్నికల సంఘం వివరించింది. పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను లెక్కించడం వల్లే పోలింగ్ శాతాలు పెరుగుతాయని గుర్తుచేసింది.

మోదీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి!

నితీశ్ కుమార్ వ్యాఖ్యలతో అవాక్కైన బీజేపీ నేతలు

పట్నా: పార్టీ మారాక ఎన్నికల ప్రచారంలో పాత పార్టీనే పొగిడిన నేతలను మనం చేశాం. అదే తరహాలో ప్రసంగాల్లో తప్పులు దొర్లిన ఘటన ఒకటి బిహార్‌లో ఆదివారం జరిగింది. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ పట్నాలో ఎన్నికల ప్రచారర్యాలీలో ప్రసంగించారు. ‘‘ నరేంద్ర మోదీ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా’’ అని నితీశ్ అనేసరికి అక్కడున్న వారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. అక్కడే ఉన్న జేడీయూ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ కుమార్ ఝా.. నితీశ్‌కు ప్రసంగంలో దొర్లిన తప్పును గుర్తుచేశారు. వెంటనే పొరపాటును సరిదిద్దుకోవాల్సిందిపోయి నితీశ్ ఆ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ‘అవును. నిజమే ఆయన ప్రధాని అని నాకూ తెలుసు’ అని వ్యాఖ్యానించారు. దీంతో ఆశ్చర్యపోవడం అక్కడి వారి వంతయింది. మంచి కోసమే తాను ఆర్జేడీ నుంచి రెండు సార్లు తెగతెంపులు చేసుకున్నానని నితీశ్ సమర్థించుకున్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం: కేజ్రీవాల్

చండీగఢ్: మోదీ పాలనలో దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపించారు. దేశ స్వేచ్ఛ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో పంజాబ్ ప్రజలు మరోసారి ముందుండి నడవాలని పిలుపునిచ్చారు. ఆదివారం పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడారు. ‘‘ సార్వత్రిక ఎన్నికలపై మార్చి 16న ఈసీ ప్రకటన చేస్తే ఐదు రోజులకే నన్ను అరెస్టుచేశారు. మహారాష్ట్రలో ఎన్సీపీని మోదీజీ ముక్కలు చేసి పార్టీని, పార్టీ గుర్తును లాగేశారు. శివసేనను రెండు ముక్కలుగా విడగొట్టారు. ఎన్నికలకు ముందే హేమంత్ సోరెన్‌నూ అరెస్టుచేశారు. పాక్‌లో ఇమ్రాన్‌ను, బంగ్లాదేశ్‌లో అన్ని విపక్షాల నేతలను జైలులో పడేశారు. మన దేశంలోనూ నియంతృత్వం విస్తరిస్తోంది. నా కోసం మీ దగ్గరకు రాలేదు. మన దేశాన్ని కాపాడండి అని వేడుకునేందుకే వచ్చా’’ అని కేజ్రీవాల్ అన్నారు.

తొలిసారి ‘వర్క్ ఫ్రమ్ జైల్’: రాజ్‌నాథ్

చండీగఢ్: వర్క్ ఫ్రమ్ హోం గురించి విన్నానని, వర్క్ ఫ్రమ్ జైల్ గురించి మొదటిసారి వింటున్నానని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎద్దేవా చేశారు. నిరపరాధినని నిరూపించుకునేవరకు.. ఆరోపణలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసే నైతికత ప్రతి నాయకుడికి ఉండాలని, కానీ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు అది లోపించిందని కేంద్రమంత్రి విమర్శించారు. బీజేపీ ఫతేగఢ్ సాహిబ్ అభ్యర్థి గెజ్జా రామ్ వాల్మీకి కోసం ఖన్నాలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో రాజ్‌నాథ్ మాట్లాడారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం మద్యం కుంభకోణంలో చిక్కుకుందని, ఇక పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం గురించి చెప్పాల్సిన పనిలేదన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించిన నేత ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం అదే పార్టీతో కూటమి కట్టారని విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయితే సీఎం క్యాంపు కార్యాలయంలో నివసించనని చెప్పిన కేజ్రీవాల్.. ఆ తరువాత సీఎం నివాసాన్ని ‘శీష్‌మహల్’గా మార్చి కోట్లాది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

మోదీ వ్యాఖ్యలు బిహార్‌కు అవమానం: ఖర్గే

ససరాం(బిహార్): విపక్ష నేతలనుద్దేశించి ముజ్రా అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ‘ముజ్రా బిహార్‌లో మాత్రమే చేస్తారని మోదీ మాటలకు దానర్థం. ఇటువంటి వ్యాఖ్యలతో బిహార్‌ను ఆయన అవమానించారు. ప్రధాని మాట్లాడే విధానం ఇది కాదు. ఆయన ఒక రాజనీతిజ్ఞుడి మాదిరిగా మాట్లాడాలి’అని హితవు పలికారు. ఖర్గే ఆదివారం బిహార్‌లోని సాసారాంలో ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. విపక్ష కూటమి నేతలు ముస్లిం ఓటు బ్యాంకును సంతృప్తిపర్చేందుకు ముజ్రా(వేడుకల్లో అతిథులను అలరించే నృత్యం) చేస్తోందన్న మోదీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. ‘మోదీ తాను తీస్ మార్ ఖాన్ అనుకుంటున్నారు. అది తప్పు. ప్రజలే అసలైన ఘనాపాఠీలు’’అన్నారు.

మోదీ భాంగ్రా, భరతనాట్యం చేస్తున్నారా?

ముజ్రా’ వ్యాఖ్యలకు అసదుద్దీన్ ఒవైసీ కౌంటర్

పాలీగంజ్ (బిహార్): ముస్లింల ఓట్ల కోసం విపక్ష పార్టీలు ముజ్రా నృత్యం చేస్తున్నాయని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. ఆదివారం బిహార్‌లోని పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మోదీ శనివారం ప్రసంగించిన అదే ప్రాంతంలో ఒవైసీ ఆదివారం ప్రసంగించారు. ‘‘ ప్రధాని మాట్లాడాల్సిన భాషేనా అది? మాకు మాటలు రావని మోదీ భావిస్తున్నారా? చైనా 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించినప్పుడు మోదీ డిస్కో డ్యాన్స్ చేస్తున్నారా? సీఏఏ పరిధిలోకి ముస్లింలను అనుమతించకుండాచేసి వారి హక్కులు కాలరాసినప్పుడు మోదీ భాంగ్ర నృత్యం చేస్తున్నారా?. హిందువుల సమ్మేళనమైన ధర్మ్ సంసద్‌లో ముస్లింల గురించి, ప్రత్యేకంగా ముస్లిం తల్లులు, అక్కాచెల్లెళ్ల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మోదీ భరతనాట్యంలో మునిగిపోయారా అని ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘‘ తాను సాధారణమైన వ్యక్తిని కాదని మోదీనే స్వయంగా అన్నారు. ఇక తాను దేవుడిని అని ప్రకటించుకోవడం ఒక్కటే మిగిలిపోయింది. తననే పూజించాలని కూడా అంటారేమో’’ అని ఎద్దేవా చేశారు.

గుట్కా, పాన్ మసాలాలపై నిషేధం పొడిగింపు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో గుట్కా, పాన్ మసాల వంటి మత్తు పదార్థాలకు నిషేధాన్ని మరో ఏడాది కాలం పొడిగిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రంలో గుట్కా, మావా, పాన్ మసాల, హాన్స్ తదితర మత్తు పదార్థాలకు నిషేధం గత కొన్నేళ్లుగా అమల్లో ఉన్న విషయం తెలిసిందే. ఏటా ఈ నిషేధాన్ని పొడిగిస్తూ వస్తున్నారు. ఆ దిశగా మరో ఏడాది



కాలం పాటు వీటి విక్రయాలను నిలిపివేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

న్యూస్‌రీల్

ఈరోడ్‌లో వేడుకగా రెక్లాన్ పోటీలు



పరుగులు తీస్తున్న గుర్రాలు, కుర్రాళ్లు

సేలం: ఈరోడ్ జిల్లా మొదకురిచ్చిలో ఆదివారం ఉదయం రెక్లాన్ పోటీలు వేడుకగా నిర్వహించారు. ఈరోడ్ జిల్లా మొదకురిచ్చి సమీపంలో కార్మికుల దినోత్సవం సందర్భంగా రెక్లాన్ పోటీలు నిర్వహించారు. ఇందులో గుర్రాలు, ఎద్దులు పరుగులు తీసి వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈరోడ్ జిల్లా మొదకురిచ్చి సమీపంలోని లక్కపురంలో రెక్లా అసోసియేషన్, ఈరోడ్ కంట్రీ గో ప్రొటెక్షన్ కమిటీ, ఆదివానం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో ఈరోడ్ జిల్లా నుంచే కాకుండా కరూర్, తిరుపూర్ తదితర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో గుర్రాలు, ఎద్దులు పోటీ పడ్డాయి. ఒంటి ఎద్దు పందెం రెండు విభాగాలుగాను, గుర్రపు పందెం 8 మైళ్లు, 10 మైళ్లు, 6 మైళ్ల దూరం జరిగింది. ఈ పోటీలను అన్నాడీఎంకే మాజీ మంత్రి కేవీ రామలింగం, మాజీ శాసనసభ్యుడు వీపీ శివసుబ్రమణి ప్రారంభించారు. ఇందులో గెలుపొందిన ఒంటి ఎద్దుకు మొదటి బహుమతిగా రూ. 25,000, గుర్రానికి రూ. 30 వేలు నగదు బహుమతితో పాటు షీల్డ్‌లు అందజేశారు. ఈ పోటీలలో ఎద్దులు, గుర్రాల యజమానులతో పాటు వాటితో ఉత్సాహంగా పరుగులు తీసిన యువకులను అభినందించారు.

ఇంట్లో జారి పడ్డ వైగో

- భుజానికి గాయం

సాక్షి, చెన్నై: ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో ఇంట్లో జారి పడ్డారు. ఆయన భుజానికి గాయమైంది. ఈ వివరాలను ఆయన తనయుడు, పార్టీ నేత దురై వైగో ఆదివారం ప్రకటించారు. ఆయన పేర్కొంటూ, విరుదునగర్ నివాసంలో వైగో జారి పడ్డారని, ఆయనకు గాయమైనట్టు పేర్కొన్నారు. ఈ కారణంగా ఆయన ఆదివారం ఉదయాన్నే తూత్తుకుడి నుంచి విమానంలో చెన్నైకు బయలుదేరి వెళ్లారని వివరించారు. వైద్యుల సూచన మేరకు అన్నానగర్ నివాసంలో ఉంటూ చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. పార్టీ వర్గాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎవ్వరూ ఆయన్ని పరామర్శించేందుకు రావద్దని కోరారు.

నేడు బీజేపీ కార్యవర్గం భేటీ

సాక్షి, చెన్నై : బీజేపీ రాష్ట్ర కార్యవర్గం సోమవారం చెన్నైలో భేటీ కానుంది. లోక్‌సభ ఎన్నికల అనంతరం జరగనున్న తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ నేతృత్వంలో మెగా కూటమి ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా బీజేపీ వర్గాలు తీవ్రకుస్తీ పట్టాయి. బీజేపీ అధినాయకులు అందరూ రాష్ట్రంలో ఏదో ఒక నియోజకవర్గంలో పోటీ చేశారు. కూటమిపార్టీల నేతలు సైతం ఎన్నికలలో అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో పడ్డారు. వీరికి మద్దతుగా ప్రధాని నరేంద్ర మోదీతోపాటు కేంద్ర మంత్రులందరూ రాష్ట్రానికి వచ్చి ప్రచారం చేసి వెళ్లారు. ఎన్నికలు ముగిశాయి. మరో వారం రోజులలో ఫలితాలు వెలువడనున్నాయి. ఈ పరిస్థితులలో సోమవారం బీజేపీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆ పార్టీ అధ్యక్షుడు అన్నామలై పిలుపు నిచ్చారు. టీ నగర్‌లోని కమలాలయంలో సమావేశం జరగనుంది. తొలుత జిల్లాల వారీగా నేతలతో, అనంతరం రాష్ట్ర నేతలతో అన్నామలై సమావేశం కానున్నారు.

జూన్‌లో కొత్త టెర్మినల్ ద్వారా సేవలు

సాక్షి, చెన్నై: తిరుచ్చిలో కొత్తగా నిర్మించిన టెర్మినల్ ద్వారా జూన్‌లో విమాన సేవలకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించిన తుది ఏర్పాట్లు ముగిశాయి. ఈ టెర్మినల్‌ను సీఆర్‌పీఎఫ్ భద్రతా పరిధిలోకి తెచ్చారు. రాష్ట్రంలో చెన్నై తదుపరి, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న విషయం తెలిసిందే. తిరుచ్చి విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దే పనులు గతంలో మొదలయ్యాయి. రూ.1,112 కోట్లతో బ్రహ్మాండ టెర్మినల్ రూపుదిద్దుకుంది. తిరుచ్చి శ్రీరంగం ఆలయ గోపురాన్ని తలపించే విధంగా ప్రవేశ మార్గంలో నిర్మాణాలు జరిగాయి. అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్ద బడ్డ ఈ టెర్మినల్‌ను జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. అయితే లోపల కొన్ని పనులు ముగించాల్సి ఉండటంతో ఈ టెర్మినల్‌ను ఉపయోగంలోకి తీసుకు రావడంలో జాప్యం తప్పలేదు. ప్రస్తుతం లోపల అన్ని పనులూ ముగిశాయి. భద్రతా వ్యవహారాలను సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించారు. కొత్త టెర్మినల్‌లో ప్రయాణికులకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో పాటు ఆధునిక హంగులతో తమిళ సంస్కృతి సంప్రదాయాలను చాటే ఏర్పాట్లు చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఈ టెర్మినల్‌ను ఉపయోగింలోకి తెచ్చే విషయంగా చర్చించారు. ఆ విమానాశ్రయం డైరెక్టర్ సుబ్రమణి నేతృత్వంలో జరిగిన సమావేశంలో జూన్ 11 నుంచి ఈ టెర్మినల్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించారు. ముందుగా ఈ టెర్మినల్ వద్దకు విమాన సేవలు తదితర ప్రక్రియలకు సంబంధించిన ట్రయల్ రన్ విజయవంతం చేయడానికి చర్యలు చేపట్టారు.

గెలుపే కరుణకు కానుక

జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపుతో గెలుపును దివంగత డీఎంకే దిగ్గజం కరుణానిధికి కానుకగా సమర్పిద్దామని డీఎంకే శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ పిలుపు నిచ్చారు. కలైంజ్ఞర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా ముగిద్దామని సూచించారు. డీఎంకే కూటమితో నవ భారతం తథ్యం అని ధీమా వ్యక్తం చేశారు.

- జూన్3న ఘనంగా శత జయంతి వేడుకల ముగింపు
- డీఎంకే కూటమితో నవ భారతం తథ్యం
- పార్టీ శ్రేణులకు స్టాలిన్ లేఖ

సాక్షి, చెన్నై: డీఎంకే దివంగత నేత కరుణానిధి శత జయంతి ఉత్సవాలు ఏడాది పొడవునా రాష్ట్రంలో అధికారిక వేడుకగా (ప్రభుత్వ నేతృత్వంలోనూ), పార్టీ నేతృత్వంలోనూ ఘనంగా నిర్వహిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. జూన్ 3వ తేదీ కరుణానిధి జయంతి కావడంతో శత జయంతి ఉత్సవాల ముగింపు వేడుకను రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాల ద్వారా ఘనంగా జరుపుకుందామని పిలుపు నిస్తూ పార్టీ వర్గాలకు ఆదివారం స్టాలిన్ లేఖ రాశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త జీవితాలతో దివంగత నాయకుడు కరుణానిధి ముడిపడి ఉన్నారని, ఆయన తోబుట్టువులైన కేడర్‌కు ముగింపు వేడుకల జయప్రదానికి పిలుపు నిస్తూ ఈ లేఖ రాస్తున్నట్టు స్టాలిన్ పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త హృదయంలో, రక్తం , నర నరాలలో కరుణానిధి జీవించి ఉన్నారని గుర్తు చేశారు. డీఎంకేతో రాజకీయ విప్లవాన్ని సృష్టించి తమిళనాడు రాజకీయ చరిత్రలోనే కాదు, భారతీయ రాజకీయ చరిత్రలోనూ రాజకీయ పండితుడు కలైంజ్ఞర్ కరుణానిధి పేరు గడించారని పేర్కొన్నారు. అవిశ్రాంత నేతగా, ఓటమి ఎరుగని యోధుడిగా తమిళాభ్యున్నతి కోసం శ్రమించిన మహానేతకు ఘన నివాళులర్పిద్దామని పిలుపు నిచ్చారు. పెరియార్, అన్నదురై అడుగు జాడలలో బాల్యం నుంచే శ్రమించి ఐదు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి నవ తమిళనాడుకు పునాదులు వేసి వెళ్లిన మహానేత కరుణానిధి అని కొనియాడారు. జాతీయ స్థాయిలో ప్రధాన మంత్రి ఎవరో అన్నది నిర్ణయించే స్థాయికి తమిళ ఖ్యాతిని చాటే విధంగా తీసుకెళ్లిన ఘనత కరుణానిధికే దక్కుతుందన్నారు.

గెలుపు తథ్యం..

కలైంజ్ఞర్ మార్గదర్శకత్వంలో ప్రతి నాయకుడు, కార్యకర్త ముందుకెళ్తున్నారని గుర్తు చేశారు. ఆయన పడ్డ శ్రమకు మరో గుర్తింపుగా రాష్ట్రంలో విజయవంతంగా తన నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. 2023 జూన్ 3న కరుణానిధి శత జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టామని పేర్కొంటూ, గత ఏడాది సాధించిన విజయాలను గుర్తు చేశారు. ప్రజా హితమే లక్ష్యంగా ప్రాజెక్టులను అమలు చేయడమే కాకుండా , కరుణ శత జయంతి ఉత్సవాలను ఏడాది పొడువున విజయవంతంగా నిర్వహించామని వివరించారు. ఆయన శత జయంతి స్మారకంగా ప్రజల కోసం గిండి, మదురైలో భారీ ఆస్పత్రి, గ్రంథాలయాన్ని ప్రజలకు అంకితం చేశామని, కిలాంబాక్కంలో సబర్బన్ బస్ టెర్మినస్ ద్వారా ప్రయాణికులకు విస్తృతం సేవలు అందిస్తున్నామని తెలిపారు. మెరీనా తీరంలో శాశ్వత నిద్రలో ఉన్న దివంగత నేతకు బ్రహ్మాండ స్మారకం రూపొందించామని, ఆయన జన్మించిన ప్రదేశం తిరువారూర్ తిరుక్కువళైలలోనూ స్మారకం పూర్తి చేశామని గుర్తు చేశారు. కరుణ చూపిన మార్గంలో చెప్పిందే కాదు.. చెప్పని వాగ్దానాలను కూడా అమలు చేస్తూ వస్తున్న ఘనత డీఎంకేకు మాత్రమే దక్కుతుందని అన్నారు. ‘ద్రవిడ మాడల్’ ప్రభుత్వ గత ఏడాది సాధించిన విజయాలను రోజూ ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు ఈ సందర్భంగా తాను కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.



కరుణతో స్టాలిన్ (ఫైల్)

సామాజిక న్యాయం

తమిళనాడులో ప్రజల మధ్య చిచ్చు పెట్టి మత విద్వేషాలతో రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నంచేసిన వారికి గుణపాఠం చెప్పే విధంగా సామాజిక న్యాయం నినాదంతో ప్రజలు అందరినీ కలుపుకుని ముందుకెళ్లామని వివరించారు. పార్టీ పరంగా ప్రతి కేడర్ పడ్డ శ్రమకు గుర్తింపుగా నియోజకవర్గానికి 50 వేల మంది కొత్త సభ్యులు ఇటీవల కాలంగా చేరినట్టు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల వేళ ప్రతి నాయకుడు, కార్యకర్త పడ్డ శ్రమకు ఫలితం మరి కొద్దిరోజుల్లో దక్కబోతోందన్నారు. జూన్3న కలైంజ్ఞర్ పుట్టిన రోజు అని, ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్న ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రజా ప్రయోజనాలను కాంక్షించే విధంగా సేవా కార్యక్రమాలతో శత జయంతి ఉత్సవాలకు ముగింపు పలకాలని పిలుపు నిచ్చారు. వాడవాడలా కరుణానిధి చిత్రపటాలను కొలువు దీర్చాలని, ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఆ మరుసటి రోజైన జూన్ 4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. ఈ రోజున సాధించే విజయాన్ని కరుణకు కానుకగా సమర్పిద్దామన్నారు. ఈ విజయంతో డీఎంకే నేతృత్వంలో నవ భారతం నిర్మాణమే లక్ష్యంగా దేశంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఇదే రోజున మతతత్వ శక్తులను తరిమి కొట్టడం కూడా ఖాయం అని పేర్కొంటూ ముగించారు.

ఇక మళ్లీ భానుడి సెగ



తిరుప్పరపు జలపాతంలో నీటి ఉధృతి

సాక్షి, చెన్నై: రెమల్ తుపాన్ గాలిలోని తేమనంతా తీసుకెళ్లిపోవడంతో రాష్ట్రంలోని అనేక జిల్లాలలో మళ్లీ ఉష్ణోగ్రతలు మళ్లీ పెరగనున్నాయి. సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికంగా కొద్ది రోజుల పాటు భానుడి సెగను మళ్లీ ప్రజలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది అగ్నినక్షత్రం వేళ భానుడి ప్రతాపం రాష్ట్రంలో కనిపించ లేదు. మార్చి, ఏప్రిల్ నెలలో భానుడు భగ..భగ మండినా, ఆ తదుపరి అకాల వర్షం కారణంగా రాష్ట్రంలో అనేక జిల్లాలో వాతావరణం చల్ల బడింది. ప్రధానంగా పశ్చిమ పర్వత్ర శ్రేణుల వెండి ఉన్న జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. జూన్ 1వ తేదీ కేరళ తీరాన్ని నైరుతి పవనాలు తాకనున్న నేపథ్యంలో ఈ జిల్లాలలో మరింతగా వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. శని వారం రాత్రంతా కన్యాకుమారిలో వర్షం పడింది. ఇక్కడి తిరుప్పరపు జలపాతంలో వరదలు పోటెత్తాయి. మణిముత్తారు, గోదై నదులలో నీటి ఉధృతి పెరిగింది. వర్షాల పుణ్యమా కుమరి సముద్ర తీరం పర్యాటకంగా వెలవెల బోయినట్టుగా ఆదివారం పరిస్థితులు నెలకొన్నాయి. తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతంలో నీటి ఉధృతి తగ్గడంతో సందర్శకులకు అనుమతి ఇచ్చారు. దీంతో జలపాతంలో స్నానం చేయడానికి జనం ఎగబడ్డారు. ఇక సముద్ర తీరంలో అలల తాకిడి క్రమంగా తగ్గింది. రామనాథపురం జిల్లాలో పలుచోట్ల, నాగపట్నం జిల్లా వేదారణ్యం పరిసరాలలో కొన్ని చోట్ల సముద్రం వంద నుంచి రెండు వందల అడుగుల వరకు వెనక్కి వెళ్లడం గమనార్హం. రెమల్ తుపాన్ గాలిలోని తేమను అంతా లాక్కెళ్లడంతో మరో నాలుగైదు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికంగా ఉంటాయని పేర్కొనడంతో మళ్లీ భానుడి సెగను ప్రజలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. అగ్ని నక్షత్రం సీజన్ 28వ తేదీతో ముగియనున్నడంతో జూన్ 1వ తేదీ నైరుతి రుతు పవనాల ప్రవేశంతో వాతావరణం క్రమంగా మళ్లీ చల్లబడే అవకాశాలు ఉన్నాయి.

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

కొరుక్కుపేట: తమిళనాడులో వేసవి సెలవుల అనంతరం జూన్ 6వ తేదీన పాఠశాలలు తెరవనున్నారు. కొత్త విద్యా సంవత్సరం (2024-25)కు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని తమిళనాడు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కారణంగా గత మార్చి 1 నుంచి ఈ ఏడాది అడ్మిషన్లు సాధారణం కంటే ముందుగానే ప్రారంభమయ్యాయి. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. దాని ఫలితంగా తమిళనాడు వ్యాప్తంగా చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 3.35 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు సమాచారం. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ.. కొత్త విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు 3.35 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువు పూర్తి చేసుకున్న చిన్నారుల వివరాలను సేకరించారు. ఈ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి ప్రధాన ఉపాధ్యాయుల ద్వారా నేరుగా ఆ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నామని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా 4 లక్షల మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అడ్మిషన్‌లు పాఠశాలలు తెరిచిన తర్వాత కూడా చేపడుతున్నట్టు వెల్లడించారు.

విదేశీ ఉద్యోగాలతో జర భద్రం

- యువతకు ప్రభుత్వం సూచన
- వెళ్లే ముందు అధికారులను సంప్రదించాలని సూచన



సాక్షి,చెన్నై: విదేశీ ఉద్యోగాలతో జర భద్రం అంటూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం హెచ్చరికలు చేసింది. కొన్ని దేశాలకు ఉద్యోగ నిమిత్తం వచ్చే ఆఫర్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాతే వెళ్లాలని ఆదేశించారు. విదేశాలలో ఉద్యోగం పేరిట బ్రోకర్ల ద్వారా, ఏజెంట్ల ద్వారా తమిళ యువతను మోసగించే ప్రయత్నాలు పెద్దఎత్తున సాగుతున్నాయన్నారు. విదేశాలలో అష్టకష్టాలు పడుతున్న తమిళ యువకులను రక్షించేందుకు పాలకులు తీవ్ర ప్రయత్నాలు చేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రవాస తమిళ సంక్షేమ శాఖ కమిషనర్ బీ కృష్ణమూర్తి ఆదివారం ప్రత్యేక ఆదేశాలు, హెచ్చరికలు జారీ చేశారు. వివిధ ఉద్యోగ అవకాశాలు అంటూ తమిళ యువతకు గాలం వేస్తున్న వారూ పెరిగారని వివరించారు. ప్రస్తుతం ఐటీ ఉద్యోగాల పేరిట కంబోడియా, థాయిలాండ్, మయన్మార్ (బర్మా) వంటి దేశాలకు టూరిస్టు వీసా ద్వారా యువతను తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలియ వచ్చిందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ జరుగుతోందని, కొన్ని వెబ్‌సైట్‌ల ద్వారా జరుగుతున్న ఈ ప్రక్రియను తిప్పి కొట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే యువత వీరి ఆకర్షణీయ ప్రకటనలు, ఆఫర్లకు తలొగ్గిన పక్షంలో ఆయా దేశాలలో అష్టకష్టాలు పడక తప్పదని హెచ్చరించారు. గత ఏడాది ఈ దేశాలకు వెళ్లిన 83 మంది యువతను రక్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేయాల్సి వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం పలు దేశాలలో ఉద్యోగాల పేరిట అధిక జీతం, వసతులు అంటూ నమ్మబలికి యువతను తీసుకెళ్లి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా వేదిస్తున్నారని, లేని పక్షంలో పని ఒత్తిడితో హింసిస్తున్నారని ఆరోపించారు. యువత మోసగాళ్లల వలలో చిక్కుకోకూడదనే ఉద్దేశంతోనే ఈ హెచ్చరికలు చేస్తున్నామని పేర్కొన్నారు. విదేశాల నుంచి ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన ఆఫర్లు వచ్చిన పక్షంలో తక్షణం ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని, కాన్సులేట్ అధికారులను సంప్రదించినానంతరమే ఆ ఉద్యోగాలలో చేరేందుకు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. విదేశాలకు వెళ్లే యువత 18003093793 (భారతదేశం) 8069009901 (విదేశాలలో కమ్యూనికేషన్ కోసం), 8069009900 (మిస్డ్ కాల్ నెంబరు) ద్వారా లేదా, చెన్నైలోని ఇమిగ్రేషన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హెల్ప్‌లైన్ నంబర్- 90421 49222ను సంప్రదించాలని సూచించారు.

సహఫంక్తి భోజనాలకు విజయ్ పిలుపు

- 28న అన్ని నియోజకవర్గాలలో ఏర్పాట్లు

సాక్షి, చెన్నై : ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా సహపంక్తి భోజన కార్యక్రమాల ఏర్పాటుకు తమిళగ వెట్రి కళగం నేత, సినీ నటుడు విజయ్ పిలుపు నిచ్చారు. రాజకీయ పార్టీని ప్రకటించిన విజయ్ ప్రజా సేవలో నిమగ్నమయ్యే విధంగాప్రస్తుతం కార్యక్రమాలను విస్తృతం చేస్తున్న విషయం తెలిసిందే. ఓ వైపు పార్టీ కార్యవర్గం, జిల్లాల పరంగా కార్యక్రమాలు చేస్తూనే మరో వైపుప్రజా హితాన్ని కాంక్షించే విధంగా న్యాయ సేవా సలహా కేంద్రాలు, న్యాయవాదుల ద్వారా ఉచిత సేవలకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో ఈనెల 28న ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ వర్గాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సంహపంక్తి భోజన కార్యక్రమాలకు పిలుపు నిచ్చారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆదేశించారు. పేదలను ఈ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలని, కడుపు నిండా వారికి ఆహారం పెట్టాలని పిలుపు నిచ్చారు.

కొండ గ్రామంలో పళణిస్వామి జన్మదినం



కేక్ కట్ చేస్తున్న ఎడప్పాడి పళణి స్వామి

సేలం : అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళణి స్వామి ఆదివారం సేలం జిల్లా కారుమందురై కొండపై కరియకోవిల్ గ్రామంలోని కరియారామ్ ఆలయంలో గిరిజనులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అంతకుముందు కరుమందురైని సందర్శించిన ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళణిస్వామికి సబర్బన్ జిల్లా సంఘం కార్యదర్శి ఇళంగోవన్ ఆధ్వర్యంలో సంఘం నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కరియారం ఆలయంలో కొండవాలు క్యూలో నిలబడి పూలవర్షం కురిపించారు. అనంతరం కరియారం ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎడప్పాడి తర్వాత సేలం సబర్బన్ జిల్లా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి గిరిజనులకు అందించారు. 2,000 మంది కొండ ప్రాంతవాసులకు అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలో కళ్లకురిచ్చి జిల్లా కార్పొరేషన్ కార్యదర్శి, కళ్లకురిచ్చి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కుమారగురు, అసెంబ్లీ సభ్యులు జయసంగరన్, నల్లతంబి, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

తంజావూరులో గురు పూజా మహోత్సవం



మురుగన్, వినాయక స్వామివార్ల ఊరేగింపు

- వీధుల్లో విహరించిన 15 ఆలయాల మురుగన్, వినాయక ఉత్సవమూర్తులు
- వేలలాదిగా తరలివచ్చిన భక్తులు

కొరుక్కుపేట: తిరుజ్ఞాన సంబంధర్ గురుపూజ సందర్భంగా తంజావూరులోని వీధిలో మురుగన్, వినాయక స్వామివార్లు విహరించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శనం చేసుకుని తరించారు. వేదాలను వ్యాప్తి చేయడానికి, తమిళ సాంప్రదాయ, తమిళ సంగీత అభివృద్ధికి, శైవమతం విజయాన్ని ప్రోత్సహించడానికి తిరుజ్ఞాన సంబంధర్ విశేషంగా కృషి చేశారు. తమిళ సంగీత పాటలకు గొప్ప ప్రాచుర్యాన్ని సంపాదించి పెట్టారు శైవమతాన్ని స్థాపించిన నలుగురిలో ఒకరైన తిరుజ్ఞానసంబందర్ మూర్తి స్వామికి ప్రతి సంవత్సరం వైకాసి మాసంలో తంజావూరులో గురుపూజ నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా తంజావూరు రాటేరులోని పళని స్వామి ఆలయంలో వినాయకుడు, తంజావూరు జిల్లా జ్యోతి వినాయగర్ ఆలయంలో వినాయగర్, మురుగన్, కురిచ్చి వీధిలో మురుగన్, మేళాళంగం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మురుగన్ సహా 15 ఆలయాల నుండి వినాయకులు, మురుగన్ స్వాములను ఆయా వీధుల్లో ఊరేగించారు. ఈ పల్లకీలన్నీ ఆయా ఆలయాల నుంచి ప్రారంభమై తంజావూరు కీళవీధి, మేళావీధి, దక్షిణ వీధి, ఉత్తరవీధి మీదుగా సాగాయి. ఇందులో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.



వరదరాజ పెరుమాళ్ రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

ఘనంగా వరదరాజ పెరుమాళ్ రథోత్సవం

కాంచీపురం(పళ్లిపట్టు): కాంచీపురంలో ప్రసిద్ధి చెందిన వరదరాజ పెరుమాళ్ రథోత్సవం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. వివరాలు..ఆధ్యాత్మిక పట్టణం కాంచీపురంలో పురాతన చరిత్ర కలిగిన వరదరాజ పెరుమాళ్ ఆలయంలో వైఖాసి మాసం బ్రహ్మోత్సవాలు ఈనెల 20న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 22న గరుడసేవ నిర్వహించారు. ఆదివారం రథోత్సవం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వరదరాజ పెరుమాళ్ ప్రత్యేక అలంకరణలో ఆలయం నుంచి రథంలో కొలువుదీరారు. స్వామివారి రథోత్సవాన్ని తిలకించి స్వామి దర్శనం కోసం కాంచీపురం వీధుల్లో వేలాదిగా భక్తులు గుమిగూడారు. కర్పూర హారతులిచ్చి గోవింద నామస్మరణతో స్వామిని దర్శించుకున్నారు. రథోత్సవంలో మంత్రి దామో అన్బరసు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సత్యపై ఏసీబీ కేసు



సత్య

సాక్షి, చెన్నై: టీ నగర్ మాజీ ఎమ్మెల్యే సత్య తన నియోజకవర్గ నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు పేర్కొంటూ ఏసీబీ ఆదివారం కేసు నమోదు చేసింది. ఆయనతో పాటు ఏడుగురిపై ఈకేసు నమోదైంది. వివరాలు.. అన్నాడీఎంకేకు చెందిన సత్యనారాయణ అలియాస్ సత్య టీ నగర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గ నిధుల్ని దుర్వినియోగం చేసినట్టుగా గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై ఏసీబీకి సైతం ఫిర్యాదులు చేరాయి. అయితే వారి నుంచి స్పందన లేని దృష్ట్యా, హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు అయ్యింది. 2016-19 కాలంలో ఈ దుర్వినియోగం సాగినట్టు, ఆధారాలతో సహా ఏసీబీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పిటిషనర్ కోర్టుకు వివరించారు. ఈ వ్యవహారంపై దృష్టి పెట్టిన కోర్టు ఏసీబీకి గతంలో ఆదేశాలు జారీ చేసింది. దీంతో సమగ్ర విచారణ, ఆధారాల సేకరణతో సత్యపై ఏసీబీ ఆదివారం కేసు నమోదు చేసింది. రూ. 35 లక్షలను దుర్వినియోగం చేసినట్టు వచ్చిన ఆరోపణతో ఆయనతోపాటు ఏడుగురిపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో వీరిని విచారించేందుకు సమన్లు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

క్లుప్తంగా

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై ఈస్ట్ తాంబరంలో ఇద్దరు మహిళల వద్ద చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన కళాశాల విద్యార్థి సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై ఈస్ట్ తాంబరం ప్రాంతంలో రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న శాంతి (46) అనే మహిళ వద్ద మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు 2 సవర్ల చైన్ లాక్కొని పారిపోయారు. అలాగే పల్లావరంలో నడిచి వెళుతున్న అంశవల్లి (48) వద్ద 3 సవర్ల చైన్‌ను చోరీ చేశారు. ఈ సంఘటనలకు సంబంధించి సేలయూరు, పల్లావరం పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. చైన్ స్నాచింగ్ చేసిన యువకుడు పురసైవాక్కంకు చెందిన 18 సంవత్సరాల కళాశాల విద్యార్థి అని తెలిసింది. అతని పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత అతని సహచరుడు అయిన చాకలిపేటకు చెందిన మహమ్మద్ అలీ (22)ను కూడా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నీటి తొట్టిలో పడి ఆటో డ్రైవర్ మృతి

తిరువొత్తియూరు: చెన్నై ఆవిడి సమీపంలో మురుగునీటి తొట్టిలో పడి ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. ఆవిడి సారిపేట పాత క్వారీ వీధికి చెందిన మారియప్పన్ (67) ఆటో డ్రైవర్. ఇతని ఇంటి ముందు 12 అడుగుల లోతు కలిగిన మురుగునీటి తొట్టి ఉంది. మారియప్పన్ శనివారం మధ్యాహ్నం సిమెంటు ప్లేట్‌తో మూతపెట్టి ఉన్న మురుగునీటి తోటిపై నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో హఠాత్తుగా సిమెంట్ మూత పగలడంతో మారియప్పన్ అదుపుతప్పి మురుగునీటి గుంటలో పడిపోయాడు. ఇది చూసిన అతని కుమార్తె కమలి కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్న మారియప్పన్‌ను వెలుపలికి తీయడానికి ప్రయత్నించారు. కానీ వీలు కాలేదు. సమాచారం అందుకున్న ఆవడి అగ్నిమాపక సిబ్బంది తొట్టిలో పడిన మారియప్పన్‌ను మృతదేహంగా బయటకు తీశారు. ఆవడి పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆశ్రమంలో వృద్ధురాలి మృతి

సేలం: ఈరోడ్‌లో ప్రైవేట ఆశ్రమంలో ఉన్న వృద్ధురాలు మృతి చెందింది. ఈరోడ్‌లోని సంపత్ నగర్‌కు చెందిన మంజుల (71)కు భర్త, పిల్లలు లేరు. దీంతో తన సొంత ఇంటిని అమ్మేసి వచ్చిన మొత్తాన్ని ఈరోడ్‌లోని పెరియార్ రోడ్డులో నిర్వహిస్తున్న ఆశ్రమానికి ఇచ్చి అక్కడే ఉండిపోయారు. ఈ స్థితిలో మంజుల శనివారం మంచం దిగలేదు. ఆశ్రమ నిర్వాహకులు నిద్ర లేపి చూసే సరికి కదలకుండా పడి ఉన్నారు. వెంటనే ఆమెను ఈరోడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మంజుల అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు ఈరోడ్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా హరి ఉత్సవాలు ప్రారంభం


గ్రామ వీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాలస్వామి


మురుగన్, అమ్మవారు, శివుడు వేషధారణలతో ఆకట్టుకున్న కళాకారులు

తిరుత్తణి: తిరుత్తణి శివారులోని అగూరులో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో 84వ వార్షికోత్సవం సందర్భంగా హరి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల సందర్భంగా గ్రామ వీధులను విద్యుదీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం రాత్రి పుష్పాలంకరణలో వాహనంపై కొలువైన వేణుగోపాలస్వామిని కర్పూర హారతులతో పాటు బాణసంచా వేడుకలు, కేరళ సండి మేళంతో వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా గ్రామీణులు కర్పూరహారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఊరేగింపు సందర్భంగా కళాకారులు మురుగన్, అమ్మవారు, శివుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. ఇక ఆదివారం ఉదయం స్వామివారికి తిరుమంజన సేవ చేపట్టారు. మంగళవారం గంగమ్మ జాతర వేడుకలు చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మోడీకి వ్యతిరేకంగా
10 ఏళ్లుగా పోరాడుతున్నా..


ఎంపీ తిరుమావళవన్ చేతుల మీదుగా అంబేడ్కర్ సుడర్ అవార్డును అందుకున్న ప్రకాష్‌రాజ్

తమిళసినిమా: ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా తాను 10 ఏళ్లుగా పోరాడుతున్నానని నటుడు ప్రకాష్ రాజ్ పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యుడు తిరుమావళవన్ నేతృత్వంలో విడుదలై చిరుతైగళ్ పార్టీ తరపున గత పదేళ్లుగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని వివిధ అవార్డులతో సత్కరిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో 2024 ఏడాదిగాను ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమం శనివారం సాయంత్రం స్థానిక తేనాంపేటలోని కామరాజర్ అవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ వేదికపై సినీ రంగంలో నటుడిగా విశేష సేవలు అందించినందుకు గాను నటుడు ప్రకాష్ రాజ్ కు అంబేడ్కర్ సుడర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ శరీరానికి గాయం అయితే మనం ఏమీ చేయకపోయినా అది కొద్ది రోజులకు తగ్గిపోతుందన్నారు. అయితే దేశానికే గాయం అయితే మనం మాట్లాడకుండా ఉంటే అది ఇంకా పెరిగిపోతుందన్నారు. ఈ వేదికపై తాను నిలబడటానికి కారణం ప్రజలేనన్నారు. అలాంటి ప్రజలకు సమస్య వస్తే ఒక కళాకారుడు పిరికివాడైతే సమాజమే పిరికిదైపోతుందన్నారు. అందుకే తాను ప్రజల గొంతుగా ఉంటానన్నారు. గత పదేళ్లుగా ఈ దేశ రాజును (నరేంద్రమోడీ ని ఉద్దేశించి) ఎదిరించి తాను పోరాడుతున్నానని పేర్కొన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించకుంటే ఈ దేశం ఎలా ఉంటుందో అని ఊహించడానికే భయమేస్తోందన్నారు. ఆయన ఆలోచనలు ఆకలి, పేదరికంతో పుట్టినవి కావని అవమానాలతో పుట్టాయని పేర్కొన్నారు. అయితే నరేంద్ర మోడీ ఒక ఫాసిస్ట్ అని, ఆయన రథంపైనే నిలబతారని, విమానాల్లోనే వస్తారని, ప్రజలు పూలవర్షం కురిపిస్తారని అయితే ఆయన మాత్రం ప్రజా తరఫున నిలబడరని, ప్రజల స్పర్శ తెలియని వారని, ప్రజల ఆకలి కూడా తెలియదంటూ తీవ్ర విమర్శలు చేశారు.

దుబాయ్ వెళ్లేవారిపై కొత్త ఆంక్షలు

కొరుక్కుపేట: తమిళనాడు నుండి చాలా మంది పర్యాటకులు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్, అబుదాబి తదితర నగరాలకు వెళ్తుంటారు. చెన్నై, మధురై, తిరుచ్చి నుండి దుబాయ్‌కి నేరుగా విమానాలు ఉన్నాయి. దీని వల్ల తమిళనాడు నుంచి చాలా మంది పర్యాటకులు దుబాయ్ సందర్శిస్తున్నారు. అదేవిధంగా ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు దుబాయ్‌కి వెళుతుంటారు. ఈ పరిస్థితిలో దుబాయ్, అబుదాబి సహా ఇతర నగరాలకు వెళ్లే కొందరు పర్యాటకులు టూరిస్ట్ వీసాలను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో దుబాయ్, అబుదాబి విమానాశ్రయాలలో పౌరసత్వ తనిఖీని కఠినతరం చేశారు. ముఖ్యంగా తమిళనాడు, కేరళ నుండి పర్యాటకులు తీవ్ర పరిశీలనకు గురవుతున్నారు. ముఖ్యంగా మొదటిసారి ప్రయాణించే వారికి పౌరసత్వం అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. కనీసం రూ.60,000 బ్యాంకు ఖాతా, క్రెడిట్ కార్డ్, రిటర్న్ టిక్కెట్‌తో ఉన్న పర్యాటకులను మాత్రమే దుబాయ్‌లోకి అనుమతిస్తున్నారు. ఈ నిబంధనలు పాటించని ప్రయాణికులను దుబాయ్‌లోకి అనుమతించరు. ముఖ్యంగా 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు, ఒంటరిగా ప్రయాణించే వారిని కూడా విమానయాన సంస్థలు తనిఖీ చేయడం ప్రారంభించాయి. దుబాయ్ ప్రయాణికులను వారి విమానాలు ఎక్కే ముందు రెండుసార్లు తనిఖీ చేస్తుంది. వారిని తిప్పి పంపకుండా చేస్తుంది. స్వదేశానికి వచ్చిన ప్రయాణికులను తిరిగి పంపడానికి ఎయిర్‌లైన్స్ బాధ్యత కాబట్టి క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే వారిని దుబాయ్‌కి అనుమతిస్తారు.

డివైడర్‌పై బైక్ నడుపుతూ యువకుడి వీరంగం

తిరువొత్తియూరు: కొల్లిడం వంతెన డివైడర్‌పై బైక్ నడిపి ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. తిరుచ్చి, ఒత్తకడై ప్రాంతంలో ఒక కార్యక్రమం పాల్గొనేందుకు వచ్చిన కొందరు యువకులు బైక్ పై వీల్ చేయడం, బస్సు ముందు దండాలు తీయడం, రోడ్డును అడ్డం పెట్టుకుని డ్యాన్స్ చేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో తిరుచ్చి కొల్లిడం బ్రిడ్జిపై మధ్యలో ఉన్న సెంటర్ మీడియన్‌పై ఓ యువకుడు ద్విచక్ర వాహనాన్ని నడిపాడు. ఇతను సుమారు 1.5 కి.మీ దూరం వరకు ద్విచక్రవాహనాన్ని నడపడం చూసిన ప్రజలు పలువురు తమ సెల్‌ఫోన్లలో వీడియో తీశారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రోడ్డు నిబంధనలను ఉల్లంఘించిన ఆ యువకుడిపై కొల్లిడం పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తున్నారు.

తండ్రి మందలించాడని..

- ప్లస్–1 విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: వడపళనిలో ఆదివారం సెల్‌ఫోన్‌లో అతిగా మాట్లాడొద్దని తండ్రి సూచించడంతో ప్లస్–1 విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు..చెన్నై వడపళనిలోని భక్తవత్సలం 1వ వీధికి చెందిన శివ కారు డ్రైవర్. ఇతని కుమార్తె మధుమిత (15) ప్లస్–1 విద్యార్థి. మధుమిత సెల్‌ఫోన్‌ను అధికంగా ఉపయోగించటంతో తల్లిదండ్రులు ఖండిస్తు వచ్చారు. ఆదివారం రాత్రి మధుమిత చాలా సేపు ఫోన్ మాట్లడటం చూసిన శివ కూతురు మధుమితను మందలించాడు. దీంతో మధుమిత బెడ్ రూమ్ లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వడపళని పోలీసులు మధుమిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ అస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ టవర్ ఎక్కిన రైతు

- ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులు

తిరువొత్తియూరు: తంజావూరు జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ ఎక్కి రైతు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన సంఘటన ఆ ప్రాంతంలో సంచలనం కలిగించింది. తంజావూరు జిల్లా తెన్‌కుడికి చెందిన లక్ష్మణన్ వ్యవసాయ కూలీ. ఇతని భార్య తమిళ్ రాణి. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం ఉదయం 6 గంటల సమయంలో లక్ష్మణన్ అయ్యాపేట చావడి బజార్ ప్రాంతంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సెల్‌ఫోన్ టవర్ పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులు ఇచ్చాడు. ఇది చూసి ఆ మార్గంగా వెళ్తున్న వారిని చూసి దీని గురించి ఐయ్యంపేట పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు, లక్ష్మణన్‌తో సమాధానంగా మాట్లాడే కిందకు దిగిరమ్మని కోరారు. కానీ అతను కిందకు దిగి రాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో లక్ష్మణన్‌ను మాట్లాడుతూ అయ్యంపేట చక్రపల్లి ప్రాంతానికి చెందిన ఒకరికి మూడున్నర ఎకరం పెన్నెంకుడిలో భూమి ఉందని, తాను చాలా కాలంగా లీజుకు తీసుకొని ఆ భూమిని సాగు చేస్తున్నానని, యజమాని తనతో తన వద్ద స్థలాన్ని విక్రయిస్తున్నట్లు చెప్పి 13 లక్షలు తీసుకున్నాడు. తర్వాత అదే స్థలాన్ని మరొకరికి నగదు తీసుకొని విక్రయించారు. దీంతో తన వద్ద రూ.13 లక్షలు తీసుకున్న యజమాని ఇక్కడికి వచ్చి తనకు న్యాయం చేయాలని, అప్పుడే తాను సెల్‌ఫోన్ టవర్ నుంచి దిగుతానని అతను చెప్పాడు. దీంతో చాలా సమయం వరకు మాటలు మాట్లాడి ఉదయం 9.30 గంటల సమయం తర్వాత లక్ష్మణన్ సెల్‌ఫోన్ టవర్ నుంచి కిందకు దిగి వచ్చాడు. ఆ సమయంలో స్పృహ తప్పిన అతన్ని పోలీసులు చికిత్స కోసం అయ్యంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మునుపెన్నడూ లేని విధంగా సాధారణ బదిలీలు

- 82,477 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు

తిరువొత్తియూరు: రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా సాధారణ బదిలీల కోసం కౌన్సెలింగ్‌కు 82,477 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని రకాల ఉపాధ్యాయులు సాధారణ బదిలీల కోసం కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాశాఖ ప్రకటించింది. దీని ప్రకారం 13వ తేదీ నుంచి విద్యాశాఖ ఆధ్వర్యంలోని ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఎమిస్) వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయులు పోటీపడి దరఖాస్తు చేస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తుల నమోదుకు గడువు పొడిగించగా, శనివారంతో ముగిసింది. ఆ విధంగా పాఠశాల విద్యాశాఖలో ప్రాథమిక, మాధ్యమిక ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మాధ్యమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బదిలీల కోసం 35 వేల 667 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత విద్యా విభాగంలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, పీజీ టీచర్లు, హైస్కూల్ ప్రదానోపాధ్యాయులు బదిలీల కోసం 46 వేల 810 మంది టీచర్లతో కలిపి మొత్తం 82 వేల 477 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది పబ్లిక్ ట్రాన్స్‌ఫర్ కౌన్సెలింగ్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కండక్టర్ మృతి

సేలం: ఈరోడ్ జిల్లా పులియంపట్టి సమీపంలో ఇంటి స్లాబ్‌పై నుంచి పడి ప్రభుత్వ బస్ కండక్టర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు..ఈరోడ్ జిల్లా పులియంపట్టి సమీపంలోని చానర్‌పాడి గ్రామ నివాసి ధనపాల్ (43). ప్రభుత్వ బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇతని భార్య భువనేశ్వరి (31). వారికి పిల్లలు లేరు. ఈ స్థితిలో ఈనెల 23వ తేదీ రాత్రి ఇంటి ముందున్న సిమెంట్ స్లాబ్‌పై వర్షపు నీరు లీకేజీ కావడంతో దానిని శుభ్రం చేసేందుకు పైకి ఎక్కాడు. అప్పుడు అకస్మాత్తుగా ఆ స్లాబ్ కుప్పకూలింది. దీంతో ధనపాల్ తలకిందులుగా పడిపోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కోయంబత్తూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న ధనపాల్ మృతి చెందాడు. ఈ మేరకు పులియంపట్టి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్

మరోసారి ఖాకీ పాత్రలో కార్తీ


వా వాద్దియార్ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్

తమిళ సినిమా: నటుడు కార్తీ మరోసారి ఖాకీ పాత్రలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. ధీరన్ అధికారం ఒండ్రు, సర్దార్ చిత్రాలలో పోలీస్ అధికారిగా నటించారు. ఆ రెండు చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. కాగా తాజాగా కార్తీక్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం వా వాద్ధియార్. మనం కుమార స్వామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కార్తీక్ పోలీస్ అధికారిగా నటించడం విశేషం. సత్యరాజ్, రాజ్ కిరణ్, కృతి శెట్టి, జీఎం సుందర్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతాన్ని, జార్జ్ సీ.విలియమ్స్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. కాగా ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటూ చివరి దశకు చేరుకుంది. కాగా కార్తీ పుట్టినరోజును పురస్కరించుకుని వా వాద్ధియార్ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ను శనివారం విడుదల చేశారు. సాధారణ పోలీస్ దుస్తులకు భిన్నంగా కార్తీ ధరించిన ఖాకీ దుస్తులు, కూలింగ్ కళ్లజోడు, ఆయన వెనక నిలబడ్డ ఎంజీఆర్ పాత్రలతో కూడిన ఫస్ట్ పోస్టర్ ఇప్పుడు ట్రెండీగా మారింది. అంతే కాకుండా వా వాద్ధియార్ చిత్రంపై అంచనాలను పెంచేస్తోంది. అదే విధంగా కార్తీ ఇంతకుముందు ఖాకీ పాత్రలో నటించిన రెండు చిత్రాలు సూపర్ హిట్ కావడంతో ఈ చిత్రం కూడా మంచి విజయం సాధిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ క్రేజీ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెలువడే అవకాశం ఉంది.


జాన్వీ కపూర్

వారిద్దరి వివాదం చూడాలనుంది


తమిళ సినిమా: నటి జాన్వీ కపూర్ గురించిన వార్తలు ఇటీవల ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి. ఇందుకు కారణం ఆమె ఇటీవల దక్షిణాది చిత్రాలపై మక్కువ చూపడమే కావచ్చు. బాలీవుడ్‌లో దివంగత అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా పరిచయమైన జాన్వీ కపూర్ మంచి గుర్తింపునే తెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటిస్తున్నారు. త్వరలో రామ్‌చరణ్ తో జత కట్టడానికి సిద్ధమవుతున్నారు. కాకపోతే ఈమె కోలీవుడ్ ఎంట్రీ ఎప్పుడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా జాన్వీ కపూర్ నటించిన హిందీ చిత్రం మిస్టర్ అండ్ మిసెస్ మహి నిర్మాణ కార్యక్రమం పూర్తిచేసుకుని ఈ నెల 31 తేదీన తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఇటీవల జాన్వీ కపూర్ ఓ భేటీలో తనకు చరిత్రపై అధిక ఆసక్తి ఉందని పేర్కొన్నారు. దీంతో చరిత్రలో ఏ కాల ఘట్టానికి వెళ్లాలని కోరుకుంటున్నారు అన్న ప్రశ్నకు బదులిస్తూ మహాత్మా గాంధీ, రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్‌ల దృష్టిలో జాతిపై అభిప్రాయాన్ని వివాదాన్ని వినాలని కోరుకుంటున్నానన్నారు. అంబేడ్కర్‌కు మహాత్మా గాంధీకి మధ్య జరిగే అలాంటి వివాదాన్ని చూడడం చాలా ఆసక్తికరంగా ఉంటుందన్నారు. వారి సిద్ధాంతాల మధ్య ఇలాంటి చర్చతో పలు విషయాలను ప్రేక్షకులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. జాతి గురించి అంబేడ్కర్ ఆరంభ కాలం నుంచి చాలా తెలివిగాను అదే సమయంలో తీవ్రంగానూ ఉన్నారని భావిస్తానన్నారు. ఈ విషయంలో గాంధీజీ దృష్టి కూడా వృద్ధి పథంలో సాగిందని భావిస్తానన్నారు. అయితే ప్రస్తుతం సమాజంలో ఈ జాతి సమస్యపై మూడో వ్యక్తి దృష్టిలో చూడ్డానికి, జీవన విధానానికి చాలా తేడా ఉందన్నారు. కాగా జాతి గురించి మీ పాఠశాలలో వివాదం జరుగుతుందా..? అన్న ప్రశ్నకు, బడిలోనే కాదు మా ఇంట్లో కూడా అలాంటి వివాదం జరిగింది లేదని జాన్వీ కపూర్ పేర్కొన్నారు.

ఒక రౌడీ ప్రేమ కథ.. పగలరియాన్


పగలరియాన్ చిత్రంలో

తమిళసినిమా: వైవిధ్య భరిత కథా చిత్రాలను ఎంపిక చేసుకుని నటిస్తున్న యువ నటుడు వెట్రి హీరోగా నటించిన తాజా చిత్రం పగలరియాన్. ఇది ఒక యువ రౌడీ ఇతివృత్తంతో రూపొందిన కథా చిత్రం ఇది. ఇందులో ప్రేమ, స్నేహం త్యాగం అంశాలు చోటు చేసుకుంటాయి. మరో పక్క చెల్లెలు కోసం ఆరాట పడే అన్నయ్య కథ కూడా సమాంతరంగా సాగుతుంది. ఈతరం అమ్మాయిలు ప్రేమ పేరుతో ఎలా మోసపోతున్నారు. అబ్బాయి డబ్బు కోసం ప్రేమను ఎలా తాకట్టు పెడుతున్నారు? తద్వారా పిల్లల తల్లిదండ్రులు ఎలా తల్లడిల్లిపోతున్నారు? వంటి పలు సామాజిక పరమైన అంశాలు జోడించి రూపొందించిన చిత్రమిది. సాధారణ కమర్షియల్ చిత్రాలకు భిన్నంగా పగలరియాన్ సాగుతుంది. అదే విధంగా తనను ద్వేషించే చెల్లెలు ప్రేమించిన యువకుడితో ఇల్లు వదిలి వెళ్లిపోతే ఆమె కోసం గాలించే అన్నయ్య పాత్రలో నటుడు మురుగన్ నటన ఆకట్టుకుంటుంది. ఈ చిత్రాన్ని మురుగనే దర్శక నిర్మాత కావడం విశేషం. ఇది రౌడీ ఇతివృత్తంతో రూపొందిన చిత్రం కావడంతో డ్యూయెట్స్ లాంటివి లేకపోయినా మంచి మెలోడీ సాంగ్, బ్యాక్ గ్రౌండ్ సాంగ్ చోటు చేసుకున్నాయి. వెట్రి, అక్షయ కందముదన్, ఛాప్లిన్ బాలు, సాయి దీనా, మురుగన్, వినూ ప్రియ తదితర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి వివేక్ సరో సంగీతాన్ని, అభిలాష్ ఛాయాగ్రహణంను అందించారు. రిషీకేష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై గీతా మురుగన్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం తెరపైకి వచ్చింది.

సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్


శివకార్తికేయన్, సుధా కొంగర

తమిళ సినిమా: మహిళ దర్శకురాలు సుధా కొంగర దర్శకత్వంలో శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటించడానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. ఇంతకుముందు సుధా కొంగర సూర్య కథానాయకుడిగా సూరరై పోట్రు వంటి సూపర్ హిట్ చిత్రాన్ని తెరకెక్కించిన విషయం తెలిసిందే. 2020లో విడుదలైన ఈ చిత్రం పలు జాతీయ అవార్డులను గెలుచుకున్న విషయం విదితమే. కాక సుధా కొంగర తాజాగా సూర్య హీరోగా మరో చిత్రాన్ని రూపొందించడానికి సిద్ధమయ్యారు. దీనికి పురనానూరు అనే టైటిల్ కూడా నిర్ణయించారు. ఈ చిత్రాన్ని నటుడు సూర్య తన 2 డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మించనున్నట్లు ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఈ చిత్ర నిర్మాణానికి చాలా సమయం అవసరం అవుతుందని అందువల్ల చిత్ర నిర్మాణాన్ని వాయిదా వేస్తున్నట్లు దర్శకురాలు సుధా కొంగర, నటుడు సూర్య కలిసి ప్రకటన చేశారు. అలాంటిది తాజాగా దర్శకురాలు సుధా కొంగర తన తాజా చిత్రాన్ని నటుడు శివ కార్తికేయన్ హీరోగా తలకెక్కిందడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సామాజిక మాధ్యమంలో ప్రసారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడ లేదు. కాగా నటుడు శివ కార్తికేయన్ అమరన్ చిత్రాన్ని పూర్తిచేసి ప్రస్తుతం ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో తన 23వ చిత్రాన్ని చేస్తున్నారు. అదేవిధంగా సుధా కొంగర సూరరై పోట్రు చిత్రానికి రీమేక్ అయిన సర్ఫిరా చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. దీంతో సూర్య కథానాయకుడిగా నటించిన పురనానూరు చిత్రం పరిస్థితి ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.


వాణి భోజన్

సుందర్ సి దర్శకత్వంలో
వాణీభోజన్

తమిళసినిమా: నటి వాణీ భోజన్‌కు లక్కీఛాన్స్ వరించింది అన్నది తాజా న్యూస్. స్టార్ దర్శకుడు సుందర్ సీ దర్శకత్వం వహించనున్న తాజా చిత్రంలో ఈమె కథానాయకిగా నటించబోతున్నారు. కథానాయకిలను అందంగా చూపించడంలో దిట్ట దర్శకుడు సుందర్ సీ. ఇందుకు మచ్చుతునక ఇటీవల ఆయన దర్శకత్వం వహించిన అరణ్మనై 4 చిత్రమే. ఇందులో ఒక పాటలో నటి తమన్నా, రాశీఖన్నా మోతాదు మించిన అందాలను తెరపై ఆవిష్కరించి ఆ చిత్ర ప్రమోషనుకు బాగా వాడుకున్నారు. దీంతో చిత్రం వసూళ్ల వర్షం కురిపించింది. తాజాగా కలగలుపు చిత్ర సీక్వెల్ 3 కు సిద్ధమయ్యారు. ఈయన ఇంతకుముందు వినోదమే ప్రధానంగా తెరకెక్కించిన కలగలుపు 1,2 చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. ముఖ్యంగా నటుడు విమల్, శివ, నటి అంజలి, ఓవియా హీరో హీరోయిన్లుగా సుందర్ సీ దర్శకత్వం వహించిన కలగలుపు చిత్రం 2012లో విడుదలై సూపర్ హిట్ అయింది. దీంతో దానికి సీక్వెల్ రూపొందించారు. అందులో నటుడు జీవా, శివ ,నటి నిక్కీ గల్రాణి, క్యాథరీన్ టెర్సా హీరో హీరోయిన్‌లుగా నటించారు. ఈ చిత్రం కూడా మంచి లాభాలను తెచ్చి పెట్టింది. కాగా ఇటీవల అరణ్మనై చిత్రానికి వరుసగా మూడు సీక్వెల్స్ రూపొందించి సక్సెస్ అందుకున్న సుందర్ సీ తాజాగా కలగలుపు -3 చిత్రాన్ని తెరకెక్కించడానికి సిద్ధమవుతున్నారు. ఇందులో నటుడు విమల్, శివ హీరోలుగా నటించనున్నారు. కాగా ఈ చిత్రంలో ఒక నాయకిగా నటి వాణీభోజన్‌ను ఎంపిక చేశారు అనేది తాజా సమాచారం. కాగా మరో నాయకితో పాటు ఇతర నటీనటులు, సాంకేతిక వర్గాన్ని ప్రస్తుతం ఎంపిక చేసే పనిలో ఉన్నారు. చిత్ర షూటింగ్‌ను జూలైలో ప్రారంభించనున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన బస్సు
• ఇద్దరు యువకులు మృతి

అన్నానగర్: కడలూరు జిల్లా పరంగిపేట కుత్త పాళయం గ్రామానికి చెందిన తమిళ్‌వలవన్(21) స్నేహితుడు కళైచెల్వన్ (21). వీరిద్దరూ కుత్తపాళయం నుంచి శనివారం రాత్రి ఒకే బైక్‌పై పరంగిపేటకు వెళ్లారు. అప్పుడు అక్కడ పని ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నారు. పరంగిపేట పంచాయతీ యూనియన్ కార్యాలయం సమీపంలోకి బైకు రాగానే కడలూరు నుంచి వస్తున్న ప్రభుత్వ టౌన్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తమిళ్ వలవన్, కళైచెల్వన్‌లు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటనతో ఆగ్రహించిన గ్రామస్తులు కొందరు బస్సు అద్దాలు పగులగొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని శాంతింప జేశారు. అలాగే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొరుక్కుపేటలో నగదు స్వాధీనం

కొరుక్కుపేట: కొరుక్కుపేటలో రూ.15 లక్షల హవాలా డబ్బు పట్టుబడింది. చెన్నైలోని కొరుక్కుపేటలోని మన్నప్ప ముదలి వీధిలో పోలీసులు శనివారం రాత్రి వాహన తనిఖీలను ముమ్మరంగా నిర్వహించారు.ఆ సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు పొంతన లేని సమాధానం ఇవ్వడంతో పోలీసులు వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను వెతికారు. రూ.15 లక్షల డబ్బులు ఉన్నాయి. కానీ సరైన పత్రాలు లేకపోవడంతో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన హనుమాన్ మల్ కుమార్ (38), మనోజ్‌కుమార్(27) ఈ డబ్బును తీసుకొచ్చినట్లు గుర్తించారు. వీరు చెన్నైలోని సెవెన్ వెల్ అమ్మన్ కోయిల్ స్ట్రీట్‌లో ఉంటున్నారు. స్వాధీనం చేసుకున్న డబ్బును నుంగంబాక్కంలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయానికి అప్పగించారు. సరైన పత్రాలు సమర్పించి డబ్బులు తీసుకోవచ్చునని అధికారులు తెలియజేశారు.

దోపిడీకి యత్నించిన మహిళ అరెస్ట్

అన్నానగర్: పులియాంతోపు నరసింహానగర్ 5వ వీధిలో నివాసం ఉంటున్న అంజలి(48)కి ఆ ప్రాంతంలో వడ్డీ వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయడం అలవాటు. ఆ ప్రాంతంలో గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయిస్తోంది. దీంతో ఆమెపై పులియాంతోపు, ఒట్టేరితో సహా 10కి పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ స్థితిలో కొన్ని నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన మషీర్ ఖాన్(44) అనే వ్యక్తి రూ.4 లక్షలకు పోస్టాఫీసు వడ్డీకి కొనుగోలు చేసి నెలవారీ వడ్డీని సరిగ్గా చెల్లించాడు. అతను ఇప్పటివరకు ఈ వడ్డీ మొత్తాన్ని రూ.8 లక్షల వరకు చెల్లించాడు. వ్యాపారం నెమ్మదించడంతో రెండు మూడు నెలలుగా వడ్డీ కట్టడం మానేశాడని ఆగ్రహం చెందిన అంజలి మషీర్‌ఖాన్‌కు ఫోన్ చేసి వడ్డీ డబ్బులు సరిగ్గా రాలేదని, మొత్తం తొమ్మిది లక్షలు చెల్లించాలని చెప్పింది. ఇక శుక్రవారం మషీర్‌ఖాన్ ఇంటికి దుండగులతో వెళ్లి చంపేస్తానని బెదిరించింది. దీంతో భయాందోళనకు గురైన మషీర్‌ఖాన్ వెంటనే పులియాంతోపు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అంజలిపై ఫిర్యాదు చేశాడు. ఆమెపై హత్య, వడ్డీ ఆరోపణలపై అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచి, పుళల్ జైలుకు తరలించారు.

వివాహిత బలవన్మరణం

సేలం: ఈరోడ్ జిల్లా చిత్తోడ్ దగ్గర కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. అయితే తమ చెల్లెలి మృతిపై సందేహాలు ఉన్నాయని ఆమె సోదరుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పుదుకోట్టై జిల్లా గంధర్వకోట్టై మట్టంగల్‌కు చెందిన వ్యక్తి శివనేసన్ (54). అతని చెల్లెలు సరిత (37). ఈమెకు తంజావూరు జిల్లా అమ్మపేట కొంపంచేరికి చెందిన సదాశివం(44)తో 2014లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. సదాశివం ఈరోడ్ జిల్లా చిత్తోడ్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కాగా సరిత, సదాశివం దంపతులు తమ పిల్లలతో కలిసి ఈరోడ్ జిల్లా ఆర్ఎన్ పుత్తూరులోని ఇందిరాపురంలో నివాసముంటున్నారు. కాగా, గత మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య కలహాలు జరుగుతున్నాయి. దీంతో సదాశివం తన భార్య సరితను ఆమె సోదరుడు శివనేసన్‌తో పుట్టింటికి పంపించేశాడు. అయితే ఇటీవల శివనేసన్ బంధువులు కలిసి సరితకు సర్ది చెప్పి సదాశివం వద్ద వదిలి వెళ్లాడు. ఈ స్థితిలో శనివారం సరిత ఉరివేసుకుని చనిపోయిందని సోదరుడు శివనేసన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. అయితే ఆ తర్వాత కొంత సేపటికి సరిత మృతి చెందడానికి ముందు వాగ్మూలం ఇస్తున్నట్టు ఒక వీడియో శివనేసన్‌కు వచ్చింది. దీంతో తన చెల్లెలి మృతిపై సందేహాలున్నాయంటూ పోలీసులు ఫిర్యాదు చేశాడు.

ముత్యాలమ్మ సేవకు పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణలో పెద్దసంఖ్యలో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ నవీన్‌కుమార్, కమిటీ చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి ఏర్పాట్లు చేయించారు.

పెరమానల్లూరులో తాగునీరు కలుషితం


పెరుమానల్లూరులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు


తిరుత్తణి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

• గ్రామీణులకు వాంతులు, విరేచనాలు
• ఆసుపత్రికి 8 మంది తరలింపు

పళ్లిపట్టు: తాగునీటిలో మురుగునీరు కలుషితం కావడంతో గ్రామస్తులకు వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో తిరుత్తణి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పళ్లిపట్టు సమీపం పెరమానల్లూరు గ్రామ పంచాయతీలోని దళితవాడలో 180 కుటుంబీకులు నివాసముంటున్నారు. పంచాయతీ ద్వారా గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో మురుగునీటి సమీపంలోని తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడి తాగునీటిలో మురుగునీరు కలుషితం కావడంతో ఆ నీటిని తాగిన గ్రామస్తులకు శనివారం వాంతులు, విరేచనాలు చోటుచేసుకున్నాయి. దీంతో చిన్నారులు సహా ఏడుగురిని 108 అంబులెన్స్ ద్వారా తిరుత్తణి ప్రభుత్వాసుపత్రిలో అనుమతించి చికిత్స పొందారు. దీంతో స్పందించిన పంచాయతీ రాజ్ శాఖతో పాటు ఆరోగ్యశాఖ అధికారులు ఆదివారం గ్రామంలో పర్యటించి వెంటనే తాగునీటి సరఫరా నిలిపివేశారు. పైపులైన్లు కొత్తగా ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. అదే సమయంలో మండల వైద్యాధికారి డాక్టర్ ధనుంజయన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, గ్రామస్తులకు వైద్య పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులతో పనులు చేయించొద్దు

కొరుక్కుపేట: పాఠశాలల్లో సంక్షేమ సామగ్రి అందించేందుకు విద్యార్థులను ఉపయోగించరాదని, అంతేకాకుండా అందజేసే వస్తువుల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. వేసవి సెలవుల అనంతరం వచ్చే నెల(జూన్) 6వ తేదీన పాఠశాలలు తెరవనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజు నుంచే విద్యార్థులకు సంక్షేమ సామగ్రి అందించేందుకు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు దశల్లో విద్యార్థులకు సంక్షేమ సామగ్రి అందించబోతున్నట్లు విద్యాశాఖ తెలియజేసింది. దీని ప్రకారం పాఠశాలలు తెరిచిన తొలిరోజు నుంచే పాఠ్యపుస్తకాలు, నోట్లు, భౌగోళిక మ్యాప్, రెండో దశలో విద్యా పరికరాల పెట్టె, చెప్పులు, యూనిఫాం తదితర సంక్షేమ సామగ్రి అందించాలని యోచిస్తున్నారు. జూలై 15లోగా అందించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సంక్షేమ సామగ్రి అందించే పనిలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపాధ్యాయులు విద్యార్థులను వినియోగించుకోవద్దని పాఠశాల విద్యాశాఖ ప్రాథమిక విద్యా శాఖాధికారులకు సూచించింది. అంతే కాకుండా విద్యార్థులకు అందించిన మెటీరియల్ వివరాలను ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ ఏజెన్సీ(ఈఎంఐఎస్) వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, ఆ వివరాలను తల్లిదండ్రుల సెల్‌ఫోన్ నంబర్‌లకు మెసేజ్‌లుగా పంపాలని విద్యాశాఖ ఆదేశించింది. కాబట్టి ఉపాధ్యాయులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరింది.

విద్యార్థినులకు ఎస్‌కేపీసీ చేయూత


విద్యార్థినితో ఊటుకూరు శరత్‌కుమార్ తదితరులు

కొరుక్కుపేట: శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల యాజమాన్యం ఇద్దరు పేద విద్యార్థినులకు చేయూతనిచ్చింది. బీకాం(సిఎస్) చదువుతున్న పి.రక్షితకు మొదటి ఎండోమెంట్ ఫండ్ ఉచిత సీటును ప్రదానం చేయగా, బీకాం(జనరల్)కు చెందిన ఎ.నిహాకు మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌ను అందించింది. ఎస్‌కేపీసీ సిల్వర్ జూబ్లీ అక్షయ ఎండోమెంట్ ఫండ్ ఆర్థికంగా వెనుకబడి, ప్రతిభావంతులైన విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందడానికి, వారి లక్ష్యాలను సాధించడానికి వీలుగా అందిస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ తెలిపారు. ఇంకా పేద వర్గాల విద్యార్థులకు విద్య అందుబాటులో ఉంచేందుకు కాలేజ్ మేనేజ్‌మెంట్ ఐదు ఉచిత సీట్లను అందిస్తుందన్నారు. 95శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన మెరిటోరియస్ విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ, తమిళాన్ని రెండో భాషగా ఎంచుకున్న విద్యార్థులకు 30 శాతం ఫీజు రాయితీ, క్రీడల్లో ప్రావీణ్యం సాధించిన విద్యార్థులకు పూర్తి ఫీజు మినహాయింపు అందజేస్తున్నట్టు తెలిపారు. ఎస్‌కేపీసీ విద్యాసంస్థ ప్రభుత్వ, దాతృత్వ, ప్రైవేట్ సంస్థల నుండి స్కాలర్‌షిప్‌లు సమకూర్చి అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తుందని ఆయన వివరించారు.

అవినీతి ఆరోపణలతో ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

కొరుక్కుపేట: లంచం తీసుకున్నాడన్న ఫిర్యాదులతో ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ డీఐజీ ప్రవేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కన్యాకుమారి జిల్లాకు చెందిన విజయకుమార్ ఎస్ఐగా పోలీసు శాఖలో చేరాడు. ఆ తర్వాత ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. గత కొన్ని సంవత్సరాలుగా తిరునల్వేలి సిటీ, తూత్తుకుడి, మదురై, విరుదునగర్ జిల్లాల్లో పనిచేశారు. 2019లో పెరుమాళ్ పురం పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాడు. అప్పట్లో ఓ ప్రైవేట్ వైద్యుడి నుంచి లంచం తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో నెల్లై జిల్లా అవినీతి నిరోధక శాఖ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఆ తర్వాత 2021లో తూత్తుకుడి జిల్లాకు బదిలీ అయ్యారు. 2022 నుంచి కలగుమలై పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనుండగా, తిరునల్వేల్లి అవినీతి నిరోధక పోలీసుల నివేదిక, పెండింగ్ ఆరోపణల ఆధారంగా ఇన్‌స్పెక్టర్ విజయకుమార్‌ను తిరునల్వేలి డీఐజీ ప్రవేశ్‌కుమార్ సస్పెండ్ చేశారు.


చెత్త కుండీ కోసం గొడవలు

• డీఎంకే మండల కార్యదర్శిపై దాడి
• అన్నాడీఎంకే మహిళా నిర్వాహకురాలి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నైలోని సేతుపట్టు కందన్ వీధికి చెందిన ఇలవరశి(46). అన్నాడీఎంకే ఎగ్మూర్ సౌత్ మండలం మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి. ఆమె సేతుపట్టు మురుగేశన్ వీధిలో ఇల్లు కొన్నారు. ఇంటి దగ్గర కార్పొరేషన్ ద్వారా చెత్త కుండీ పెట్టారు. ఇలవరసి ఈ చెత్తబుట్టను తొలగించారు. ఈ విషయమై ఆ ప్రాంత ప్రజలు చెన్నైలో నిరసన వ్యక్తం చేసి హారింగ్‌టన్ రోడ్డుకు చెందిన డీఎంకే కార్యదర్శి వాన్మతి కదిరవన్(48)కి ఫిర్యాదు చేశారు. అతను కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి ఇలవరసి ఇంటి దగ్గర మళ్లీ చెత్తబుట్టను ఉంచారు. దీంతో ఆగ్రహించిన ఇలవరసి ఓ.పన్నీర్ సెల్వం బృందం జిల్లా కార్యదర్శి అవ్వాయిపురం మణికందన్‌తోపాటు మరో ఆరుగురు డీఎంకే జిల్లా కార్యదర్శి వన్మతి కదిరవన్ కార్యాలయంలోకి ప్రవేశించారు. అక్కడ వన్మతి కదిరవన్, డీఎంకే సభ్యుడు బాలు(46), శివ(40) అనే ముగ్గురు వ్యక్తులపై దాడి చేసినట్లు తెలుస్తోంది. గాయపడిన ముగ్గురు వ్యక్తులు కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై బాధితులు కేసు పెట్టారు మహిళా విభాగం ఇలవరసి, ఓ.పన్నీర్ సెల్వం టీమ్ మేనేజర్ అవ్వాయిపురం మణికందన్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

తిరుత్తణికి పోటెత్తిన భక్తజనం


క్యూలైన్‌లో భక్తజనం


ఉత్సవర్లకు కర్పూర హారతి

తిరుత్తణి: తిరుత్తణి శ్రీసుబ్రహ్మణ్య స్వామివారి ఆలయంలో ఆదివారం శుభ ముహూర్తదినం సందర్భంగా భక్తజనం పోటెత్తారు. మురుగన్ కొలువైన ఆరు పుణ్యక్షేత్రాల్లో ఐదో క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వచ్చి స్వామి దర్శనం చేసుకుంటారు. ఆదివారం సెలవుదినం కావడంతో పాటు శుభ ముహూర్తం రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో కొండకు చేరుకున్నారు. దీంతో ఘాట్‌రోడ్డు మార్గంలో వాహనాల రద్దీ చోటుచేసుకుంది. ట్రాఫిక్ సమస్యతో భక్తులు గంటపాటు ఇబ్బంది పడ్డారు. కొండ ఆలయ మాడవీధుల్లో భక్తుల సందడి నెలకొంది. రూ.100 శీఘ్ర దర్శనం మార్గంలో రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల పాటు భక్తులు వేచివుండి స్వామిని దర్శించుకుని హుండీల్లో కానుకలు చెల్లించారు. మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి సేవలో రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి అముద పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 60 వేలకు పైబడి భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు.

ట్రై సైకిల్‌ను ఢీ కొట్టిన కారు
• బాలుడు, ఇద్దరు మహిళలు మృతి

కొరుక్కుపేట: మూడు చక్రాల సైకిల్‌ను ఓ కారు ఢీ కొట్టడంతో బాలుడు, ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటన ఆ ప్రాంతంలో విషాదాన్ని నింపింది. రామనాథపురం జిల్లా తంగచ్చి మఠానికి చెందిన సిలంబరసన్(35) మూడు చక్రాల సైకిల్‌పై పట్టణానికి వెళ్లి పాత పేపర్, కార్డ్‌బోర్డ్, ప్లాస్టిక్ బాటిళ్లను సేకరిస్తాడు. దీనిని సాధారణంగా తూత్తుకుడిలోని ఒక దుకాణంలో విక్రయిస్తారు. ఈ క్రమంలో తంగచ్చి మఠానికి చెందిన సిలంబరసన్, అతని భార్య తంగమ్మాళ్ (35), అదే ప్రాంతానికి చెందిన ఆరుముగం భార్య మారియమ్మాళ్(60), కొడుకు సతీష్(7)తో కలిసి ట్రైసైకిల్‌పై వెళ్లాడు. ఆదివారం ఉదయం వ్లాతికులం తర్వాత సూరంగుడి సమీపంలోని కీళ షణ్ముగపురం గ్రామంలో పాత పేపర్, ప్లాస్టిక్ బాటిళ్లు, కార్డులు సేకరించారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి ఈస్ట్‌కోస్ట్ రోడ్డు దాటారు. ఆ సమయంలో ఆ రోడ్డు మీదుగా వస్తున్న కారు ట్రై సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో బాలుడు సతీష్, తంగమ్మాళ్, మరియమ్మాళ్ అక్కడికక్కడే మృతి చెందారు. కన్యాకుమారి జిల్లా మార్తాండం తండాకు చెందిన సెల్వరాజ్ (55), అతని భార్య కుమారి తంగం (49) కారులో వచ్చారు. కారు నడుపుతున్న అతని కుమారుడు జెనిత్ (29) గాయపడ్డారు. సమాచారం అందుకున్న సూరంగుడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రక్షించి చికిత్స నిమిత్తం తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందినవారి మృతదేహాలను వ్లాతి కులం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం
• దంపతుల అరెస్టు

తిరువొత్తియూరు: ప్రభుత్వ ఉద్యోగం తీసి ఇస్తామని చెప్పి నకిలీ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేసిన భార్యాభర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఈరోడ్ జిల్లా కురికారణ పాలయం వీఆర్ అవెన్యూకు చెందిన మోహన్(47) తిరుపూర్‌లో సొంతంగా పని చేసుకుంటున్నాడు. ఇందులో నష్టం రావడంతో చెన్నై మింట్ ప్రాంతంలో ఉన్న ఒక లాడ్జిని లీజుకు తీసుకుని దాన్ని నడుపుతున్నాడు. అతని భార్య కౌసల్య(35). ఈ క్రమంలో అరియలూరు జిల్లా వాలాజా నగర్‌కు చెందిన దినేష్ కుమార్(26) వారికి పరిచయమయ్యాడు. అతను తమకు తెలిసిన మహిళకు ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. ఈ సంగతి తెలుసుకున్న మోహన్, కౌసల్య ఇద్దరు తమకు రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు బాగా తెలుసునని, వారి ద్వారా ప్రభుత్వ ఉద్యోగం తీసిస్తామని చెప్పి దినేష్ కుమార్ వద్ద రూ.1 లక్ష తీసుకున్నారు. తర్వాత ఆ మహిళకు ప్రభుత్వ ఉద్యోగం దొరికిందని ఒక నియామక పత్రం ఇచ్చి పంపారు. దీన్ని దినేష్ కుమార్ తనిఖీ చేయగా అది నకిలీదని తెలిసింది. దీనిపై దినేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మోహన్, కౌసల్య దంపతులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 49 నకిలీ నియామక పత్రాలు, పలు వేర్వేరు శాఖలకు చెందిన నకిలీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 6 సెల్ ఫోన్లు, ఒక లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.

బాలికలను రక్షించిన పోలీసులు

తిరువొత్తియూరు: తల్లిదండ్రులు తిట్టారని తిరుచ్చి నుంచి చెన్నైకి పారిపోయి వచ్చిన నలుగురు బాలికలను చెన్నై మెరీనా తీరంలో పోలీసులు రక్షించారు. వివరాలు.. తిరుచ్చి జిల్లా ఎడమలైపట్టి పుదూర్ ఇందిరానగర్ బాలమురుగన్ ఆలయ వీధికి చెందిన 9వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలిక, ఎనిమిదో తరగతి చదువుతున్న ఆమె చెల్లెలు, తైలం నగర్‌కు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలిక, ఏడవ తరగతి చదువుతున్న ఆమె చెల్లెలు ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. దీనికి సంబంధించి వారి తల్లిదండ్రులు ఎడమలై పట్టి పుదూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అదృశ్యమైన నలుగురు బాలికలు తిరుచ్చి నుంచి ప్రభుత్వ బస్సు ద్వారా చెన్నై తాంబరంలో దిగి తర్వాత మెరీనా సముద్ర తీరానికి చేరుకున్నారు. బాలికలు కనిపించ లేదనే విషయాన్ని తిరుచ్చి పోలీసులు చెన్నై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మెరీనా పోలీసులను అలెర్ట్ చేశారు. మెరీనా పోలీసు ఇన్‌స్పెక్టర్ ఇళయరాజా, సబ్ ఇన్‌స్పెక్టర్ పార్తీబన్, పోలీసులు మణిగండన్, పలనిచ్చామి, రమేష్ కుమార్ తదితరులు మెరీనా తీరంలో ఆడుకుంటున్న బాలికలను రక్షించి చెన్నైకి వచ్చిన వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు సిద్ధం

• కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు


ఈవీఎంలు భద్ర పరిచిన గదిని తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి సుబ్బలక్ష్మి

వేలూరు: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు దగ్గర పడుతుండడంతో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల్లో టెన్షన్ ప్రారంభమైంది. ఇదిలా ఉండగా ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం వేగవంతం చేస్తోంది. ఆదివారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి సుబ్బలక్ష్మి వేలూరు తందై పెరియార్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎం మిషన్‌లు భద్ర పరిచి సీల్ వేసిన గదిని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. అదే విధంగా కౌంటింగ్‌కు వచ్చే అధికారులు, ఏజెంట్‌లు, అభ్యర్థులు లోనికి వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే కౌంటింగ్ కేంద్రంతోపాటు ఈవీఎం మిషన్‌లు ఉంచిన గదిని ప్రతి రోజూ సీసీటీవీ కెమెరాల ద్వారా పరిశీలించేందుకు 24 గంటలపాటు పోలీసులను ఉంచామన్నారు. వేలూరు పార్లమెంట్ స్థానంలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 84 బెంచ్‌లు ఉంచామని, 16 నుంచి 22 రౌండ్లు కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని బెంచ్‌లకు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని ఏజెంట్‌లు చూసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రంలో ప్రత్యేకంగా అన్ని ఏర్పాట్లు ఉన్నాయన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు తదితర అన్ని వసతులు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటితో పాటు మీడియా సెంటర్‌ను ప్రత్యేకంగా ఉందన్నారు. అదే విధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 600 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధులు లోనికి రాకుండా రోడ్డుపైనే నిలిపివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తింపు కార్డులు లేని వారిని ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించబోమన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

• నైవేలి పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో బంధువుల ఆందోళన

అన్నానగర్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందడంతో పోలీసుల తీరును నిరసిస్తూ ఆదివారం ఉదయం బంధువులు నైవేలి పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో చేయడం కలకలం రేపింది. కడలూరు జిల్లా నైవేలి సమీపంలోని కీళకొల్లై గ్రామానికి చెందిన రాజ్‌కుమార్(36)కు భార్య, పిల్లలు ఉన్నారు. శనివారం రాత్రి ఎన్ఎల్‌సీ ఆర్చ్ గేట్ సమీపంలోని థిల్లానగర్‌లో బైక్‌పై వెళ్తున్నాడు. ఆ సమయంలో అక్కడ వాహన తనిఖీలు చేపడుతున్న నైవేలి నగర పోలీసులు రాజ్‌కుమార్ వాహనాన్ని కూడా నిలిపి సంబంధిత పత్రాలు అడిగారు. రాజ్‌కుమార్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. అలాగే సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు రాజ్‌కుమార్ బైక్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సరైన పత్రాలు చూపించి బండి తీసుకుని వెళ్లమని చెప్పి రాజ్‌కుమార్‌ని ఇంటికి పంపించారు. ఈ స్థితిలో పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న దుకాణం ఎదుట తెల్లవారుజామున 1 గంటకు రాజ్‌కుమార్ శవమై కనిపించాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిలో రాజ్‌కుమార్ బంధువులు, గ్రామస్తులు 100 మందికి పైగా ఆదివారం ఉదయం 8 గంటలకు నైవేలి సిటీ పోలీస్ స్టేషన్ ఎదుట గుమిగూడారు. రాజ్‌కుమార్ మృతికి పోలీసులే కారణమని ఆరోపించారు. పోలీసుల కళ్లగప్పి మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న కడలూరు జిల్లా ఎస్పీ రాజారామ్, డీఎస్పీ సబీవుల్లా, పోలీసులు నిరసనలో పాల్గొన్న వారితో చర్చలు జరిపారు. తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు హామీ ఇవ్వడంతో బంధువులు, గ్రామస్తులు నిరసన విరమించి వెళ్లిపోయారు. నీ నిరసన కారణంగా ఆ ప్రాంతంలో 2 గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది.

కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: వన్‌సైడ్ లవ్ కారణంగా నర్స్‌ను కారులో కిడ్నాప్ చేసిన యువకుడు, అతనికి స్నేహితులను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై వేళచ్చేరిలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో 23 సంవత్సరాల యువతి నర్సుగా పనిచేస్తున్నారు. ఈమె శనివారం ఉదయం వేళచ్చేరి ఝాన్సీ నగర్‌లో ఉన్న ఆసుపత్రి హాస్టల్ నుంచి పనికి బయల్దేరింది. ఆ సమయంలో కారులో వచ్చిన ఇద్దరు నర్సును బలవంతంగా కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేశారు. కారు లోపల మరో ఇద్దరు ఉన్నారు. ఇది చూసిన స్థానికులు వేళచ్చేరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గిండి పోలీసు సహాయ కమిషనర్ శివ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ జయచంద్రన్, పోలీసులు ఆ ప్రాంతంలో ఉన్న నిఘా కెమెరాల్లో నమోదైన కారు రిజిస్టర్ నెంబరు ఆధారంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో నర్స్‌ను కిడ్నాప్ చేసిన ఆ కారు తాంబరంలో నుంచి చెంగల్పట్టు మార్గంగా వెళ్తున్నట్లు కనుగొన్నారు. పోలీసులు కిడ్నాప్ చేసిన రెండు గంటల్లోపు అక్షరపాకం టోల్‌గేట్ వద్ద కారును అడ్డుకుని నిలిపారు. కారు లోపల నర్సు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమెను కిడ్నాపర్ల నుంచి విడిపించారు. కిడ్నాప్ చేసిన రామనాథపురం తిరువడనై బర్గ్గూరు ప్రాంతానికి చెందిన సభాపతి (27), అతని స్నేహితులు హరీష్ (20), అజయ్ (25), రమేష్ (40) తదితరులను పోలీసులు వేళచ్చేరి నుంచి అక్షరపాకం పోలీసుస్టేషన్‌కు తీసుకుని వచ్చి విచారణ చేశారు. పోలీసుల వద్ద సభాపతి తాను నర్సును వన్ సైడ్ లవ్ చేస్తున్నానని, ప్రేమించడానికి తిరస్కరించడంతో కారులో కిడ్నాప్ చేసినట్లు తెలిపాడు. దీనిపై నర్సు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సభాపతి, నలుగురిని అరెస్టు చేసి జైలు తరలించారు.

కోడలు మీద పెట్రోలు పోసి సజీవ దహనం

అన్నానగర్: రామనాథపురం జిల్లా ముత్తుకుళత్తూరు సమీపం ముత్తు విజయపురం గ్రామానికి చెందిన జేసు కుమారుడు ఆరోగ్య ప్రభాకర్. ఇతని భార్య ఉమ. గత 2023 సంవత్సరంలో ఆరోగ్య ప్రభాకర్, ఆమె చిన్న కుమార్తె జెమి థెరిస్సా అనారోగ్యంతో మరణించారు. అలా మామగారు తన పెద్ద కూతురు ఉమతో కలిసి ఉన్నారు. ఇదిలా ఉండగా ఆస్తి విభజన విషయంలో మామగారు జేసు, ఉమ మధ్య గొడవ జరిగింది. గత 20న జరిగిన వివాదంలో ఆగ్రహం చెందిన జేసు ఇంటిలో నిద్రిస్తున్న కోడలు ఉమపై పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. అయితే ఉమ ఆత్మహత్యకు యత్నించినట్లు జేసు నాటకీయంగా చూపించాడు. దీంతో పోలీసులు ఉమను చికిత్స నిమిత్తం రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. పోలీసులు ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఉమ మృతిలో అనుమానం ఉందని ఉమ సోదరుడు దినేష్ కీళత్తువాల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో మామ జేసు ఉమపై పెట్రోలు పోసి నిప్పు అంటించినట్లు తేలింది. దీంతో పోలీసులు వెంటనే హత్య కేసు నమోదు చేసి జేసును ఆదివారం అరెస్టు చేశారు.

అడవిలోకి చిరుత

కొరుక్కుపేట: కడలూరు సమీపంలో ఇంట్లోకి చొరబడిన చిరుతపులిని అనస్తీషియా ద్వారా బంధించారు. అనంతరం అటవీశాఖ అధికారులు ఆ చిరుతను అర్ధరాత్రి ముదుమలై అడవుల్లో విడిచిపెట్టారు. శనివారం నీలగిరి జిల్లా కూడలూరు సమీపంలోని సేముండికి చెందిన తంగేసన్ అనే వ్యక్తి వ్యవసాయ భూమిలోకి చిరుతపులి ప్రవేశించింది. ఇక్కడ ఉన్న ఇంటిని వ్యవసాయ కూలీలు తమ వస్తువులను నిల్వ చేసుకోవడానికి విశ్రాంతి తీసుకోవడానికి ఉపయోగిస్తారు. ఈ సందర్భంగా శనివారం ఒక కార్మికుడు కత్తిని తీసుకోవడానికి తలుపు తెరిచినప్పుడు లోపల చిరుతపులి కనిపించడంతో అతను వెంటనే తలుపులకు తాళం వేశాడు. అతను వెళ్లి యజమానికి సమాచారం ఇచ్చాడు. కూడలూరు డివిజనల్ ఫారెస్ట్ అధికారి వెంకటేష్ ప్రభు, ముత్తు హిల్ టైగర్ రిజర్వ్ పశువైద్యాధికారి రాజేష్ కుమార్ అక్కడికి చేరుకున్నారు. మత్తు ఇంజక్షన్లు వేసి చిరుతను పట్టుకునేందుకు అటవీశాఖ నిమగ్నమైంది. దీంతో శనివారం రాత్రి 8 గంటల సమయంలో చిరుతపులికి మత్తు ఇంజక్షన్ వేశారు. చిరుత అపస్మారక స్థితిలోకి వెళ్లిందని నిర్ధారించుకున్న అటవీశాఖ అధికారులు చిరుతను వల వేసి పట్టుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న చిరుతను బోనులో వేసి ముదుమలైకి తీసుకెళ్లారు. పట్టుబడిన చిరుతపులి ఏడేళ్ల మగ చిరుతపులిగా గుర్తించారు. చిరుత శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, స్పృహ కోల్పోవడంతో చిరుతను అర్ధరాత్రి ముదుమలై అడవుల్లో విడిచిపెట్టామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం


విద్యార్థులను సత్కరిస్తున్న సెంగుందర్ మహాజన సంఘం నిర్వాహకులు

తిరుత్తణి: విద్య, ఉపాధిపై విద్యార్థులను ప్రేరేపించే విధంగా తిరుత్తణిలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో 500 మందికి పైగా విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. సెంగుందర్ మహాజన సంఘం ఆధ్వర్యంలో టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీవిద్యార్థులను సత్కరించడం, ఉపాధితో కూడిన విద్యకు సంబంధించి అవగాహన సదస్సును సెంగుందర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. పళ్లిపట్టు, ఆర్కేపేట, తిరుత్తణి మండలాల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న సదస్సుకు దక్షిణ భారతదేశ సెంగుందర్ మహాజన సంఘం అధ్యక్షుడు త్యాగరాజన్ అధ్యక్షత వహించారు. సంఘం కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఉమాపతి స్వాగతం పలికారు. ఇందులో ఉపాధి శిక్షణ కల్పన శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ శంకరన్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఉన్నత చదువులపై అవగాహన కల్పించారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు ఉచిత గ్రూప్–4 శిక్షణ తరగతులు నిర్వహణకు సహాయకాలు అందజేశారు. దాతలను నిర్వాహకులు సత్కరించారు.

పెళ్లిపత్రికలోనూ ఈవీఎంపై వ్యతిరేకత!

వాటిని నిషేధించాలంటూ డిమాండ్

లాతూర్: మా పెళ్లికి విచ్చేసి భోజనతాంబూలాదులు స్వీకరించి మమ్మానందింపజేయ ప్రార్థన. ఇది చాలా పెళ్లిపత్రికల్లో కనిపించే ఒక విన్నపం. కానీ ఇక్కడ ఒక పత్రికలో విజ్ఞాపనకు బదులు 'వ్యతిరేకత' కనిపించింది. ''ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లను నిషేధించండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి'' అంటూ కొటేషన్‌ను పెట్టాడు ఒక పెళ్లికొడుకు. మహారాష్ట్రలోని ఛాకూర్ తహసీల్ పరిధిలోని అజన్‌సోందా(ఖుర్ద్) గ్రామానికి చెందిన దీపక్ కుంబ్లే పెళ్లి వచ్చే నెల ఎనిమిదో తేదీన లాతూర్ పట్టణంలో జరగనుంది. కుంబ్లే అందరికీ పంచిన తన వివాహ ఆహ్వాన పత్రికలో ఇలా ఈవీఎంలపై తన అసంతృప్తి వెళ్లగక్కాడు. సాధువులు, సంఘ సంస్కర్తలు, స్వాతంత్య్ర సమరయోధుల ఫొటోలను ఆ వెడ్డింగ్ ఇన్విటేషన్ కార్డులో ప్రచురించాడు. తనకు పాఠాలు బోధించిన స్కూలు టీచర్ల ఫొటోలకు ఈ ఆహ్వానపత్రికలో స్థానం కల్పించాడు. ఈయన అఖిలభారత వెనకబడిన, మైనారిటీ వర్గాల ఉద్యోగుల సంఘం(బామ్‌సెఫ్) సభ్యుడు. '' ఈవీఎంల వ్యతిరేక ఉద్యమం సార్వత్రిక ఎన్నికలకు ముందే ఊపందుకుంది. బంధువులు, స్నేహితుల్లోనూ ఉద్యమంపై మరింత అవగాహన పెంచాలనే ఇలా ఈవీఎంల అంశాన్ని పెళ్లికార్డులో ప్రస్తావించా' అని కుంబ్లే చెబుతున్నారు. కార్డులో కథాకమామిషు, ఫొటోలను చూసి ముక్కున వేలేసుకున్న వాళ్లు లేకపోలేదు. కార్డు ఎలాగుంటే మన కెందుకు? పెళ్లికెళ్లి నాలుగు అక్షింతలు వేసి భోంచేసి వచ్చేద్దాం అని ఊళ్లో చాలా మంది డిసైడ్ అయ్యారట!



ఓటింగ్... ఫ్లాప్!

ఐదు విడతల్లో భారీగా తగ్గిన పోలింగ్

- 428 సీట్లలో ఓటేసింది 50.7 కోట్ల మంది
- 2019లో పోలైన ఓట్లు 70.1 కోట్లు!
- 20 రాష్ట్రాలు, యూటీల్లో తక్కువ ఓటింగ్

సార్వత్రిక ఎన్నికల సమరంలో పార్టీలన్నీ హోరాహోరీగా తలపడుతున్నా ఓటర్లలో మాత్రం అంత ఆసక్తి కనబడటం లేదు. మండుటెండలు ఇతరత్రా కారణాలు ఎన్నున్నా దేశవ్యాప్తంగా చాలాచోట్ల ఓటింగ్ తగ్గుముఖం పట్టడం పార్టీలు, అభ్యర్థుల్లో గుబులు పుట్టిస్తోంది. ఏడు విడతల సుదీర్ఘ ఎన్నికల షెడ్యూల్‌లో ఏప్రిల్ 19 నుంచి మే 25 దాకా ఆరు విడతలు పూర్తయ్యాయి. తొలి ఐదు విడతలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కచ్చితమైన ఓటింగ్ గణాంకాలను విడుదల చేసిన నేపథ్యంలో ఓటింగ్ ట్రెండ్‌లో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి...

ఓటర్లు పెరిగినా ఓట్లు తగ్గాయి

తొలి ఐదు విడతల పోలింగ్‌లో దేశవ్యాప్తంగా 428 లోక్‌సభ స్థానాల పరిధిలో ఓటర్లు తమ నిర్ణయాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఆ స్థానాల్లో 50.7 కోట్ల ఓట్లు పోలైనట్లు ఈసీ తెలిపింది. గత ఎన్నికల్లో తొలి ఐదు విడతల్లో 426 స్థానాల్లో ఏకంగా 70.1 కోట్ల మంది ఓటేయడం విశేషం. అప్పుడు 68 శాతం ఓటింగ్ నమోదైతే ఈసారి 66.4 శాతానికి పరిమితమైంది. వాస్తవానికి 2019 ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్లు 89.6 కోట్లుండగా ఈసారి 96.8 కోట్లకు పెరిగారు. 7.2 కోట్ల మంది కొత్త ఓటర్లు జతైనా ఓటింగ్ మాత్రం పడిపోవడం గమనార్హం. ఈసారి తొలి విడత నుంచే ఓటింగ్‌లో తగ్గుదల ధోరణి కొనసాగుతోంది. చివరి రెండు విడతల్లోనూ ఇదే ట్రెండ్ ఉంటే మొత్తం ఓటింగ్ గత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో నమోదైన 67.4 శాతానికి చాలాదూరంలో నిలిచిపోయేలా కనిపిస్తోంది. (ప్రాథమిక డేటా ప్రకారం ఆరో విడతలో 63.36 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో ఇది 64.73 శాతం).

20 రాష్ట్రాలు, యూటీల్లో డౌన్...

ఐదు విడతల పోలింగ్‌ను పరిశీలిస్తే ఏకంగా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటింగ్ తగ్గింది. నాగాలాండ్‌లో పలుచోట్ల ఎన్నికల బహిష్కరణ పిలుపుల నేపథ్యంలో ఓటింగ్ బాగా తగ్గింది. గత ఎన్నికల్లో 82.9 శాతం నమోదు కాగా ఈసారి ఏకంగా 57.7 శాతానికి పడిపోయింది. మిజోరం, కేరళల్లో పోలింగ్ 6 శాతం మేర తగ్గింది. మణిపూర్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఉత్తరాఖండ్‌లో 4 శాతం పైగా తగ్గింది. షాదోల్, రేవా, ఖజురహో, సిద్ధి (మధ్యప్రదేశ్), పథనంతిట్ట (కేరళ), మథుర (యూపీ) లోక్‌సభ స్థానాల్లోనైతే 10 శాతానికి పైగా పడిపోయింది. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్‌లో 2019తో పోలిస్తే 6.76 శాతం తగ్గింది!

కశ్మీర్లో పోటెత్తారు...

దేశవ్యాప్తంగా ట్రెండ్‌కు భిన్నంగా కొన్ని రాష్ట్రాలు, నియోజకవర్గాల్లో ఓటర్లు పోటెత్తారు. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్, మేఘాలయ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, కర్నాటకల్లో ఓటింగ్ బాగా పెరిగింది. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా, శ్రీనగర్ నియోజకవర్గాల్లో గత ఎన్నికల కంటే ఏకంగా 24 శాతం అధిక ఓటింగ్ నమోదైంది. మేఘాలయలోని షిల్లాంగ్‌లో 8.31 శాతం పెరిగింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఐదు విడతల్లో ఓటింగ్ ఇలా... (శాతాల్లో)

	2019	2024
మొత్తం ఓటింగ్ శాతం	68%	66.4%
లక్షద్వీప్	85.2	84.2
అసోం	81.6	81.6
త్రిపుర	82.3	80.9
ఆంధ్రప్రదేశ్	80.2	80.7
సిక్కిం	81	79.9
పశ్చిమ బెంగాల్	81.9	79.1
పుదుచ్చేరి	81.2	78.9
మణిపూర్	82.5	78.3
అరుణాచల్ ప్రదేశ్	81.1	77.7
మేఘాలయ	71.4	76.6
గోవా	75.1	76.1
ఒడిశా	73.4	74.5
ఛత్తీస్‌గఢ్	71.6	72.8
కేరళ	77.8	71.3
దాద్రానగర్-డామన్‌దయ్యు	77.1	71.3
కర్ణాటక	68.8	70.6
తమిళనాడు	72.4	69.7
మధ్యప్రదేశ్	71.2	66.9
తెలంగాణ	62.8	65.7
జార్ఖండ్	66.3	64.7
అండమాన్-నికోబార్	65.1	64.1
రాజస్తాన్	66.3	61.5
మహారాష్ట్ర	61.1	61.3
గుజరాత్	64.4	60.1
జమ్మూ-కశ్మీర్	52.5	59.4
ఉత్తరప్రదేశ్	60.6	58
నాగాలాండ్	82.9	57.7
ఉత్తరాఖండ్	61.6	57.2
మిజోరం	63	56.9
బిహార్	58.6	56.9

డమ్ డమ్‌లో... విజయఢంకా మోగించేదెవరో!

డమ్ డమ్ లోక్‌సభ స్థానం. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో కలిసి లెఫ్ట్ విజయం సాధించగలిగే సీట్లలో ఒకటి. ఒకప్పుడు సీపీఎం కంచుకోట. దాన్ని తిరిగి చేజిక్కించుకోవాలని సీపీఎం పోరాడుతోంది. ఇది తృణమూల్ సిట్టింగ్ స్థానం. ఇక్కడ తమ ఓటు బ్యాంకుకు గండి పడకుండా కాపాడుకోవడానికి టీఎంసీ తిప్పలు పడుతోంది. ఒకసారి గెలుపొందిన ఈ స్థానంలో మళ్లీ పాగా వేయాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. దాంతో డమ్ డమ్‌లో త్రిముఖ పోటీ నెలకొంది...

- సాక్షి, నేషనల్ డెస్క్



కోల్‌కతా సమీపంలో ఉండే డమ్ డమ్ లోక్‌సభ స్థానానికి పశ్చిమ బెంగాల్‌లో చారిత్రక ప్రాధాన్యముంది. 1783లో బ్రిటిష్ ప్రభుత్వం ఇక్కడ సైనిక కంటోన్మెంట్, మిలిటరీ బ్యారక్‌లు నిర్మించింది. 1846లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ స్థాపించింది. 1857 సిపాయిల తిరుగుబాటు సందర్భంగా బ్రిటిష్ సైన్యంపై తిరుగుబాటు చేసిన మంగళ్ పాండేకు మరణశిక్ష విధించింది కూడా డమ్ డమ్ కంటోన్మెంట్‌లోనే. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని డమ్ డమ్ బంగ్లాదేశ్‌కు దగ్గరగా ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో హిందూ శరణార్థులు ఇక్కడ భారీగా స్థిరపడ్డారు.

పట్టణ జనాభా అధికం...

డమ్ డమ్ లోక్‌సభ స్థానానికి 1977లో తొలిసారి ఎన్నికలు జరిగాయి. 20 ఏళ్ల పాటు ఈ స్థానం సీపీఎం గుప్పెట్లోనే కొనసాగింది. 1998లో తొలిసారిగా బీజేపీకి చెందిన తపన్ సిక్దర్ విజయం సాధించారు. 1999లో ఈ స్థానాన్ని నిలుపుకున్నారు. అనంతరం మూడుసార్లు టీఎంసీ నుంచి సౌగతా రాయ్ విజయం సాధించారు. డమ్ డమ్ లోక్‌సభ నియోజకవర్గం మొత్తం జనాభా 21,84,460. ఇందులో 98.43 శాతం పట్టణ జనాభాయే. దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలూ టీఎంసీ ఖాతాలోనే ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

ప్రతి ఐదు ఓట్లలో ఒకటి...

డమ్ డమ్‌లో తృణమూల్ నుంచి సిట్టింగ్ ఎంపీ సౌగతా రాయ్, సీపీఎం నుంచి సుజన్ చక్రవర్తి, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే శిల్పద్రా దత్తా బరిలో ఉన్నారు. శిల్పద్రా 2020లో తృణమూల్‌కు రాజీనామా చేసి కాషాయ పార్టీలో చేరారు. మమతా వ్యతిరేక ఓటర్లు వామపక్షాల వైపు మొగ్గితే కాంగ్రెస్ మద్దతుతో సుజన్ గెలవడం సాధ్యమని విశ్లేషకులు అంటున్నారు. అయితే సీపీఎం కేవలం బీజేపీకి ఓట్లను ఆకర్షించగలదే తప్ప తమనేమీ చేయలేదని టీఎంసీ ధీమాతో ఉంది. సీపీఎం ఓట్లు గతం కంటే పెరిగే అవకాశముందని, ఇది బీజేపీ అవకాశాలను దెబ్బతీస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

'వలస' ఓట్లపై సీఏఏ ప్రభావం...

బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారు డమ్ డమ్‌లో అధిక సంఖ్యలో ఉంటున్నారు. పౌరసత్వ (సవరణ) చట్టం అమలు వివాదం వారిపై ప్రభావం చూపేలా ఉంది. ''దీంతోపాటు అయోధ్య రామమందిర నిర్మాణం కూడా హిందూ ఓట్లను ఏకీకృతం చేస్తుంది. కనుక బీజేపీ గెలుపు ఖాయం'' అని శిల్పద్రా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రంలో ప్రధానంగా కన్పించే డమ్ డమ్ ఇప్పుడు ఆ ప్రత్యేకతను కోల్పోయిందని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి సంక్షోభం అధికార తృణమూల్‌కు నష్టం చేయడం ఖాయమని చెబుతున్నారు. ఇక్కడ జూన్ 1న ఏడో విడతలో పోలింగ్ జరగనుంది.

జిల్లా వార్తలు

మాక్ డ్రిల్.. పవర్‌ఫుల్

- సత్తెనపల్లిలో ఆకట్టుకున్న పోలీసుల మాక్‌డ్రిల్
- నిరసనకారుల దాడులను నిలువరించిన బలగాలు
- అల్లర్ల నియంత్రణపై ప్రజలకు విశదీకరణ
- అధిక సంఖ్యలో తరలివచ్చిన పోలీసులు


నడిరోడ్డుపై మండుతున్న టైర్లు, విసిరిన రాళ్లు

సత్తెనపల్లి : ఒక్కసారిగా జరిగిన ఈ అలజడికి పట్టణవాసులు ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఘటనా స్థలికి చేరుకొని నిరసనకారుల్ని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయినా వారు వెనక్కి తగ్గలేదు సరి కదా.. ఆందోళనను మరింత తీవ్రతరం చేశారు. చేతికందినవన్నీ పోలీసులపై విసరడం మొదలు పెట్టారు. అంతే ఉన్నతాధికారులకు సీఐ

స్థలం : సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్
సమయం:
ఆదివారం సాయంత్రం 5.11 గంటలు
50 మందికి పైగా ఆందోళనకారుల గుంపు ఒక్కసారిగా దూసుకొచ్చింది.. ఓ చేతిలో ప్లకార్డులు .. మరో చేతిలో రాళ్లు ... పోలీసులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు. తాలూకా సెంటర్లో నడిరోడ్డుపై మంట పెట్టిన టైర్లు.. ఎటుచూసినా భయానక వాతావరణం..

శ్రీనివాసరావు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాలతో డీఎస్పీ గుర్నాథ్‌బాబు ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ దళాలు, సివిల్, ప్రత్యేక సాయుధ దళాలు వ్యాన్లతో అక్కడికి చేరాయి.ముందుగా ఆందోళనకారులకు హెచ్చరికలు చేశారు. అయినప్పటికీ ఖాతరు చేయకపోవడంతో ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగి బాష్పవాయువును ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు వెనక్కి తగ్గక పోవడం.. పరిస్థితులు ఎంతకీ అదుపులోకి రాకపోవడంతో మరో వైపు ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైర్ చేసి హెచ్చరించారు. ఆందోళనకారుల్ని చెదరగొడుతూ గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ నేపథ్యంలో ఓ నిరసనకారుడికి బుల్లెట్ తగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో కుప్పకూలగా.. మరొకరు తలకు గాయాలై తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్ట్రెక్చర్‌పై వాహనంలో తరలించారు. అంబులెన్సుల హడావుడి.. పోలీస్ సైరన్ల శబ్దాలతో ఆ ప్రాంతమంతా తీవ్ర గందరగోళం నెలకొంది. ఆందోళనకారుల్ని అదుపులోకి తీసుకొని పోలీసులు వారిని వాహనాల్లో తరలించారు.

కళ్లకు కట్టిన ప్రదర్శన

ఈ దృశ్యాలను చూస్తూ భీతావహులైన ప్రజలకు మైక్‌లో ఒక ఎనౌన్స్‌మెంట్ వినిపించింది. 'ఇది మాక్ డ్రిల్.. కౌంటింగ్ నేపథ్యంలో ఏమైనా హింసాత్మక ఘటనలు జరిగితే ఎలా ఎదుర్కోవాలో వివరించడంలో భాగంగా పోలీసులు చేసిన సన్నాహక కార్యక్రమం' అని పోలీసులు ప్రకటించడంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అంతవరకు 'నటించిన' పోలీసులు అక్కడి నుంచి నిష్క్రమించారు. పట్టణంలో పోలీసులు చేపట్టిన నమూనా ప్రదర్శన ఇది. పేరుకే మాక్ డ్రిల్ అయినప్పటికీ వాస్తవాలను కళ్లకు కట్టింది.


మాట్లాడుతున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ రామచంద్రరాజు, పక్కన క్రైం అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, డీఎస్పీ గుర్‌నాథ్‌బాబు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అల్లర్లకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఏఆర్ అడిషనల్ ఎస్పీ రామచంద్రరాజు అన్నారు. మాక్ డ్రిల్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అల్లర్లు, ఆందోళనలు, విధ్వంసాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తెలిపారు. ఇప్పటికే శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో లూజ్ విక్రయాలకు, పేలుడు పదార్థాలు, బాణసంచా విక్రయాలకు సైతం అనుమతి లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత మరో మూడు రోజులు 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ కూడా అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రదర్శనలు, అల్లర్లు, గుమికూడటం చేయరాదని సూచించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లపై కూడా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే నరసరావుపేటలో ఒకరిపై చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్రైం అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు, ఏఆర్ డీఎస్పీ గాంధీ, సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు, సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్, ఎస్ఐలు ఎం. సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.


నేలకొరిగిన ఆందోళనకారుడిని స్ట్రెచ్చర్ పైకి చేరుస్తున్న పోలీసులు


గాయపడిన ఆందోళనకారులను పోలీస్ వాహనం ఎక్కిస్తున్న పోలీసులు


సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో విధ్వంసం సృష్టిస్తున్న ఆందోళనకారులు

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.1.01 లక్షల విరాళం


నగదును కమిటీ సభ్యులకు అందిస్తున్న రఘుపతి కుటుంబ సభ్యులు

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి బండే రఘుపతి-లక్ష్మీ దంపతులు రూ.1,0,1,116 నగదును విరాళంగా అందించారు. ఆదివారం ఈ నగదును కమిటీ సభ్యులకు అందించారు. పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి తమ సహాయం అందించడం ఆనందంగా ఉందని రఘుపతి దంపతులు తెలిపారు.

జగన్ సీఎం కావాలంటూ మోకాళ్లపై నడుస్తూ ప్రార్థనలు


గుణదల మేరీమాత చర్చి వద్ద మోకాళ్లపై ప్రార్థనలు చేస్తున్న బెజ్జం రవికుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా, వెలంపల్లి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలవాలని కోరుతూ ఆదివారం వైఎస్సార్ సీపీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్, పార్టీ నాయకులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుణదల మేరీమాత చర్చి ప్రాంగణంలోని 14 స్థలాల ప్రదేశంలో ఇసుకలో మోకాళ్లపై నడుస్తూ ప్రార్థనలు చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి, వెలంపల్లి శ్రీనివాసరావు చిత్రపటాలను చేతపట్టుకుని ఏసుక్రీస్తును ప్రార్థిస్తూ 14 స్థలాల మీదుగా మోకాళ్లపై నడుచుకుంటూ చర్చివద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రార్థనలు చేసి చర్చి పాస్టర్ల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా బెజ్జం రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, సంక్షేమ పథకాల ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి సీఎం కావాలని తాము మోకాళ్లపై చర్చివద్దకు చేరుకుని ప్రార్థనలు చేశామన్నారు. అనంతరం చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

మంగళగిరికి చెందిన భార్యాభర్తలు మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలిద్దరూ దుర్మరణం చెందారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీవ్‌గాంధీ పార్కు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ మున్నీర్ బాషా(59) ఎనికేపాడులోని వస్త్ర దుకాణం గోడౌన్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య జరీనా(55), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరికీ వివాహం అయ్యింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అతను తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై పని మీద నగరానికి వచ్చాడు. రాత్రి 7.30 గంటల సమయంలో సీతమ్మ వారి పాదాలు వైపు నుంచి బస్టాండ్ వైపు వెళ్తున్నారు. రాజీవ్‌గాంధీ పార్కు సమీపానికి రాగానే కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదుగా బస్టాండ్ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అతివేగంగా వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలిద్దరూ కిందపడిపోయి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. బస్సు అంతటితో ఆగకుండా ముందు వెళ్తున్న రెండు కార్లను, ఒక మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఆ వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత బస్సు బస్టాండ్ ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. వెంటనే బస్సు డ్రైవర్ దిగి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మున్నీర్‌బాషా, జరీనా మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాదస్థలంలో చెల్లాచెదురుగా మృతదేహాలు

ఆర్టీసీ బస్సు ఢీకొని 8 గేదెలు, దూడ మృతి

పశువుల యజమానికి, ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం

తాడేపల్లిరూరల్: ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో 8 చూడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో లేగ దూడ మృతిచెందిన ఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి రూరల్‌పరిధిలో జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. చిర్రావూరు గ్రామానికి చెందిన వీరిశెట్టి బాజీ పశువుల పెంపకంతో తమ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే గ్రామంలో ఉండే బాజీ చెల్లెలు పసుపులేటి నాగులు కూడా రెండు గేదెలను మేపుకొంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ కొడుకును చదివించుకుంటోంది. నాగులు కుమారుడైన వెంకటసాయి తేజ కాలేజీకి సెలవులు కావడంతో మేనమామ వీరిశెట్టి బాజీవి, వారి సొంతవైన మొత్తం 15 గేదెలను మేపేందుకు తీసుకువెళ్లాడు. అన్ని గేదెలు చూడివి కావడంతో రాత్రి 7 గంటల వరకు మేపి గుండిమెడ శివారు నుంచి చిర్రావూరుకు తోలుకువస్తుండగా చిర్రావూరు గ్రామ శివారులో అతివేగంగా వచ్చిన గవర్నర్‌పేట డిపో-1కు చెందిన ఆర్టీసీ బస్సు 15 గేదెలను ఢీకొంది. ఈ సమయంలో 8 గేదెలు, దూడ అక్కడికక్కడే మృతి చెందాయి. పశువులు కాయడానికి వెళ్లిన డిగ్రీ విద్యార్థి వెంకటసాయి తేజ ప్రాణాలు రక్షించుకునేందుకు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూకాడు.

అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు..

చిర్రావూరు గ్రామ శివారులో మలుపుతిరిగిన తరువాత బస్సు డ్రైవర్ వేగాన్ని పెంచి గ్రామ శివారులో ముందు ఒక కారును ఢీకొట్టబోయాడు. అనంతరం 250 మీటర్ల దూరంలో బస్సుకు కుడివైపు నడుస్తున్న పాడిపశువులను ఢీకొట్టాడు. అక్కడి నుంచి 1000 మీటర్లు వెళ్లి బస్సును ఆపి డ్రైవర్ పారిపోబోగా.. అటు నుంచి వస్తున్న కొంతమంది డ్రైవర్‌ను పట్టుకుని చిర్రావూరు గ్రామస్తులకు అప్పగించారు.

రూ.10 లక్షలు నష్టం..

మృతిచెందిన గేదెలలో 7 గేదెలు వీరిశెట్టి బాజీవి కాగా, ఒక గేదె ఒక దూడ నాగులువి. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని, గేదెలన్నీ చూడిమీద ఉన్నాయని, మరో రెండు మూడు రోజుల్లో మూడు గేదెలు ఈనతాయని బాజీ బోరున విలపిస్తూ తెలిపాడు. మరో ఆరు గేదెలకు కాళ్లు, కొమ్ములు విరిగిపోయాయని, అందులో రెండు గేదెలు చనిపోతాయని, ఆ గేదెలు కూడా చనిపోతే మరో రూ.3 లక్షలు నష్టం వాటిల్లుతోందని బాజీ ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం..

నూతక్కి నుంచి విజయవాడ బస్టాండ్‌కు వెళుతున్న గవర్నర్‌పేట డిపో బస్సులో ప్రమాదం జరిగే సమయంలో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు అతివేగంతో వచ్చి గేదెలను ఢీకొన్న సమయంలో మూడు అడుగుల వరకు పైకి లేచిందని ప్రయాణికులు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా పంటకాలువల బోదెలు ఉన్నాయి. బస్సు అదుపుతప్పి ఆ బోదెలలో పడి ఉంటే పెను ప్రమాదం జరిగేదని గ్రామస్తులు తెలిపారు.

- తాడేపల్లి ఎస్ఐ రమేష్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, చిర్రావూరులో ఉన్నటువంటి ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. జరిగిన సంఘటనపై గేదెల యజమాని వీరిశెట్టి బాజీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



నీతోనే నేను.. నాతోనే నీవు

సీతమ్మ మనసు ఆమె దగ్గర లేదు. రాముడి దగ్గర ఉంది. రాముడి మనసు ఆయన దగ్గర లేదు. సీతమ్మ దగ్గర ఉంది. అందుకే ఇద్దరూ అలా కలిసి ఉండగలిగారు' అంటాడు హనుమ రామాయణంలో. ఎలా కలిసి ఉన్నాం.. అన్న దాని కన్నా, ఎంతకాలం కలిసి ఉన్నాం.. అన్న దాని కన్నా, ఎంతగా మనసులు ఒక్కటిగా చేసుకుని బతికామన్నది దాంపత్యంలో ప్రధానం.

ఒకప్పుడు కంచి మహాస్వామి తీర్థం ఇస్తున్నారు. భక్తులు వాళ్ళ కష్టాలు చెప్పుకుంటే ఆయన సందర్భాన్ని బట్టి అనుగ్రహిస్తూ ఉండేవారు. అలా ఒకరోజు తీర్థమిస్తూ ఒక ముసలామెను 'ఏమమ్మా, ఏమిటి చెప్పు' అన్నారు. 'నా కన్నా ముందు నా భర్తగారు పోయేటట్లు ఆశీర్వదించండి' అన్నది. ఆయన ఒక్కసారి ఆశ్చర్యపోతూ ఎందుకలా! అనడిగారు.

''స్వామీ! ఏమని చెప్పను. ఆయనది పసిపిల్లవాడి చాపల్యం. మూర్ఖత్వం. ఏదీ తెలియని అమాయకత్వం. నేనున్నంతకాలం ఆయనకు ఏ లోటూ లేదు. రానీయను కూడా. ఇద్దరికీ వయసయిపోయింది. ఆరోగ్యం కుదురుగ్గా ఉండడం లేదు. నేను ముందుపోతే తరువాత ఆయన పరిస్థితి ఏమిటా అన్నదే నా దిగులు. ముందు ఆయన వెళ్ళిపోతే నేనెలాగూ వదిలి ఉండలేను. వెనకే నేనూ పోతా. అందుకని ముందు ఆయన పోయేట్టు అనుగ్రహించండి' అని వేడుకుంది.

అంతటి మహాస్వామికి కూడా కళ్ళు చెమ్మగిల్లాయి. అందరివంకా చూసి ఇదీ భారతీయ దాంపత్యం.. అన్నారు. ఎంత తప్పు చేసినా ఉద్ధరించుకోవడమే తప్ప చేయి వదిలిపెట్టడం అనే మాట అన్వయం కాని ధర్మం ఇది. దానికి ప్రత్యక్ష సాక్ష్యం – అహల్య ఉపాఖ్యానం. భార్య దోషమే చేసిందని తెలిసినా ఆ దోషం చేయడానికి కారణమయిన మానసిక ఉద్వేగాలను దూరంగా ఉంచుకుని..''...వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ..'' నువ్వు తపస్సు చేత పవిత్రమై, మళ్ళీ నా పక్కన స్థానాన్ని పొందు. పునీతవు కా..'' అని అహల్యను ఉద్ధరించుకున్నాడు తప్ప ఆమెను విడిచిపెట్టేస్తున్నా.. అన్న మాట మాత్రం గౌతమ మహర్షి అనలేదు. అదీ గృహస్థాశ్రమ వైశిష్ట్యం. ఇటువంటి ధర్మానికి రెండు చేతులెత్తి నమస్కారం చేయాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వివాహం అయిపోయిన తరువాత ప్రదానం చేసేటప్పుడు భర్త భార్యతో ''నువ్వు నన్ను నీ పదవ కుమారుడిగా చేసుకుంటావా?'' అని అడుగుతాడు. భర్త పదవ కుమారుడు ఎట్లా అవుతాడు? మలి వయసులో శరీరం పట్టు తప్పుతుంటుంది. పెంకితనం ఏర్పడుతుంది. అహం పెరుగుతుంది. అప్పుడు నీ పిల్లలను చూసినట్లు నన్ను చూస్తావా... అని అడుగుతాడు.

రామాయణంలో సీతమ్మ .. ''ఇక్కడ రాజప్రాసాదంలో ఎన్ని సుఖాలయినా ఉండనీయవయ్యా రామా, నన్ను అరణ్యవాసానికి వద్దంటావేమిటి ! ..'' అంటూ ''నాతంత్రీ వాద్యతే వీణా, నా చక్రో వర్తతే రథః / నా పతిః సుఖమేధేత యా స్యాదపి శతాత్మజా...'' అంటుంది. నా కొడుకులు నన్ను పువ్వుల్లో పెట్టుకుని చూసుకున్నా, నువ్వు లేని నాడు నాకు తృప్తిలేదు. అది అరణ్యమయినా నువ్వున్న చోటే నా చోటు..'' అంటుంది. ఆశ్రమాల్లో గృహస్థాశ్రమం అంత గొప్పది. దానికి కారణం ప్రేమ ఒక్కటే కాదు. అంతర్లీనంగా ధర్మం ఉంటుంది. దానిలో దంపతులు తరించిపోతారు.

మంచిమాట



సానుకూల దృక్పథం

అంతా మన మంచికే అనే మంత్రి గారి కథ అందరికీ తెలిసినదే. '' అంతా మన మంచికే'' అనే మంత్రిగారు రాజుగారి చిటికెన వేలు తెగితే కూడా అదే మాట అని చెరసాల పాలు అయ్యారు. వేటకి వెళ్ళిన రాజుని ఆటవిక జాతివారు తమ దేవతకు బలి ఇవ్వబోయారు. చిటికెనవేలు లేకపోవటంతో అంగవైకల్యం ఉన్న వ్యక్తి బలికి పనికి రాడు అని వదిలిపెట్టారు. రాజు తిరిగి వచ్చి మంత్రిని విడుదల చేసి, ''నాకు మీ రన్నట్టు మంచే జరిగింది, మీకు ఏం మంచి జరిగింది?'' అని అడిగాడు. అందుకు మంత్రి ''అది కూడా నా మంచికే జరిగింది. చెరసాలలో లేకపోతే తప్పకుండా మీతో వేటకి వచ్చేవాడిని. అంగవైకల్యం ఉన్న మిమ్మల్ని వదిలేసి అప్పుడు ఏ అవయవ లోపమూ లేని నన్ను బలి ఇచ్చేవారు'' అని చెప్పాడు.

ఇది అతి మామూలు కథ. కానీ, దేనినైనా సానుకూల దృక్పథంతో ఎట్లా చూడాలి, దాని వల్ల ప్రయోజనం ఏమిటి? అన్న విషయాలు అర్థం అవుతాయి.

కొన్ని ఆ క్షణాన ఇబ్బంది కలిగించేవిగా, అయిష్టంగా అనిపించ వచ్చు. కానీ, మనకి ఏది మంచో మనకన్నా ప్రకృతికే బాగా తెలుసు. ఆ ప్రకృతినే విశ్వం అని, దైవం అని, ఎనర్జీ అని రకరకాల పేర్లతో పిలుస్తూ ఉంటారు. వేసవి కాలంలో ఎటువంటి పళ్ళు, కూరలు ఆరోగ్యానికి మంచివో వాటినే ఇస్తుంది ప్రకృతి. వర్షాకాలంలో మామిడిపళ్ళు తినాలి అనిపించినా దొరకవు. ఎందుకో తెలుసా? ఆ వాతావరణానికి మామిడి పండు తినటం ఆరోగ్యానికి మంచిది కాదు. దొరికితే మామిడిపండు తినకుండా ఉండలేం. మన మంచికోసం దొరక కుండా చేసింది ప్రకృతి.

ఈ దృక్పథం అలవాటయిన వారికి జీవితం కష్టాలమయంగా కనిపించదు. దేనినైనా తేలికగా తీసుకొని ముందుకి సాగటం ఉంటుంది. అట్లా అయితే వారి జీవితాల్లో కష్టాలు ఉండవా? ఉంటాయి, కానీ కన్నీళ్ళు ఉండవు. కష్టపడకుండా ఏదీ లభించదు. అది భౌతికమైనది. దాన్ని ఏదోవిధంగా దాటవచ్చు. మనస్సుకి ఎక్కించుకుంటే వేదన మిగులుతుంది.

ఆ కాస్త ఇబ్బందిని అయినా ఎందుకు భరించాలి? అనే సందేహం వస్తుంది. కానీ మనం ఆ పరిస్థితిని మార్చలేము కదా! అప్పుడు కూడా అంతా మన మంచికే అనుకుంటే అద్భుతం జరుగుతుంది. దీని వల్ల మంచే జరుగుతుంది అనే సానుకూల భావన వల్ల మన మనసు సానుకూల భావతరంగాలను ప్రసరింప చేస్తుంది. భావతరంగాలు పరిసరాలని, పరిస్థితులని, వ్యక్తులని కూడా ప్రభావితం చేస్తాయి. దానివల్ల ముందుగా వాతావరణం, తరువాత మనస్సు ప్రశాంత మవుతాయి. పరిస్థితులు చక్కబడతాయి. దానికి కారణం నెమ్మదించిన మనస్సు. ఆధ్యాత్మిక గ్రంథాలు మాత్రమే కాదు, ఎఖార్ట్ వంటి ఆధునిక మనస్తత్వశాస్త్రవేత్తలు కూడా ఆలోచనని అనుసరించే పరిస్థితులు ఉంటాయి అని ప్రయోగాత్మకంగా నిరూపించారు. వేలికి దెబ్బ తగిలింది అని బాధపడటం కన్న చెయ్యి, కాలూ బాగున్నందుకు సంతోషించటం నేర్చుకోవాలి. సరైన చెప్పులు లేవని ఏడుస్తున్న కొడుకుకి కాళ్ళు లేని వాడిని చూపించాడుట తండ్రి. అప్పుడు లోటు ఉన్నా బాధ పడటం ఉండదు. సంతోషమే ఉంటుంది. సంతోషంగా ఉంటే 'హాపీ హార్మోనులు' విడుదల అవుతాయి. సంతోషం, ఆనందం బాహ్యమైన వస్తువులు, పరిస్థితుల పైన కాక దృక్పథం మీద ఆధార పడి ఉంటాయి.

పురుటి నొప్పులు పడనిదే శిశువు లోకంలో అడుగు పెట్టటం కుదరదు. బిడ్డ చిరునవ్వు చూడగానే నొప్పుల సంగతి మరపుకి వస్తుంది. సాన పెట్టనిదే వజ్రం మెరవదు. నమలనిదే పదార్థం రుచి తెలియదు. గంధపుచెక్కని అరగదీయనిదే మంచిగంధం రాదు. చివరికి కుంకుడుకాయ రసం కావాలి అన్నా గట్టిగా పిసకాలి. ఇతర పళ్ల రసం గురించి చెప్ప నక్కర లేదు. గట్టిగా పిండనిదే రసం రాదు. ఈ కష్టం మెఋగుదల కోసమే అని అర్థం చేసుకుంటే సమస్య లేదు. దానిని కూడా వ్యాయామం మొదలైనవి చేసినప్పుడు పొందే సుఖం లాగా ఆనందించవచ్చు.

– డా. ఎన్. అనంత లక్ష్మి

తాత్త్వికకథ



లెక్కలు రాని పండితులు..!

ఒక ఊర్లో ఓ పండితుడు ఉండేవాడు. సులభశైలిలో గణితాన్ని బోధించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. అతడి శిష్యులు అనేక మంది గణితం బాగా నేర్చుకుని పెద్ద కొలువులు సంపాదించడం అతడిలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

ఎక్కడికి వెళ్ళినా... తన శిష్యులు కనిపిస్తే గణితానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలు వేసేవాడు. వారిచేత సరైన సమాధానాలు రప్పించేవాడు. పక్కనున్నవారితో నా శిష్యులందరూ 'లెక్కల్లో గొప్పోళ్ళు' అని చెప్పి గొప్పలు పోయేవాడు.

అతడికి తెలివైన భార్య ఉండేది. వారిద్దరూ ఓ పౌర్ణమి రోజున సత్సంగం కోసమని మారుమూల పల్లెటూరుకు వెళ్ళారు. అక్కడ పని ముగించుకుని ఇంటికి వస్తూ ఉంటే రాత్రయ్యింది. వారికి దారిలో ఓ యువతి కనిపించింది. ఆ యువతి తన చంకన చంటిబిడ్డను ఎత్తుకుని ఉంది. చందమామను చూపిస్తూ 'చందమామ రావే, జాబిల్లి రావే...' అని పాడుతూ చంటిబిడ్డకు గోరుముద్దలు తినిపిస్తోంది.

పండితుడిని చూసిన ఆ యువతి తన గ్రామంలోకి వచ్చిన వ్యక్తి తన గురువని గుర్తించింది. 'నేను మీ శిష్యురాలను' అని చెప్పి గౌరవపూర్వకంగా నమస్కరించింది. మీవల్ల కష్టమైన లెక్కలను ఇష్టంగా చేయగలిగామని ప్రశంసించింది.

గర్వంగా భార్యవైపు చూశాడు పండితుడు.

అలవాటు ప్రకారం పండితుడు తన భార్యతో 'నా శిష్యురాలి చేత గణితశాస్త్రంలోని ప్రశ్న ఒకటి వేసి సమాధానం తెప్పించమంటావా?'' అని అడిగాడు.

చిన్న నవ్వు నవ్విన భార్య ''గణిత శాస్త్ర ప్రావీణ్యత తెలియజేసే ప్రశ్నలు వద్దు. ఇప్పటివరకు మీ శిష్యురాలు తన బిడ్డకు ఎన్ని ముద్దలు పెట్టిందో లెక్క చెప్పమనండి చాలు!'' అని అడిగింది.

'అదెంత పని?' అని భావించిన ఆ పండితుడు తన శిష్యురాలిని సమాధానం చెప్పమన్నాడు.

తెలియదన్నట్టుగా ఆమె అడ్డంగా తల ఊపింది.


తల్లి తల ఊపడం చూసి ఏదో అర్థమైనవాడిలా బోసినవ్వులు నవ్వాడు చంటిబిడ్డ.

వెంటనే పండితుడి భార్య ''బిడ్డలకి గోరు ముద్దలు తినిపించే ఏ అమ్మకీ లెక్కలు రావండీ. ఏ తల్లీ లెక్కవేసుకుని తినిపించదు. బిడ్డ ఒక ముద్ద తింటాడంటే పది ముద్దలు పెట్టాలని చూస్తుంది తల్లి. లెక్కవేస్తే తన దిష్టే తగిలి బిడ్డ తినడం తగ్గించేస్తాడేమోనని ఆలోచిస్తుంది. ఆ తల్లి ప్రేమ ముందు ఏ లెక్కలూ పనిచేయవు, ఏ లెక్కలూ పనికిరావు'' అని వివరించింది.

ఆశ్చర్యపోయాడు పండితుడు. కొద్దిసేపటికి తేరుకుని 'ఏ తల్లీ లెక్కలు, కొలతలు వేసి బిడ్డను ప్రేమించదు. తెలిసిన లెక్కలు సైతం తల్లి ప్రేమ ముందర మాయమైపోతాయి' అని గుర్తించి అక్కడినుంచి కదిలాడు ఆ పండితుడు.

– ఆర్. సి. కృష్ణస్వామి రాజు

సినిమా



● కని కస్రుతి, చాయా కదమ్, పాయల్ కపాడియా, దివ్య ప్రభ

ఆ ముగ్గురు మహిళలకు ధన్యవాదాలు

– దర్శకురాలు పాయల్ కపాడియా

● కాన్స్ చిత్రోత్సవాల్లో 'తొలి' రికార్డులతో సత్తా చాటిన భారత ఫిల్మ్ మేకర్స్

● 'గ్రాండ్ ప్రిక్' అవార్డుతో మెరిసిన భారత దర్శకురాలు పాయల్ కపాడియా

కాన్స్ చిత్రోత్సవాల్లో భారతదేశం చరిత్రలో చెప్పుకునేలా సత్తా చాటింది. ఈ మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న 'భారతీయ సినిమా' కాన్స్‌లో మెరిసింది. తొలి గ్రాండ్ ప్రిక్స్ అవార్డును మన దేశ దర్శకురాలు పాయల్ కపాడియా తెచ్చారు. ప్రతిష్ఠాత్మక పియరీ ఏంజెనీ అవార్డును అందుకున్న తొలి ఏషియన్‌గా ఛాయాగ్రాహకుడు-దర్శక–నిర్మాత సంతోష్ శివన్ సగర్వంగా దేశానికి తిరిగొచ్చారు. 'అన్‌సర్టెన్ రిగార్డ్' విభాగంలో అనసూయ సేన్ గుప్తా 'ది షేమ్‌లెస్' చిత్రానికిగాను ఉత్తమ నటి అవార్డును దక్కించుకున్నారు. ఇదే విభాగంలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఫిల్మ్ మేకర్ సంధ్యా సూరి దర్శకత్వంలో రూపొందిన 'సంతోష్' ప్రదర్శితమైంది. కానీ అవార్డు దక్కించుకోలేకపోయింది. ఇక చిదానంద ఎస్. నాయక్ దర్శకత్వం వహించిన కన్నడ లఘు చిత్రం 'సన్‌ఫ్లవర్స్ వేర్ ది ఫస్ట్ వన్స్ టు నో' 'లా సినిఫ్' విభాగంలో మొదటి బహుమతి పొందింది. అలాగే 'బన్నీహుడ్' అనే మరో భారతీయ యానిమేటెడ్ మూవీ మూడో బహుమతి సాధించింది. ఇలా ఈసారి 77వ కాన్స్ చిత్రోత్సవాల్లో భారత దేశం హవా కనిపించింది. మే 14న ఆరంభమైన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ముగిసింది. దర్శకురాలు పాయల్ కపాడియా అందుకున్న అవార్డు విశేషాలతో పాటు మరిన్ని విషయాలు ఈ విధంగా...

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ చిత్రం 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' సినిమా సత్తా చాటింది. గ్రాండ్ ప్రిక్ విభాగంలో అవార్డు సాధించింది. కాన్స్ చిత్రోత్సవాల్లోని ఈ ప్రధాన విభాగంలో అవార్డు సాధించిన తొలి భారతీయ చిత్రంగా 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చరిత్ర సృష్టించింది. కాగా ఈ ఫెస్టివల్‌లో ప్రతిష్ఠాత్మక విభాగమైన పామ్ డి ఓర్ అవార్డుకు కూడా 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రం పోటీలో నిలిచినప్పటికీ, అవార్డును అందుకోలేకపోయింది. అయితే దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఈ విభాగంలో 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' రూపంలో ఓ భారతీయ చిత్రం పోటీలో నిలవడం ప్రశంసించదగ్గ విషయం. ఇక పామ్ డి ఓర్ విభాగంలో దాదాపు ఇరవై సినిమాలను వెనక్కి నెట్టి, సీన్ బేకర్ దర్శకత్వం వహించిన కామెడీ డ్రామా 'అనోరా' అవార్డును ఎగరేసుకుపోయింది. 'గ్రాండ్ టూర్' సినిమాకు గాను మిగ్యుల్ గోమ్స్ ఉత్తమ దర్శకుడిగా, 'కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్' సినిమాలోని నటనకు గాను జెస్సీ ప్లేమోన్స్ ఉత్తమ నటుడి అవార్డు అందుకున్నారు. క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'ఎమిలియా పరేజ్'లో నటించిన అడ్రియానా పాజ్, కర్లా సోఫియా, సెలెనా గోమేజ్, జో సల్దానాలు ఉత్తమ నటీమణులుగా నిలిచారు. జాక్వెస్ డియార్డ్ నటించిన ఈ సినిమాకే జ్యూరీ ప్రైజ్ దక్కడం విశేషం. చిత్రోత్సవాల తొలి రోజు హాలీవుడ్ నటి మెరిల్ స్ట్రీప్, ఆ తర్వాత జపాన్‌కు చెందిన యానిమేషన్ స్టూడియో 'స్టూడియో ఘిబ్లి' ప్రతిష్ఠాత్మక పామ్ డి ఓర్ అవార్డు అందుకోగా చివరి రోజు హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ లూకాస్ స్వీకరించారు.

''నిజానికి స్క్రిప్ట్ రాసేటప్పుడు కంగారుపడ్డాను. ఆ కంగారులో ఏదో రాశాను (నవ్వుతూ). మా సినిమాని ఇక్కడ వరకూ తీసుకొచ్చిన 'కాన్స్'కి థ్యాంక్స్. దయచేసి మరో భారతీయ చిత్రం కోసం 30 ఏళ్లు వేచి ఉండొద్దు'' అని అవార్డు అందుకున్న అనంతరం పాయల్ కపాడియా అన్నారు. వేదిక మీద ఉన్న ఈ మూవీలో నటించిన కనీ కస్రుతి, దివ్య ప్రభ, చాయా కదమ్‌లను ఆత్మీయంగా హత్తుకుని, ''తమ సొంత సినిమాలా భావించి చేసిన ఈ ముగ్గురు మహిళలకు ధన్యవాదాలు'' అన్నారు. ఇంకా ఈ చిత్ర నిర్మాతలు, భాగస్వాములు, ఇతర యూనిట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అది మాత్రమే కాదు... ఈ ఏడాది కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ తొలి రోజు ఫెస్టివల్ వర్కర్లు మెరుగైన వేతనాలు డిమాండ్ చేస్తూ చేసిన నిరసనకు మద్దతు తెలిపారు. పాయల్ మళ్లీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ – ''నేను తీసిన ఈ సినిమా ముగ్గురి మహిళల స్నేహం నేపథ్యంలో ఉంటుంది. అయితే మహిళలు ఎక్కువగా ఒకరికొకరు గోతులు తీసుకుంటారు. సమాజం అలానే చిత్రీకరించింది. అది దురదృష్టకరం. కానీ స్నేహం అనేది నాకు ముఖ్యమైన బంధం. ఎందుకంటే అది గొప్పతనానికి దారి తీస్తుంది. కలుపుగోలుతనాన్ని పెంచుతుంది. ఈ విలువలను కాపాడుకోవడానికి మనం ప్రయత్నిస్తుండాలి'' అన్నారు. ఆమె అవార్డు తీసుకురావడం పట్ల భారత ప్రధాని మోదీ, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా హర్షం వ్యక్తం చేశారు.

పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్'. కని కస్రుతి, దివ్య ప్రభ, చాయా కదమ్ లీడ్ రోల్స్‌లో ఈ సినిమాను థామస్ హాకీమ్, జూలియన్ గ్రాఫ్ నిర్మించారు. కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ నెల 23న ఈ చిత్రం ప్రదర్శితమైంది. కాగా పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్‌కే కాన్స్‌లోని ఓ ప్రధాన విభాగమైన గ్రాండ్ ప్రిక్ అవార్డు రావడం విశేషం. అయితే కాన్స్‌లో పాయల్ ప్రతిభ మెరవడం ఇదే తొలి సారి కాదు. 2021లో జరిగిన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఆ ఏడాది గోల్డెన్ ఐ అవార్డు పాయల్‌కు దక్కింది. అలాగే 2017లో జరిగిన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన షార్ట్ ఫిల్మ్ 'ఆఫ్టర్ నూన్ క్లౌడ్' ప్రదర్శితమైంది.

'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' కథ ఏంటంటే... కేరళ నుంచి ముంబైకి వెళ్లి నర్సులుగా పని చేస్తుంటారు ప్రభ (కని కస్రుతి), అను (దివ్య ప్రభ). భర్తతో విడిపోయిన ప్రభకు ఓ గిఫ్ట్ వస్తుంది. ఆ గిఫ్ట్‌ను ఆమె భర్త పంపిస్తాడు. దీంతో ప్రభకు కొత్త సమస్యలు ఎదురవుతాయి. మరోవైపు అను తన రిలేషన్‌షిప్‌లో ఇబ్బందులకు లోనవుతుంది. ఆ తర్వాత ఈ ఇద్దరూ రోడ్ ట్రిప్‌కు వెళితే ఏం జరిగింది? అన్నదే కథ.



● విక్టోరియా

● జోయ్ కింగ్

● ఎల్లే ఫానింగ్

● ఫ్రెడరిక్ బెల్

● డెమి మూర్

కాన్స్ చిత్రోత్సవాల ముగింపు వేడుకల్లో మెరిసిన తారలు



రత్నమాల నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది – అంజలి

''నన్ను ఎక్కువగా పక్కింటి అమ్మాయి తరహా పాత్రల్లో చూడాలనుకుంటారు. కానీ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో నేను చేసిన రత్నమాల పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. 'ఈ పాత్రకు మీరే న్యాయం చేయగలరు' అని కృష్ణచైతన్య అన్నారు. ఇంత మంచి పాత్ర చేసినందుకు సంతోషంగా ఉంది'' అని అంజలి అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా, నేహా శెట్టి, అంజలి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణ చైతన్య దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ– ''రత్నమాల పాత్ర కోసం ఈ తరహా (మాస్) సంభాషణలు నా నోటి నుంచి రావడం ఇదే మొదటిసారి. చిత్రీకరణ, డబ్బింగ్ సమయంలో కొత్త అనుభూతి పొందాను. రత్నమాల నా సినీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర అవుతుంది'' అన్నారు. పెళ్లి గురించి అడిగితే – ''నా పెళ్లికి ఇంకా సమయం ఉంది. ప్రస్తుతానికి నా పెళ్లి గురించి వస్తున్న వార్తలన్నీ పుకార్లే'' అన్నారు అంజలి. ''ప్రస్తుతం 'గేమ్ చేంజర్'లో ఓ కథానాయికగా చేస్తున్నాను. తెలుగులో మరో సినిమా, తమిళ, మలయాళ సినిమాలు కూడా చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు అంజలి.

నాలో కొత్త కోణాన్ని చూపించిన చిత్రమిది

– నవదీప్



● నవదీప్, అవనీంద్ర

''ప్రస్తుతం అన్ని భాషల్లో కొత్త కంటెంట్‌తో సినిమాలు వస్తున్నాయి. అదే కోవలో తెలుగులో రాబోతున్న వైవిధ్యమైన సినిమా 'లవ్ మౌళి'. ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించే సినిమా ఇది. నా 20 ఏళ్ల సినీ కెరీర్ తర్వాత నాలో ఉన్న కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ చేసిన సినిమా ఇది'' అని నవదీప్ అన్నారు. నవదీప్ హీరోగా అవనీంద్ర దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ మౌళి'. పంఖురి గిద్వానీ, భావన సాగి, 'మిర్చి' హేమంత్, 'మిర్చి' కిరణ్ ఇతర పాత్రల్లో నటించారు. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సి స్పేస్ నిర్మించింది. ఈ చిత్రాన్ని జూన్ 7న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా అవనీంద్ర మాట్లాడుతూ– ''నేటి యువతరానికి కావాల్సిన అన్ని అంశాలు మా సినిమాలో ఉన్నాయి. ప్రేమలో ఉన్న వారి బంధాలు ఎలా ఉన్నాయి? నేటి యువతరం ప్రేమించి పెళ్లి చేసుకున్నా బ్రేకప్‌లు అవుతున్నాయి. రాజీ పడితే తప్ప బంధాలు నిలబడవా? అనే ప్రశ్నకు నాకు దొరికిన పరిష్కారాన్ని కూడా ఈ చిత్రంలో చూపించాం'' అన్నారు.

సస్పెన్స్... క్రైమ్



● విజయ్, రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, గడ్డం ప్రసాద్

ప్రముఖ దర్శకుడు విక్రమన్ కొడుకు విజయ్ కనిష్క హీరోగా నటించిన చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కె. కార్తికేయన్ దర్శకత్వంలో డైరెక్టర్ కేఎస్ రవికుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రీనివాస్ గౌడ్, బెక్కం రవీంద్ర రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్స్‌కి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, నటుడు మురళీమోహన్ ముఖ్య అతిథులుగా హాజరై, 'హిట్ లిస్ట్' విజయం సాధించాలన్నారు. కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ– ''1990లో వచ్చిన 'పుదు వసంతం' సినిమాతో విక్రమన్‌తో నాకు మంచి పరిచయం ఏర్పడింది. ఆయన తనయుడు విజయ్ కనిష్కని నేను హీరోగా లాంచ్ చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''మా సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు విజయ్ కనిష్క. ''మమ్మల్ని నమ్మి తెలుగులో రిలీజ్ చేసే చాన్స్ ఇచ్చిన కేఎస్ రవికుమార్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు శ్రీనివాస్ గౌడ్, బెక్కం రవీంద్ర.

ఎనిమిది మంది పనిని ఒక్కడే చేస్తుంటాడు

– విశ్వక్ సేన్

''పరాక్రమం' సినిమా ట్రైలర్ బాగుంది. నేను యానిమేషన్, ఎడిటింగ్ కోర్సులు చేస్తున్నప్పటి నుంచి మా సర్కిల్స్‌లో బండి సరోజ్ కుమార్ పేరు వింటున్నాను. ఆయన ఎనిమిది మంది పనిని ఒక్కడే చేస్తుంటాడు. ఈ సినిమా సరోజ్ కుమార్‌కు పెద్ద విజయం ఇవ్వాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. బండి సరోజ్ కుమార్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతి సమన్వి, నాగలక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, దర్శకులు బుచ్చిబాబు, జ్ఞానసాగర్ ద్వారక తదితరులు అతిథులుగా హాజరయ్యారు. బుచ్చిబాబు మాట్లాడుతూ– ''కన్నడ పరిశ్రమలో ఉపేంద్రగారు అన్ని ముఖ్యమైన విభాగాలు ఆయనే చేసుకుంటారు. అలా తెలుగులో సరోజ్ కుమార్ ఉన్నారు'' అన్నారు. ''నేను 2004లో జూనియర్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీకి వచ్చాను. పలు చిత్రాలు చేశా. 'పరాక్రమం' అన్ని వర్గాల ప్రేక్షకులు చూసేలా ఉంటుంది'' అన్నారు బండి సరోజ్ కుమార్.



● బుచ్చిబాబు, విశ్వక్ సేన్, సరోజ్‌కుమార్

ఆరెంజ్ క్యాప్
(అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్)

విరాట్ కోహ్లి (బెంగళూరు)
741 పరుగులు (15 మ్యాచ్‌లు)
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

పర్పుల్ క్యాప్
(అత్యధిక వికెట్లు తీసిన బౌలర్)

హర్షల్ పటేల్ (పంజాబ్ కింగ్స్)
24 వికెట్లు (14 మ్యాచ్‌లు)
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

ఎమర్జింగ్ ప్లేయర్

నితీశ్ కుమార్ రెడ్డి (సన్‌రైజర్స్ హైదరాబాద్)
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు
13 మ్యాచ్‌ల్లో 303 పరుగులు.
3 వికెట్లు. 2 అర్ధ సెంచరీలు.
21 సిక్స్‌లు, 15 ఫోర్లు.

మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్

సునీల్ నరైన్ (కోల్‌కతా నైట్‌రైడర్స్)
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు
15 మ్యాచ్‌ల్లో
488 పరుగులు
17 వికెట్లు
1 సెంచరీ, 3 అర్ధ సెంచరీలు

'బెస్ట్ క్యాచ్' ఆఫ్ ద టోర్నీ
రమణ్‌దీప్ సింగ్ (కోల్‌కతా)
ఫెయిర్ ప్లే అవార్డు
సన్‌రైజర్స్ హైదరాబాద్
అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్
అభిషేక్ శర్మ (సన్‌రైజర్స్)
16 మ్యాచ్‌ల్లో 42 సిక్స్‌లు
అత్యధిక ఫోర్లు కొట్టిన బ్యాటర్
ట్రావిస్ హెడ్ (సన్‌రైజర్స్)
15 మ్యాచ్‌ల్లో 64 ఫోర్లు

కోల్‌కతాకే కిరీటం

ఐపీఎల్ చాంపియన్ నైట్‌రైడర్స్

- మూడోసారి విజేతగా నిలిచిన జట్టు
- ఫైనల్లో సన్‌రైజర్స్‌కు తీవ్ర నిరాశ
- 8 వికెట్ల తేడాతో పరాజయం



సన్‌రైజర్స్ అభిమానులకు తీవ్ర వేదన... లీగ్ దశలో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఐపీఎల్‌కు కొత్త పాఠాలు నేర్పిన టీమ్ అదే బ్యాటింగ్ వైఫల్యంతో చివరి మెట్టుపై చతికిలపడింది. 8 బంతుల వ్యవధిలో అభిషేక్ శర్మ, హెడ్ లాంటి హిట్టర్లు వెనుదిరగ్గా... క్లాసెన్‌కు కూడా కాలం కలిసిరాని వేళ జట్టంతా కుప్పకూలింది. ఏ మూలకూ సరిపోని 114 పరుగుల లక్ష్యాన్ని కోల్‌కతా నైట్‌రైడర్స్ 63 బంతుల్లోనే ఛేదించేసి సంబరాలు చేసుకుంది. దశాబ్ద కాలం తర్వాత మూడో టైటిల్ అందుకొని సగర్వంగా నిలిచింది. ఎనిమిదేళ్ల తర్వాత ట్రోఫీ గెలవాలని ఆశించిన హైదరాబాద్ 2018 తరహాలో ఫైనల్‌కే పరిమితమై నిరాశలో మునిగింది. ఆసాంతం బ్యాటర్లు చెలరేగిన 2024 టోర్నీ చివరకు బౌలర్ల అద్భుత ప్రదర్శనతో ముగిసింది. విజేతగా నిలిచిన కోల్‌కతాకు రూ. 20 కోట్లు... రన్నరప్ హైదరాబాద్ జట్టుకు రూ. 12 కోట్ల 50 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి.


'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' స్టార్క్
అభిషేక్ బౌల్డ్

చెన్నై: పదేళ్ల తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) మళ్లీ ఐపీఎల్ చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం చెపాక్ మైదానంలో ఏకపక్షంగా సాగిన ఐపీఎల్ 17వ సీజన్ ఫైనల్ పోరులో కోల్‌కతా 8 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే ఆలౌటైంది. ఐపీఎల్ చరిత్రలో ఫైనల్ మ్యాచ్‌లో ఇదే అత్యల్ప స్కోరు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్)దే అత్యధిక స్కోరు. అనంతరం నైట్‌రైడర్స్ 10.3 ఓవర్లలో 2 వికెట్లకు 114 పరుగులు చేసి గెలిచింది. వెంకటేశ్ అయ్యర్ (26 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), రహ్మనుల్లా గుర్బాజ్ (32 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 45 బంతుల్లో 91 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

సమష్టి వైఫల్యం...

తొలి ఓవర్లో స్టార్క్ వేసిన అద్భుత బంతికి అభిషేక్ శర్మ (2) క్లీన్‌బౌల్డ్ కావడంతో మొదలైన సన్‌రైజర్స్ పతనం వేగంగా సాగింది. కోల్‌కతా కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు ఏ దశలోనూ హైదరాబాద్ తిరిగి కోలుకోలేకపోయింది. హెడ్ (0) తన వైఫల్యాన్ని కొనసాగిస్తూ ఆడిన తొలి బంతికి అవుటై మరో డకౌట్ ఖాతాలో వేసుకున్నాడు. త్రిపాఠి (13 బంతుల్లో 9; 1 ఫోర్) ఈసారి ఆదుకోలేకపోగా, నితీశ్ రెడ్డి (10 బంతుల్లో 13; 1 ఫోర్, 1 సిక్స్), షహబాజ్ (7 బంతుల్లో 8; 1 సిక్స్), అబ్దుల్ సమద్ (4) విఫలమయ్యారు. మరోవైపు మార్క్‌రమ్ (23 బంతుల్లో 20; 3 ఫోర్లు) పరుగులు తీయడానికి ఇబ్బంది పడగా... క్లాసెన్ (17 బంతుల్లో 16; 1 ఫోర్) కూడా భారీ షాట్లు ఆడలేకపోయాడు. 14 ఓవర్ల తర్వాత సన్‌రైజర్స్ స్కోరు 90/7. క్లాసెన్ క్రీజ్‌లో ఉండటంతో చివరి 6 ఓవర్లలోనైనా ఎక్కువ పరుగులు సాధించవచ్చని రైజర్స్ ఆశించింది. అయితే తర్వాతి బంతికే అతను బౌల్డ్ కావడంతో ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో కమిన్స్ కొన్ని పరుగులు జత చేసి స్కోరును 100 దాటించాడు.

ఫటాఫట్...

స్వల్ప ఛేదనలో కేకేఆర్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. నరైన్ (2 బంతుల్లో 6; 1 సిక్స్) ఆరంభంలోనే వెనుదిరిగినా... వెంకటేశ్, గుర్బాజ్ వేగంగా జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లారు. భువనేశ్వర్ ఓవర్లో వరుసగా 4, 6, 6 కొట్టిన వెంకటేశ్, ఆ తర్వాత నటరాజన్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6, 4 బాది లక్ష్యాన్ని మరింత సులువుగా మార్చేశాడు. 24 బంతుల్లోనే వెంకటేశ్ హాఫ్ సెంచరీ పూర్తయింది. విజయానికి 12 పరుగుల దూరంలో గుర్బాజ్ అవుటైనా... వెంకటేశ్, కెప్టెన్ శ్రేయస్ (3 బంతుల్లో 6 నాటౌట్; 1 ఫోర్) కలిసి ఆట ముగించారు.

ఐపీఎల్-17 బౌండరీ మీటర్

మొత్తం సిక్స్‌లు	మొత్తం ఫోర్లు
1260	2174

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి) స్టార్క్ 2; హెడ్ (సి) గుర్బాజ్ (బి) వైభవ్ అరోరా 0; త్రిపాఠి (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 9; మార్క్‌రమ్ (సి) స్టార్క్ (బి) రసెల్ 20; నితీశ్ కుమార్ రెడ్డి (సి) గుర్బాజ్ (బి) హర్షిత్ రాణా 13; క్లాసెన్ (బి) హర్షిత్ రాణా 16; షహబాజ్ (సి) నరైన్ (బి) వరుణ్ 8; సమద్ (సి) గుర్బాజ్ (బి) రసెల్ 4; కమిన్స్ (సి) స్టార్క్ (బి) రసెల్ 24; జైదేవ్ ఉనాద్కట్ (ఎల్బీ) (బి) నరైన్ 4; భువనేశ్వర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (18.3 ఓవర్లలో ఆలౌట్) 113.** **వికెట్ల పతనం:** 1-2, 2-6, 3-21, 4-47, 5-62, 6-71, 7-77, 8-90, 9-113, 10-113. **బౌలింగ్:** స్టార్క్ 3-0-14-2, వైభవ్ అరోరా 3-0-24-1, హర్షిత్ రాణా 4-1-24-2, నరైన్ 4-0-16-1, రసెల్ 2.3-0- 19-3, వరుణ్ చక్రవర్తి 2-0-9-1.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (ఎల్బీ) (బి) షహబాజ్ 39; నరైన్ (సి) షహబాజ్ (బి) కమిన్స్ 6; వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 52; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (10.3 ఓవర్లలో 2 వికెట్లకు) 114.** **వికెట్ల పతనం:** 1-11, 2-102. **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-25-0, కమిన్స్ 2-0-18-1, నటరాజన్ 2-0-29-0, షహబాజ్ 2.3-0-22-1, ఉనాద్కట్ 1-0-9-0, మార్క్‌రమ్ 1-0-5-0.

'తీన్'మార్ విజయ గాథ

నైట్‌రైడర్స్ రాత మార్చిన మెంటార్ గంభీర్, హెడ్ కోచ్ పండిత్

సరిగ్గా నెల రోజుల క్రితం ఏప్రిల్ 26... సొంత మైదానం ఈడెన్ గార్డెన్స్‌లో పంజాబ్‌తో మ్యాచ్‌లో కోల్‌కతా 261 పరుగులు సాధించి నిశ్చింతగా ఉంది. కానీ పంజాబ్ 2 వికెట్లు మాత్రమే కోల్పోయి మరో 8 బంతులు మిగిలి ఉండగానే 262 పరుగులతో ఐపీఎల్ రికార్డు లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. దాంతో కేకేఆర్ బౌలింగ్‌పై అందరికీ సందేహాలు వచ్చేశాయి. ఇలాంటి బౌలింగ్‌తో ముందంజ వేయడం కష్టమే అనిపించింది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా నైట్‌రైడర్స్ చెలరేగింది. సీజన్‌లో కోల్‌కతాకు అది ఎనిమిదో మ్యాచ్ కాగా, ఆ తర్వాత ఓటమి అనేదే లేకుండా టీమ్ సాగింది. తర్వాత 8 మ్యాచ్‌లలో 2 రద్దయిన మ్యాచ్‌లను వదిలేస్తే మరో 6 మ్యాచ్‌ల్లో గెలిచి టీమ్ విజేతగా నిలిచింది. లీగ్ దశలో 9 విజయాలతో అగ్రస్థానంలో నిలిచింది. టోర్నీ మొత్తంలో 3 మ్యాచ్‌లలోనే ఆ జట్టు ఓడింది. కానీ కేకేఆర్ టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం తమ ఆటగాళ్లపై నమ్మకం ఉంచింది. దానిని వారు వమ్ము చేయలేదు. జట్టులోని సభ్యులంతా ఏదో ఒక రూపంలో విజయాల్లో కీలక భాగస్వాములయ్యారు.

2022 సీజన్ కోసం జరిగిన వేలంలో కోల్‌కతా కొందరు కొత్త ఆటగాళ్లను తీసుకోవడంతో పాటు శ్రేయస్ అయ్యర్‌ను కూడా ఎంచుకొని తమ కెప్టెన్‌గా నియమించుకుంది. కానీ ఫలితం మాత్రం రాక ఏడో స్థానానికి పరిమితమైంది. గత ఏడాదైతే గాయంతో శ్రేయస్ దూరం కావడంతో నితీశ్ రాణా కెప్టెన్‌గా వ్యవహరించాడు. మళ్లీ ఏడో స్థానంతోనే సరి. ఈసారి కూడా సీజన్ ఆరంభానికి ముందు ఎలాంటి అంచనాలు లేవు. ఎప్పటిలాగే లీగ్ దశలో కొన్ని విజయాలు సాధించి ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశం లేదని అనిపించింది. వరుసగా విఫలమవుతున్నా... ఈ సీజన్‌కు కూడా నరైన్, రసెల్, నితీశ్ రాణాలాంటి ఆటగాళ్లను ఇంకా కొనసాగించడం ఏమిటని వినిపించింది. ఇక స్టార్క్ కోసం ఏకంగా రూ. 24 కోట్ల 75 లక్షలు చెల్లించడంతో అందరూ ఆశ్చర్యపోయారు! కానీ తుది ఫలితం మాత్రం అద్భుతంగా వచ్చింది. దశాబ్ద కాలం తర్వాత కేకేఆర్ మళ్లీ కప్‌ను ముద్దాడింది.


గంభీర్, పండిత్

ప్రత్యేకమైన బృందం కోల్‌కతా విజయంలో కీలకపాత్ర పోషించింది. తమకు కెప్టెన్‌గా రెండు టైటిల్స్ అందించిన గౌతమ్ గంభీర్ ఈసారి జట్టు మెంటార్‌గా వచ్చాడు. కోచ్‌గా 6 రంజీ ట్రోఫీలు గెలిచిన రికార్డు ఉన్న చంద్రకాంత్ పండిత్ టీమ్‌కు హెడ్ కోచ్ అయ్యాడు. మరోవైపు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కూడా కసి మీద ఉన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌ను తాను తొలిసారి ఫైనల్‌కు చేర్చినా... గాయం నుంచి కోలుకొని తిరిగొచ్చిన తర్వాత కెప్టెన్సీ ఇవ్వలేదని మూడేళ్ల క్రితం జట్టును వీడిన అతను గాయంతో గత సీజన్‌లో ఆడలేదు. పైగా భారత జట్టులో చోటు కోల్పోవడంతో పాటు బీసీసీఐ కాంట్రాక్ట్ కూడా చేజారింది. ఇలాంటి స్థితిలో నాయకుడిగా తన సత్తాను చూపేందుకు అతనికి సరైన అవకాశం వచ్చింది. దానిని అతను సమర్థంగా వాడుకున్నాడు. వ్యూహ ప్రతివ్యూహాలను డగౌట్‌లో గంభీర్, పండిత్ రచిస్తే మైదానంలో అతను దానిని సరిగ్గా అమలు పరిచాడు.

తొలి క్వాలిఫయర్‌లో స్టార్క్ వేసిన మొదటి ఓవర్‌ను ఎదుర్కొన్న హెడ్ డకౌటయ్యాడు. ఫైనల్‌కు వచ్చేసరికి వ్యూహం మారింది. ఈసారి తొలి ఓవర్‌ను అభిషేక్ శర్మ ఆడాడు. కానీ స్టార్క్ మళ్లీ అలాంటి బంతి, అదే తరహా క్లీన్‌బౌల్డ్! టోర్నీ మొత్తానికి హైలైట్‌గా నిలిచిన ఈ బంతి రైజర్స్ పతనానికి శ్రీకారం చుట్టింది. స్టార్క్ విలువేమిటో చూపించడమే కాదు, మానసికంగా కూడా స్టార్క్‌ను ఎదుర్కోవడంలో హెడ్ ఇబ్బంది పడ్డాడనేది స్పష్టం. రూ. 24 కోట్ల 75 లక్షల భారీ ట్యాగ్‌తో ఐపీఎల్‌లోకి అడుగు పెట్టిన స్టార్క్ ఆరంభంలో పూర్తిగా తడబడి భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. కానీ టోర్నీ సాగుతున్న కొద్దీ చెలరేగిన అతను అసలు సమయంలో సత్తా చాటాడు. తొలి క్వాలిఫయర్, ఫైనల్‌లలో అతని బౌలింగ్ చూస్తే స్టార్క్‌కు పెట్టిన విలువ గురించి మళ్లీ చర్చించకుండా అతడిని 'అమూల్యమైన' ఆటగాడిగా మార్చేసింది. 2012లో టైటిల్ గెలిచిన సభ్యుల్లో జట్టుదైన నరైన్ ఇప్పుడూ టీమ్‌లో భాగం కావడం విశేషం. 6.69 ఎకానమీతో 17 వికెట్లు తీయడమే కాదు, బ్యాటింగ్‌లోనూ ఏకంగా 180.74 స్ట్రయిక్‌రేట్‌తో 488 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవడం పెద్ద విశేషం. వరుణ్ చక్రవర్తి (21 వికెట్లు), రసెల్ (19), హర్షిత్ రాణా (19), అరోరా (11) తమ వంతు పాత్ర పోషించారు. పార్ట్‌టైమర్లు అంటూ లేకుండా ఆరుగురు రెగ్యులర్ బౌలర్లే కలిపి మొత్తం వికెట్లు పంచుకోవడం జట్టు బౌలింగ్ పదునును చూపించింది. బ్యాటింగ్‌లో సాల్ట్ (435), వెంకటేశ్ అయ్యర్ (370), శ్రేయస్ అయ్యర్ (351), రసెల్ (222) చెలరేగారు. రింకూ సింగ్ (168) ఆశించిన స్థాయిలో ఆడకపోయినా జట్టుపై దాని ప్రభావం పడలేదు. జట్టులో ఏ ఒక్కరిపైనో ఆధారపడకుండా సమష్టి ప్రదర్శనతోనే కోల్‌కతా విజేతగా నిలవగలిగింది. **–సాక్షి క్రీడా విభాగం**

5 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టైటిల్ గెలిచిన ఐదో భారతీయ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ గుర్తింపు పొందాడు. గతంలో ధోని (చెన్నై-5 సార్లు), గౌతమ్ గంభీర్ (కోల్‌కతా-2 సార్లు), రోహిత్ శర్మ (ముంబై -5 సార్లు), హార్దిక్ పాండ్యా (గుజరాత్-ఒకసారి) ఈ ఘనత సాధించారు.

3 చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ (5 సార్లు చొప్పున) తర్వాత అత్యధికంగా మూడుసార్లు ఐపీఎల్ టోర్నీ విజేతగా నిలిచిన జట్టుగా కోల్‌కతా గుర్తింపు పొందింది.

1 గత 16 ఐపీఎల్ టోర్నీ ఫైనల్స్‌లో ఏ జట్టు కూడా ఆలౌట్ కాలేదు. ఐపీఎల్ టోర్నీ ఫైనల్లో ఆలౌటైన తొలి జట్టుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలిచింది.

8 ఇప్పటి వరకు జరిగిన 17 ఐపీఎల్ ఫైనల్స్‌లో 8 సార్లు ఛేజింగ్ చేసిన జట్టు చాంపియన్‌గా నిలిచింది. తొమ్మిదిసార్లు తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు విజేతగా నిలిచింది.

4 ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీ మొత్తంలో బౌలర్లు ఒక్క హ్యాట్రిక్ కూడా నమోదు చేయలేకపోయారు. ఇలా జరగడం ఇది నాలుగోసారి. 2015, 2018, 2020 సీజన్‌లలో కూడా ఒక్క హ్యాట్రిక్ నమోదు కాలేదు.

14 ఐపీఎల్-2024లో మొత్తం నమోదైన సెంచరీలు. గత ఐపీఎల్ సీజన్‌లో అత్యధికంగా 12 సెంచరీలు వచ్చాయి.

చరిత్ర సృష్టించిన దీపా కర్మాకర్



తాష్కెంట్: ఆసియా సీనియర్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు తొలిసారి స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన మహిళల వాల్ట్ ఈవెంట్‌లో 30 ఏళ్ల దీపా కర్మాకర్ 13.566 పాయింట్లతో విజేతగా నిలిచింది. తద్వారా ఈ టోర్నీ చరిత్రలో పసిడి పతకం గెలిచిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా కొత్త చరిత్ర లిఖించింది. గతంలో దీపా ఈ టోర్నీలో 2015లో కాంస్య పతకం సాధించింది. భారత్‌కే చెందిన ఆశిష్ కుమార్ 2015లో ఫ్లోర్ ఈవెంట్‌లో కాంస్యం... ప్రణతి నాయక్ వాల్ట్ ఈవెంట్‌లో 2019లో, 2022లో కాంస్య పతకాలు సాధించారు.

న్యూయార్క్ చేరిన రోహిత్ బృందం

రెండో బ్యాచ్‌లో వెళ్లనున్న కోహ్లి, పాండ్యా

న్యూయార్క్: ఐసీసీ టి20 ప్రపంచకప్ ఆడేందుకు రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా అమెరికాలో అడుగు పెట్టింది. తొలి బ్యాచ్‌లో కెప్టెన్ సహా 11 మంది భారత ఆటగాళ్లు ఆదివారం న్యూయార్క్ చేరుకున్నారు. ఈ బృందంలో బుమ్రా, సిరాజ్, సూర్యకుమార్, రిషభ్ పంత్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లతో పాటు రిజర్వ్ ప్లేయర్లు శుబ్‌మన్ గిల్, ఖలీల్ అహ్మద్ ఉన్నారు. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, సహాయ సిబ్బంది జట్టుతో పాటు ఉంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా మిగిలిన వారు రెండో బ్యాచ్‌లో అక్కడికి బయల్దేరతారు. ఇంగ్లండ్‌లో ఉన్న పాండ్యా అక్కడి నుంచే అమెరికా వెళ్లే అవకాశముంది. రెండో క్వాలిఫయర్ ఆడిన రాజస్తాన్ రాయల్స్ జట్టు సభ్యులు సంజూ సామ్సన్, యశస్వి జైస్వాల్, యుజువేంద్ర చహల్,



అవేశ్ ఖాన్ (రిజర్వ్ ప్లేయర్) సోమవారం అక్కడికి పయనమవుతారు. మెగా టోర్నీకి ముందు భారత్... బంగ్లాదేశ్‌తో జూన్ 1న ఏకైక వార్మప్ మ్యాచ్ ఆడుతుంది. టీమిండియా లీగ్ దశ పోటీలన్నీ కూడా అమెరికాలోనే ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్ తమ తొలి మ్యాచ్‌ను జూన్ 5న ఐర్లాండ్‌తో ఆడుతుంది. టోర్నీకే హైలైట్‌గా నిలిచే చిరకాల ప్రత్యర్థుల (భారత్, పాక్) సమరం జూన్ 9న న్యూయార్క్‌లో జరుగుతుంది.

అల్‌కరాజ్ శుభారంభం

రెండో రౌండ్‌లోకి స్పెయిన్ స్టార్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్పెయిన్ స్టార్, ప్రపంచ మూడో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ శుభారంభం చేశాడు. ఆదివారం మొదలైన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో అల్‌కరాజ్ 6-1, 6-2, 6-1తో జేజే వుల్ఫ్ (అమెరికా)పై గెలుపొందాడు. గంటా 51 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఐదు ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను తొమ్మిది సార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయాడు. ఆరో సీడ్ రుబ్లెవ్ (రష్యా) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్‌లో రుబ్లెవ్ 6-2, 6-7 (3/7), 6-3, 6-5తో టారో డానియల్ (జపాన్)ను ఓడించాడు.

మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ నయోమి ఒసాకా (జపాన్), మాజీ విజేత, తొమ్మిదో సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్‌లో ఒసాకా 2 గంటల్లో 6-1, 4-6, 7-5తో బ్రాన్‌జెట్టి (ఇటలీ)పై నెగ్గగా... ఒస్టాపెంకో 6-4, 7-5తో జాక్వెలిన్ క్రిస్టియన్ (రొమేనియా)పై నెగ్గింది.



లెక్‌లెర్క్ ఘనత

సొంతగడ్డపై ఎఫ్1 గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



మోంటెకార్లో: సొంతగడ్డపై ఎఫ్1 రేసులో విజేతగా నిలవాలన్న తన కలను ఫెరారీ జట్టు డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ నిజం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన మొనాకో గ్రాండ్‌ప్రి ఎఫ్1 రేసులో మొనాకోకు చెందిన లెక్‌లెర్క్ టైటిల్ సాధించాడు. తద్వారా 95 ఏళ్ల చరిత్ర కలిగిన మొనాకో గ్రాండ్‌ప్రి రేసులో టైటిల్ నెగ్గిన తొలి మొనాకో డ్రైవర్‌గా 26 ఏళ్ల లెక్‌లెర్క్ రికార్డు సృష్టించాడు. నిర్ణీత 78 ల్యాప్‌లను 'పోల్ పొజిషన్'తో ఆరంభించిన లెక్‌లెర్క్ ఆద్యంతం ఆధిపత్యం కొనసాగించి అందరికంటే వేగంగా 2 గంటల 23 నిమిషాల 15.554 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో లెక్‌లెర్క్‌కిది తొలి విజయంకాగా కెరీర్‌లో ఆరోది. ఆస్కార్ పియస్ట్రీ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ చాంపియన్, ఈ సీజన్‌లో ఐదు విజయాలు నమోదు చేసిన వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి ల్యాప్ మలుపు వద్ద కార్లు ఢీకొట్టుకోవడంతో నలుగురు డ్రైవర్లు ఒకాన్ (అల్పైన్), పెరెజ్ (రెడ్‌బుల్), హుల్కెన్‌బర్గ్ (హాస్), మాగ్నుసెన్ (హాస్) రేసు నుంచి వైదొలిగారు. సీజన్‌లోని తదుపరి రేసు కెనడా గ్రాండ్‌ప్రి జూన్ 9న మాంట్రియల్‌లో జరుగుతుంది.

రన్నరప్ సింధు

మలేసియా ఓపెన్ ఫైనల్లో పరాజయం

కౌలాలంపూర్: రెండేళ్లుగా అంతర్జాతీయ టైటిల్ కోసం నిరీక్షిస్తున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు మరోసారి నిరాశ ఎదురైంది. మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు 21-16, 5-21, 16-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా) చేతిలో ఓడిపోయింది. సింధుకు 15,960 డాలర్ల (రూ. 13 లక్షల 25 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. వాంగ్ జి యితో 79 నిమిషాల పాటు జరిగిన తుది పోరులో సింధు కీలకదశలో ఒత్తిడికిలోనై మూల్యం చెల్లించుకుంది. నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు ఒకదశలో 11-3తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ఈ భారీ ఆధిక్యాన్ని ఆమె కాపాడుకోవడంలో విఫలమైంది. 2022 సింగపూర్ ఓపెన్ ఫైనల్లో వాంగ్ జి యిపై నెగ్గి చివరిసారి అంతర్జాతీయ టైటిల్ గెలిచిన సింధు గత ఏడాది స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ ఫైనల్లో గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది.



నిశాంత్ ముందంజ



బ్యాంకాక్: వరల్డ్ బాక్సింగ్ ఒలింపిక్ చివరి క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్ల విజయపరంపర కొనసాగుతోంది.

ఆదివారం జరిగిన రెండు వెయిట్ కేటగిరీల్లో బరిలోకి దిగిన భారత బాక్సర్లు నిశాంత్ దేవ్ (71 కేజీలు), అబినాశ్ జమ్వాల్ (63.5 కేజీలు) గెలుపొందారు. అమాండో బిగాటె (గినీ బిసావో)తో జరిగిన తొలి రౌండ్ బౌట్‌లో నిశాంత్ 5-0తో నెగ్గగా... అబినాశ్ 5-0తో ఆండ్రిజెస్ లవ్రెనొవాస్ (లిథువేనియా)ను ఓడించాడు. ఇదే టోర్నీలో భారత బాక్సర్లు అభిమన్యు (80 కేజీలు), సచిన్ సివాచ్ (57 కేజీలు) కూడా తొలి రౌండ్‌లో గెలిచి ముందంజ వేశారు.

మళ్లీ ఓడిన భారత్



ఆంట్‌వర్ప్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొ లీగ్ యూరోపియన్ అంచె పోటీల్లో భారత మహిళల జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. అర్జెంటీనాతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సలీమా టెటె నాయకత్వంలోని భారత జట్టు 0-3 గోల్స్‌తో ఓడిపోయింది. భారత జట్టుకిది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. అర్జెంటీనా తరఫున సెలీనా (1వ ని.లో), కంపోయ్ (39వ ని.లో), గ్రనాట్టో (47వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. తొమ్మిది జట్ల మధ్య జరుగుతున్న ప్రొ లీగ్‌లో ప్రస్తుతం భారత జట్టు 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకొని ఎనిమిది పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. జూన్ 1న లండన్‌లో జరిగే తదుపరి మ్యాచ్‌లో జర్మనీతో భారత్ తలపడుతుంది.

కాంస్య పతక మ్యాచ్‌లో దీపిక కుమారి ఓటమి



యెచోన్ (కొరియా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీలో భారత స్టార్, మాజీ నంబర్‌వన్ దీపిక కుమారి పతకాన్ని గెలవడంలో విఫలమైంది. ఆదివారం జరిగిన మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో దీపిక 4-6 (26-29, 26-28, 28-25, 27-25, 26-29)తో ప్రపంచ మూడో ర్యాంకర్ అలెజాండ్రా (మెక్సికో) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు సెమీఫైనల్లో దీపిక 2-6 (26-28, 28-28, 27-28, 27-27)తో ప్రపంచ రెండో ర్యాంకర్ లిమ్ సిహ్యెన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమి పాలైంది. గత నెలలో షాంఘైలో జరిగిన ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీలో దీపిక రజత పతకం గెలిచింది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	8	74,410
నిఫ్టీ ▽	11	22,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	16,921	△	185
డోజోన్స్	39,070	△	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,318	▽	22
డాక్స్	18,693	△	2
షాంఘై	3,088	▽	28
నికాయ్	38,647	▽	457

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.77	107.33
€	యూరో	ఎస్‌బీఐ	89.37	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.80	53.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.65	56.59
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

ప్రీమియం భారమైతే.. పరిష్కారం?



ఏడాదిలో 25-50 శాతం పెరిగిన ప్రీమియం

- రేట్లను ఏటా సవరిస్తున్న బీమా సంస్థలు
- భరించలేకపోతే పోర్ట్‌తో కంపెనీ మారొచ్చు
- ప్రీమియం తక్కువే కాదు, మెరుగైన ఫీచర్లూ ఉండాలి
- తక్కువ బేస్ కవరేజీ.. అదనంగా సూపర్ టాపప్
- దీనివల్ల ప్రీమియంతో కొంత ఆదా



హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు మరోసారి ప్రీమియం బాదుడు షురూ చేశాయి. 'కర్ణుడి చావుకి కోటి కారణాలన్నట్టు'.. బీమా సంస్థలు కూడా ప్రీమియం పెంచడానికి ఎన్నో కారణాలు చూపిస్తుంటాయి. లోకల్ సర్కిల్స్ సంస్థ ఇటీవలే నిర్వహించిన ఒక సర్వేలో.. గడిచిన ఏడాది కాలంలో తమ వ్యక్తిగత హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియం 25 శాతం పెరిగినట్టు 52 శాతం మంది చెప్పారు. హెల్త్ ఇన్సూరెన్స్ నూతన పాలసీల ప్రీమియం సైతం ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే 5.54 శాతం మేర పెరిగినట్టు బీమా పంపిణీ ప్లాట్‌ఫామ్ 'పాలసీఎక్స్' చెబుతోంది. రెక్కలు తొడిగిన పక్షి మాదిరిగా ఇలా ప్రీమియం గణనీయంగా పెరుగుతూ పోతుంటే కొత్తగా పాలసీ తీసుకునే వారికే కాదు, అప్పటికే పాలసీ తీసుకున్న వారిపైనా అదనపు భారం పడుతుంది. మరి ఈ పరిస్థితుల్లో ప్రీమియం భారం కొంత తగ్గించుకునే మార్గాలేంటన్నది చూద్దాం.

ప్రీమియం ఎందుకు పెరుగుతోంది..

హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం గణనీయంగా పెరిగిపోవడానికి వైద్య ద్రవ్యోల్బణం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ద్రవ్యోల్బణం నిత్యావసరాలకు (వినియోగ ధరల, టోకు ధరల ఆధారిత) సంబంధించినది. ఇది 5–6 శాతం మధ్య ఉంటోంది. కానీ, వైద్య రంగంలో ద్రవ్యోల్బణం ఇంతకు రెట్టింపు 14–15 శాతంగా ఉంటోంది. చికిత్సల వ్యయాలు ఈ స్థాయిలో ఏటా పెరిగిపోతుండడంతో, బీమా సంస్థలకు పెద్ద మొత్తంలో క్లెయిమ్‌లు వస్తున్నాయి. దీంతో వాటిపై చెల్లింపుల భారం పడుతోంది. ''వైద్య రంగంలో ఎప్పటికప్పుడు అధునాతన టెక్నాలజీలు, చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ వసతులు మెరుగుపడడం, ప్రాణాలను కాపాడే అధునాతన చికిత్సలు అందుబాటులోకి రావడం.. ఇవన్నీ వ్యయాలు పెరగడానికి దారితీస్తున్నాయి'' అని రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో రాకేశ్ జైన్ తెలిపారు. ఔషధాలు, ఇంప్లాంట్లు, ఇతరత్రా వ్యయాలు పెరగడం వల్లే ఆస్పత్రుల చికిత్సల ధరలు పెరిగేందుకు కారణమవుతున్నట్టు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ అండర్ రైటింగ్, క్లెయిమ్స్ హెడ్ మనీష్ డొడేజా సైతం పేర్కొన్నారు. జీవనశైలి, ఇతర వ్యాధుల రిస్క్ పెరగడం కూడా అధిక క్లెయిమ్‌లకు దారితీస్తున్నట్టు చెప్పారు. ''మనదేశం ప్రపంచ మధుమేహం రాజధానిగా మారుతోంది. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, కేన్సర్ రిస్క్ సైతం పెరుగుతోంది'' అని ఇన్సూరెన్స్ సమాధాన్ సంస్థ సహ వ్యవస్థాపకురాలు శిల్పా అరోరా తెలిపారు. కరోనా సమయంలో, ఆ తర్వాత కూడా ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య పెరిగింది. దీంతో బీమా సంస్థలకు పరిహారం కోరుతూ వచ్చే క్లెయిమ్‌లు గణనీయంగా పెరిగాయి. ఈ భారాన్ని దింపుకునేందుకు బీమా సంస్థలు విడతల వారీగా పాలసీదారులకు ప్రీమియం వాత పెడుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. కరోనా తర్వాత ఆరోగ్య బీమా ప్రీమియం సవరణ ఇప్పుడే మొదటిసారి కాదు. లోగడ ఒకటి రెండు సార్లు కూడా అవి సవరించాయి.

అందరికీ కవరేజ్ లేకపోవడమూ కారణమే...



ఇక మనదేశంలో హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ అందరికీ లేకపోవడం కూడా ప్రీమియం అధికంగా ఉండడానికి మరొక కారణమంటున్నారు నిపుణులు. ఎక్కువ మంది హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటే బీమా సంస్థలు వ్యయాలను మరింత మంది పాలసీదారులతో పంచుకోవడానికి వీలు ఏర్పడుతుంది. దీంతో విడిగా ఒక్కొక్కరిపై పడే ప్రీమియం భారం తగ్గుతుంది. ప్రీమియంపై 18 శాతం జీఎస్‌టీ సైతం మరో పిడుగులాంటిదే. ఉదాహరణకు రూ.10వేల వార్షిక ప్రీమియంపై రూ.1,800 జీఎస్‌టీని కేంద్రం వసూలు చేస్తోంది. బీమా సంస్థలు వయసుల వారీగా ప్రీమియం పెంచుతుంటాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి 35 ఏళ్లు నిండి 36వ సంవత్సరంలోకి ప్రవేశించినప్పుడు ప్రీమియం పెరిగిపోతుంది. అలాగే 45 ఏళ్లు నిండి 46లోకి ప్రవేశించినప్పుడు కూడా ప్రీమియం టారిఫ్‌లను బీమా సంస్థలు సవరిస్తుంటాయి. ఎందుకంటే వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు అధికమవుతుంటాయి. దీంతో చికిత్సల క్లెయిమ్‌ల రిస్క్ పెరిగిపోతుంటుంది. దీన్ని ఎదుర్కొనేందుకు బీమా సంస్థల ముందున్న ఏకైక పరిష్కారం ప్రీమియం బాదుడే. ఇక బీమా పాలసీ తీసుకున్న వారు కూడా పెద్ద పట్టణాల్లోని ప్రముఖ హాస్పిటల్స్‌లో చికిత్సలు తీసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పేరొందిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో సాధారణంగానే వైద్య చికిత్సల చార్జీలు ఎక్కువగా ఉంటాయి. దీంతో బీమా సంస్థలకు పెద్ద మొత్తంలో క్లెయిమ్ బిల్లులు వస్తున్నాయి. ఇది కూడా ప్రీమియం పెరిగేందుకు కారణమవుతోంది. ఇటీవలే బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ముందస్తు వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్‌ను నాలుగేళ్ల నుంచి మూడేళ్లకు తగ్గించింది. మారటోరియం పీరియడ్‌ను ఎనిమిదేళ్ల నుంచి ఐదేళ్లకు తగ్గించింది. దీని వల్ల కూడా క్లెయిమ్‌లు పెరుగుతాయన్న అంచనాతో బీమా సంస్థలు ప్రీమియంను సవరిస్తున్నాయి. వచ్చే 12 నెలల కాలంలోనూ ప్రీమియంలు పెరుగుతాయన్న విశ్లేషణలు ఉన్నాయి.

అసలు హెల్త్ ప్లాన్ అవసరమా?

హెల్త్ ప్లాన్ లేకపోతే ఆర్థికంగా కుటుంబం గుల్ల కాక తప్పదు. ప్రీమియం భారంగా మారిందని హెల్త్ ప్లాన్ ప్రీమియం కట్టడం మానేయవద్దు. ఎందుకంటే జీవనశైలి వ్యాధులు పెరిగిపోయాయి. అదే సమయంలో అత్యాధునిక చికిత్సా విధానాలతో వ్యయాలు కూడా పెరిగాయి. హెల్త్ ప్లాన్ తీసుకోకపోతే.. అనుకోకుండా ఏదైనా అనారోగ్యం బారిన పడినప్పుడు లేదా రోడ్డు ప్రమాదం కారణంగా ఆస్పత్రిలో చేరాల్సి వస్తే, రుణాలతో గట్టెక్కాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. అందుకని ఆరోగ్య బీమా రక్షణ ఉండేలా చూసుకోవడం తప్పనిసరి.

21 % మంది గడిచిన ఏడాదిలో తమ పాలసీ ప్రీమియం 50 శాతం కంటే ఎక్కువే పెరిగినట్టు చెప్పారు.

31 % మంది 25-50 % మధ్య ప్రీమియం గతేడాదితో పోలిస్తే పెరిగినట్టు తెలిపారు.

15 శాతం మంది తమ ప్రీమియంలో ఎలాంటి మార్పు లేదన్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రూప్ హెల్త్ ప్లాన్‌లో ఉన్నవారే.



మొత్తం 11,000 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు.

- లోకల్ సర్కిల్స్ సర్వే వివరాలివి...

భారం ఎలా తగ్గించుకోవాలి?



పోర్టింగ్: ఆరోగ్య బీమా ఒకసారి కొనుగోలు చేసి మర్చిపోయే వస్తువు కాదు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మీ పాలసీలోని సదుపాయాలు ఉన్నాయా? అన్నది ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. సహేతుక ప్రీమియంపై మరింత మెరుగైన ఫీచర్లను వేరొక బీమా సంస్థ ఆఫర్ చేస్తుంటే, అందులోకి మారిపోవడం మంచి నిర్ణయమే అవుతుంది. హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి పోర్ట్ పెట్టుకోవచ్చు. కేవలం ప్రీమియం కొంత తక్కువగా ఉందని చెప్పి పోర్టింగ్ ఆప్షన్‌ను పరిశీలించడం సరైనది కాదు. ప్రీమియంలో చెప్పుకోతగ్గ వ్యత్యాసానికి తోడు, కొత్త సంస్థ ప్లాన్‌లో సదుపాయాలు మెరుగ్గా ఉన్నప్పుడే పోర్టింగ్‌ను పరిశీలించొచ్చు. పోర్టింగ్‌తో వేరొక బీమా సంస్థకు మారిపోయిన తర్వాత.. అక్కడ కూడా పాలసీ రెన్యువల్ (పునరుద్ధరణ) సమయంలో ప్రీమియం పెంచరని చెప్పలేం. అన్ని బీమా సంస్థలూ తమ క్లెయిమ్, ప్రీమియం నిష్పత్తి ఆధారంగానే ప్రీమియం పెంపు నిర్ణయాలు తీసుకుంటూ ఉంటాయి. కనుక ప్రీమియం పెంచినప్పుడల్లా దాన్ని తగ్గించుకునేందుకు కంపెనీని మారడం సరైన నిర్ణయం అనిపించుకోదు.

నో క్లెయిమ్ బోనస్: దాదాపు అన్ని బీమా సంస్థలు నో క్లెయిమ్ బోనస్‌ను ఆఫర్ చేస్తున్నాయి. అంటే ఒక పాలసీ సంవత్సరంలో ఎలాంటి క్లెయిమ్ లేకపోతే, మరుసటి సంవత్సరం రెన్యువల్ అనంతరం 10–100 శాతం వరకు ఏటా కవరేజీని పెంచుతుంటాయి. ఇలా గరిష్టంగా 100–200 శాతం వరకు కవరేజీ పెరుగుతుంది. ఉదాహరణకు రూ.10 లక్షల హెల్త్ ప్లాన్‌పై 50 శాతం నో క్లెయిమ్ బోనస్ ఆఫర్ ఉందనుకుంటే.. ఒక ఏడాదిలో క్లెయిమ్ లేకపోతే మరుసటి సంవత్సరం కవరేజీ రూ.15 లక్షలకు పెరుగుతుంది. రెండో ఏడాది కూడా క్లెయిమ్ లేకపోతే రూ.20 లక్షలకు పెరుగుతుంది. మూడో ఏడాది క్లెయిమ్ వస్తే, అప్పుడు పెరిగిన రూ.10 లక్షల నుంచి 50 శాతం అంటే రూ.5 లక్షలను తగ్గిస్తాయి. కానీ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ అయితే సుప్రీమ్ ప్లాన్‌లో సమకూరిన నో క్లెయిమ్ బోనస్‌ను క్లెయిమ్ చేసుకున్నా డిడక్షన్ అమలు చేయడం లేదు. అంటే నో క్లెయిమ్ బోనస్ కూడా కవరేజీగానే మిగిలిపోతుంది. కనుక బేస్ కవర్ రూ.5 లక్షలు తీసుకోవడం ద్వారా ఈ ప్లాన్‌లో మెరుగైన కవరేజీని పొందొచ్చు. దీనివల్ల ప్రీమియం కూడా తగ్గుతుంది. పెద్దలు ఉంటే వారిని ప్రత్యేక ప్లాన్ కింద వేరు చేయాలి.

ఒకేసారి మూడేళ్లు: ప్రీమియంను ఒకేసారి మూడేళ్లకు చెల్లించే ఆప్షన్ కూడా ఉంది. ఇలా ఒకేసారి మూడేళ్లకు ప్రీమియం చెల్లిస్తే 10–15 శాతం ప్రీమియంలో తగ్గింపు లభిస్తుంది. దీని వల్ల మూడేళ్ల పాటు ప్రీమియం పెంపు భారాన్ని తప్పించుకోవచ్చు. వయసువారీ శ్లాబు మారే ముందు మూడేళ్ల ప్రీమియం ఒకేసారి చెల్లించడం వల్ల.. అక్కడి నుంచి మూడేళ్ల పాటు పెంపు లేకుండా చూసుకోవచ్చు.

సూపర్‌టాపప్: ప్రస్తుత పాలసీలో ఎంత కవరేజీ ఉందన్నది ఒక్కసారి గమనించండి. ఒకవేళ రూ.10 లక్షల కవరేజీ ఉంటే, దాన్ని రూ.5 లక్షలకు తగ్గించుకుని, రూ.5 లక్షల డిడక్టబుల్‌తో రూ.20–50 లక్షలకు సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవడం మరో మార్గం. దీనివల్ల బేస్ ప్లాన్ ప్రీమియం తగ్గుతుంది. సూపర్ టాపప్ చౌకగా వస్తుంది. దీనివల్ల మొత్తం మీద ప్రీమియంలో 10–15 శాతం తగ్గుతుంది.

ఫ్లోటర్ ప్లాన్: అవివాహితులు ఇండివిడ్యువల్ ప్లాన్ తీసుకుని ఉంటే.. వివాహం తర్వాత జీవిత భాగస్వామితో కలసి కొత్త ప్లాన్‌కు వెళ్లొద్దు. అప్పటికే ఉన్న ప్లాన్‌ను ఫ్లోటర్‌గా మార్చుకుని, జీవిత భాగస్వామిని చేర్చుకోవాలి. దీనివల్ల జీవిత భాగస్వామి ఒక్కరికే వెయిటింగ్ పీరియడ్ తదితర నిబంధనలు వర్తిస్తాయి. కొంత ప్రీమియం కూడా తగ్గుతుంది.

గ్రూప్ ప్లాన్: ప్రీమియం భారంగా పరిణమిస్తే.. అప్పుడు పనిచేస్తున్న సంస్థ నుంచి గ్రూప్ ప్లాన్ తీసుకోవడాన్ని పరిశీలించొచ్చు. లేదంటే దాదాపు అన్ని ప్రైవేటు బ్యాంక్‌లు గ్రూప్ హెల్త్‌ప్లాన్లను తమ కస్టమర్లకు తక్కువ ప్రీమియానికే ఆఫర్ చేస్తున్నాయి. వీటిని పరిశీలించొచ్చు.

యాక్టివ్ హెల్త్ ప్లాన్: కొన్ని బీమా సంస్థలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించే వారికి ప్రీమియంలో రాయితీ ఇస్తున్నాయి. రోజువారీ వ్యాయామం, నడక తదితర సాధనాలు చేయడం వల్ల అనారోగ్యం రిస్క్ తగ్గుతుందని తెలుసు. దీనివల్ల బీమా సంస్థలకు క్లెయిమ్‌ల రిస్క్ తగ్గుతుంది. పాలసీదారులను ఆరోగ్య సంరక్షణ దిశగా ప్రోత్సహించి, తమ క్లెయిమ్‌లను తగ్గించుకునేందుకు బీమా సంస్థలు ఇలాంటి ప్లాన్‌లను ఆఫర్ చేస్తున్నాయి. వీటిల్లో 50 శాతం వరకు ప్రీమియం ఆదా చేసుకోవచ్చు.

కోపే: బీమా ప్రీమియం కట్టలేనంత భారంగా మారిపోతే.. అప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ రద్దు కావడం కంటే.. కో పే ఆప్షన్‌కు వెళ్లొచ్చు. ఉదాహరణకు 20 % కో పే ఎంపిక చేసుకుంటే.. ప్రీమియంలోనూ అంతే మేర డిస్కౌంట్ వస్తుంది. హాస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకున్నప్పుడు వచ్చే బిల్లులో 80 శాతాన్నే బీమా సంస్థ చెల్లిస్తుంది. 20 శాతాన్ని పాలసీదారు సొంతంగా భరించాల్సి వస్తుంది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ప్లాటినం యులిప్ ప్లాన్



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ కొత్తగా ప్లాటినం ప్లాన్‌ను ఆవిష్కరించింది. డిస్ట్రిబ్యూటర్లకు జరపాల్సిన చెల్లింపులనేవి వారి కస్టమర్ల ఫండ్ వేల్యూ ఆధారంగా ఉండే విధంగా దీన్ని రూపొందించింది. ఈ తరహా యులిప్ పాలసీల్లో తమ కంపెనీ నుంచి ఇది మొదటిదని సంస్థ తెలిపింది. పాలసీ వ్యవధి ఆసాంతం పెట్టుబడులను కొనసాగించే విధంగా కస్టమర్లను డిస్ట్రిబ్యూటర్లు ప్రోత్సహించేందుకు ఇది ఉపయోగపడగలదని వివరించింది. ఈ ప్లాన్ కింద కస్టమర్లు 21 ఫండ్స్ నుంచి దేన్నయినా ఎంచుకోవచ్చు. ఎలాంటి వ్యయాలు, పన్నులపరమైన భారాలు లేకుండా వివిధ అసెట్ క్లాస్‌కు ఉచితంగా, ఎన్నిసార్లయినా మారొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-5-2024 ఫామ్ ధర...

విశాఖ	500–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

ఫార్మాలో ఆకర్షణీయ అవకాశాలు

నిప్పన్ ఇండియా ఫార్మా ఫండ్



ఈక్విటీ పెట్టుబడులకు సంబంధించి ఫార్మాను 'సురక్షిత' రంగంగా చూస్తుంటారు. ఫార్మా వినియోగం ఏటేటా పెరుగుతూనే ఉంది. 10–20 ఏళ్ల క్రితంతో పోల్చి చూస్తే నేడు ఔషధ వ్యయాలు గణనీయంగా పెరిగాయి. దీర్ఘకాలంలో ఈ రంగానికి ఎప్పటికీ మంచి భవిష్యత్తు ఉంటుంది. 2020లో కరోనా సమయంలో ఫార్మా స్టాక్స్ మంచి ర్యాలీ చేశాయి. ఆ తర్వాత అవి దిద్దుబాటుకు గురయ్యాయి. మరోసారి వీటిల్లో ర్యాలీని అనలిస్టులు అంచనా వేస్తున్నారు. కనుక దీర్ఘకాలం కోసం ఫార్మాలో ఇన్వెస్ట్ చేయాలనుకునేవారు థీమ్యాటిక్ (ఒకే రంగంలో ఇన్వెస్ట్ చేసేవి) ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ విభాగంలో నిప్పన్ ఇండియా ఫార్మా ఫండ్ పనితీరు దీర్ఘకాలానికి ఆకర్షణీయంగా ఉంది.

పనితీరు

నిప్పన్ ఇండియా ఫార్మా ఫండ్ 2011–16 మధ్య కాలంలో బీఎస్‌ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్‌తో పోటీపడి మరీ రాబడులను ఇచ్చింది. ఆ కాలంలో వార్షికంగా 23.8 శాతం చొప్పున రాబడిని అందించింది. అలాగే, 2016–19 మధ్య కాలంలో బీఎస్‌ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ కంటే నిప్పన్ ఇండియా ఫార్మా ఫండ్ అధిక రాబడిని అందించింది. కరోనా తర్వాత వార్షిక రాబడి 31.9 శాతంగా ఉంది. కానీ, బీఎస్‌ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ 26.9 శాతం రాబడినే ఇచ్చింది. ఈ పథకం ట్రైలింగ్ రాబడులను పరిశీలిస్తే.. గడిచిన ఏడాది కాలంలో 53.51 శాతం, మూడేళ్లలో 15 శాతం, ఐదేళ్లలో 25 శాతం, ఏడేళ్లలో 19 శాతం, 10 ఏళ్లలో 17.56 శాతం చొప్పున ఉన్నాయి. ఈ పథకం 2004 జూన్ 5న ప్రారంభం కాగా, నాటి నుంచి చూసుకుంటే వార్షిక రాబడి 20.79 శాతంగా ఉంది. ఫార్మా రంగంలో పెట్టుబడులు ఎప్పుడూ దీర్ఘకాల దృష్టితోనే ఉండాలి. స్వల్పకాల పెట్టుబడులకు ఈ రంగం అనుకూలం కాదు. ఎందుకంటే ఫార్మా కంపెనీలు ఎన్నో కఠినమైన నియంత్రణల మధ్య పనిచేస్తుంటాయి. ముఖ్యంగా యూఎస్‌ఎఫ్‌డీఏ తనిఖీల ప్రభావం స్టాక్స్‌పై ఉంటుంది. దీర్ఘకాలంలో అయితే ఈ తరహా అస్థిరతల దశ నుంచి కంపెనీలు బయటకు వచ్చి, మరింత మెరుగైన పనితీరు చూపించగలవు. తాత్కాలిక ఒడిదుడుకులు ఈ రంగంలో సాధారణం. కనుక దీర్ఘకాలం కోసమే (5–10 ఏళ్లు) సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్ (అంకెలు శాతాల్లో)

కంపెనీ	పెట్టుబడులు
సన్‌ఫార్మా	13.81
లుపిన్	8.55
సిప్లా	6.8
అపోలో హాస్పిటల్స్	5.41
దివిస్ ల్యాబ్	5.5
డాక్టర్ రెడ్డీస్	4.78
గ్లాండ్ ఫార్మా	4.80
జేబీ కెమికల్స్	3.7
జైడస్ లైఫ్	3.61
అబాట్ ఇండియా	3.2

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతానికి ఈ పథకం నిర్వహణలో రూ.47,133 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులు (ఏయూఎం) ఉన్నాయి. ఇందులో స్టాక్స్‌లో 96 శాతం మేర ఇన్వెస్ట్ చేసి, మిగిలినది నగదు రూపంలో కలిగి ఉంది. 57 శాతం పెట్టుబడులు లార్జ్‌క్యాప్ కంపెనీలకు, మిడ్‌క్యాప్ కంపెనీలకు 31.50 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 11 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. ఫార్మా స్టాక్స్, హాస్పిటల్స్, హెల్త్‌కేర్, డయాగ్నోస్టిక్స్ కంపెనీల్లో ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంటుంది. సన్ ఫార్మాకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 13.81 శాతం పెట్టుబడి పెట్టింది. హెల్త్‌కేర్ సేవలు మరింత విస్తరించే కొద్దీ ఈ కంపెనీల వ్యాపార అవకాశాలు విస్తృతం అవుతాయి. ఈ పథకం బహుళజాతి ఫార్మా కంపెనీలకు తక్కువ కేటాయింపులు చేస్తుంటుంది.

రిస్క్ ఎక్కువ

సెక్టోరల్ లేదా థీమ్యాటిక్ ఫండ్స్‌లో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. వీటిల్లో వైవిధ్యానికి పెద్దగా అవకాశం ఉండదు. ఒకే రంగంలోనే మొత్తం ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఆయా రంగాల్లో సంక్షోభాలు ఏర్పడినప్పుడు నష్టాలు కూడా ఎదుర్కోవాల్సి రావచ్చు. కనుక ఒకరి పోర్ట్‌ఫోలియోలో సెక్టోరల్ ఫండ్స్‌కు కేటాయింపులు 10 శాతం మించకుండా చూసుకోవాలి.

అరబిందో ఫార్మా లాభం రూ. 909 కోట్లు

క్యూ4లో 80 శాతం అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా నికర లాభం గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో దాదాపు 80 శాతం ఎగిసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 909 కోట్లకు చేరింది. అంత క్రితం క్యూ4లో ఇది రూ. 506 కోట్లు. మరో వైపు, సమీక్షాకాలంలో ఆదాయం రూ. 6,473 కోట్ల నుంచి రూ. 7,580 కోట్లకు పెరిగింది. అమెరికా మార్కెట్ల నుంచి ఫార్ములేషన్స్ విభాగం ఆదాయం 22 శాతం వృద్ధితో రూ. 3,588 కోట్లకు, యూరప్ మార్కెట్లలో 10 శాతం వృద్ధితో రూ. 1,832 కోట్లకు, భారత్ సహా వర్ధమాన మార్కెట్లలో ఆదాయం 49 శాతం వృద్ధితో రూ. 852 కోట్లకు చేరింది. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై కంపెనీ రూ. 392 కోట్లు వెచ్చించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం రూ. 1,928 కోట్ల నుంచి రూ. 3,173 కోట్లకు పెరగ్గా ఆదాయం రూ. 24,855 కోట్ల నుంచి రూ. 29,002 కోట్లకు ఎగిసింది.

బీఎస్‌ఈలో ఈ కంపెనీ షేరు శుక్రవారం అరశాతం పెరిగి రూ. 1,235 వద్ద ముగిసింది.

క్లుప్తంగా...

జొన్నగిరిలో రెండు వజ్రాలు లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం జొన్నగిరిలో రెండు రోజుల వ్యవధిలో రెండు వజ్రాలు లభ్యమైనట్లు సమాచారం. వజ్రాన్వేషణకు వెళ్లిన ఓ వ్యక్తికి దొరికిన వజ్రాన్ని శనివారం ఓ వ్యాపారి రూ.6.20లక్షలు, ఐదు తులాల బంగారం, మహిళకు లభ్యమైన మరో వజ్రాన్ని ఆదివారం మరో వ్యాపారి రూ.1.20 లక్షలు, జత కమ్మలు ఇచ్చి కొనుగోలు చేశారు.

తీరం దాటిన రెమల్

- అర్ధరాత్రి తరువాత బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ మధ్య..

సాక్షి, విశాఖపట్నం: తీవ్ర తుపానుగా బలపడిన రెమల్ ఆదివారం అర్ధరాత్రి తర్వాత పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటింది. అంతకుముందు తీవ్ర తుపాను గంటకు 16 కిలోమీటర్ల వేగంతో ఉత్తర బంగాళాఖాతం నుంచి తీరం వైపు పయనించింది. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు విపత్తు నిర్వహణ కోసం భారీ ఎత్తున ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలకు ఉపక్రమించాయి. తుపాన్ ప్రభావం మన రాష్ట్రంపై అంతగా లేకపోయినా.. దీని కారణంగా రాష్ట్రంలో తేమ మొత్తం పోయింది. పొడి వాతావరణం ఏర్పడింది. దీనికితోడు ఏపీ, యానాంలో పశ్చిమదిశగా గాలులు వీస్తుండటంతో ఉక్కపోత మరింత ఎక్కువ కానుంది. రాబోయే రెండురోజులు కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం ఏర్పడుతుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణశాఖ తెలిపింది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమల్లో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రెండురోజుల తర్వాత ఉష్ణోగ్రతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వెల్లడించారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతం, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించాయి. నైరుతి ఈ నెల 31 నాటికి కేరళలోకి ప్రవేశించేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయని ఏపీ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

పిడుగురాళ్లలో నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్



పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల పాటు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే ఉన్నతాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని నల్గొండ జిల్లా దామంచర్ల సమీపంలోని విష్ణుపురం రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో ఆ మార్గంలో నడిచే పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దీనిలో భాగంగానే పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌కు 3.30 గంటలకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ చేరుకోగా.. అక్కడే నిలిపివేశారు. ప్రయాణికులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఏం జరిగిందో తెలియక ఆందోళన చెందారు. బండి ఎంత సమయానికి కదులుతుందో స్టేషన్ మాస్టర్ చెప్పకపోవడంతో నల్లగొండ, మిర్యాలగూడెం, గురజాల, దాచేపల్లి వంటి సమీప ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు స్టేషన్ బయటనే ఉన్న కారులను అద్దెకు తీసుకుని గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. సుదూర ప్రాంతం వెళ్లే ప్రయాణికులు మాత్రం స్టేషన్‌లోనే నిరీక్షించారు. వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 5.20 సమయంలో పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ నుంచి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కదిలింది.

ముగిసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

- జూన్ 9న ఫైనల్ కీ, ఫలితాలు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఆదివారం ముగిసింది. ఐఐటీ మద్రాస్ చేపట్టిన ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 1.91 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 46 వేల మంది వరకు అభ్యర్థులు పరీక్ష రాసినట్టు తెలుస్తోంది. కంప్యూటర్ ఆధారిత పరీక్షను ఉదయం సెషన్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ పరీక్ష 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించారు. పేపర్-1 మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నట్టు అభ్యర్థులు తెలిపారు. గణితం మధ్యస్థం, భౌతిక శాస్త్రం చాలా కష్టంగానూ, ఈ రెండింటితో పోలిస్తే కెమిస్ట్రీ సులభంగా ఉన్నట్టు అభిప్రాయపడ్డారు. పేపర్-2.. పేపర్-1తో పోలిస్తే చాలా కఠినంగా ఉన్నట్టు చెప్పారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ మధ్యస్థంగా ఉన్నట్టు నివేదించారు. కానీ, గణితం సాపేక్షంగా కఠినంగా ఉందన్నారు. మే 31న అభ్యర్థులకు ప్రతిస్పందనల కాపీలు అందుబాటులో ఉంచనుంది. జూన్ 2న తాత్కాలిక జవాబుల కీని విడుదల చేసి జూన్ 3 వరకు అభ్యంతరాలను స్వీకరించనుంది. జూన్ 9న తుది జవాబుల కీతో పాటు అడ్వాన్స్‌డ్ ఫలితాలను ప్రకటించనుంది. జూన్ 10 నుంచి జోసా తాత్కాలిక సీట్ల కేటాయింపు చేపడుతుంది.

మన పులిహోర.. చద్దన్నం అదుర్స్




83 శాకాహార వంటకాల్లో వీటికి 'ఫోర్ స్టార్' రేటింగ్

ప్రపంచ ఫుడ్‌గైడ్ 'టేస్ట్ అట్లాస్' తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: రాత్రి మిగిలిన అన్నంలో గంజి పోసి పులియబెట్టి పొద్దున్నే పచ్చిమిరపకాయ లేదా ఉల్లిపాయ నంజుకుంటూ పొలం గట్లపై రైతులు, కూలీలు తినే చద్దన్నం ఇప్పుడు అంతర్జాతీయ డిష్ అయింది. 'రాత్రి మిగిలిపోయిన ఈ అన్నం ఎవరు తింటారు?..' అంటూ ఈ కాలం యువత తక్కువ చేసి చూసే చద్దన్నాన్ని ఇప్పుడు స్టార్ హోటళ్లలో పంటాబాత్ పేరుతో స్పెషల్‌గా చేయించుకుని లొట్టలేస్తూ మరీ తింటున్నారు. అంతేనా మనం ఇంట్లో ఇష్టంగా చేసుకునే పులిహోర కూడా అంతర్జాతీయ ఫేవరెట్ వంటకంగా మారిపోయింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు, ప్రాంతాల్లో ప్రజలు ఇష్టంగా తినే వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, ఏయే ప్రాంతాల్లో వాటిని ఇష్టపడుతున్నారు, వాటికి ఇచ్చిన రేటింగ్ వంటి అంశాలను 'టేస్ట్ అట్లాస్' ప్రపంచానికి పరిచయం చేస్తుంది. ఇటీవల టేస్ట్ అట్లాస్ ప్రకటించిన 83 శాకాహార వంటకాల్లో తొలిసారి ఆంధ్రా స్పెషల్ పులిహోర, పప్పుచారు, మిరపకాయ బజ్జీలు చోటు దక్కించుకున్నాయి.

4 స్టార్ రేటింగ్‌తో పులిహోర

పండగలు, ప్రత్యేక పర్వదినాల్లోను, అమ్మవారికి పెట్టే నైవేద్యాల్లోను తప్పనిసరిగా చేసే పులిహోర టేస్ట్ అట్లాస్ రేటింగ్ 19వ స్థానంలో నిలిచింది. హిందూ ప్రపంచంలో ఎంతో పవిత్రంగా భావించే పులిహోర ఏపీకి చెందిన ప్రత్యేక వంటకమని, అయితే.. తమిళనాడులో దీనిని పులిసాదం అని, కర్ణాటకలో పులియోగారే అని పిలుస్తారని నివేదిక పేర్కొంది. అత్యధికమంది ఆహారప్రియులు ఆంధ్రప్రదేశ్‌లో చేసే చింతపండు పులిహోరనే ఎక్కువగా ఇష్టపడుతున్నట్టు రేటింగ్ ఇచ్చారు. మన రాష్ట్రం నుంచి మిరపకాయ బజ్జీ 40వ స్థానంలోను, పప్పుచారు 50వ స్థానంలోను నిలిచాయి. ఆంధ్రాలోని ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఉండే ఆరోగ్యకరమైన వంటకంగా పప్పుచారును పేర్కొంది.



టేస్ట్ అట్లాస్ ఇచ్చిన ఈ ర్యాంకింగ్స్ వివిధ ప్రాంతాల ఆహార ప్రియుల నుంచి తీసుకున్నట్లు పేర్కొంది. టాప్ 83 భారతీయ శాఖాహార వంటకాల జాబితా కోసం ఈ నెల మే 15వ తేదీ వరకు 2,251 మంది ఇచ్చిన రేటింగ్స్ ఆధారంగా ఈ జాబితాను ప్రకటించినట్టు తెలిపింది. మన గ్రామాల్లో ఇప్పటికీ రైతులు, కూలీల అల్పాహారంగా ఉన్న చద్దన్నం బంగ్లాదేశ్ సంప్రదాయ వంటకంగా గుర్తింపు పొందింది. టాప్ రేటింగ్‌తో పప్పు కూర ఎక్కువమంది ప్రజలు ఇష్టపడే వంటకాల జాబితాలో చేరింది. అంతర్జాతీయ ఫుడ్ గైడ్‌గా గుర్తింపుపొందిన టేస్ట్ అట్లాస్ ఇప్పటివరకు 10 వేల కుపైగా వంటకాలను, 9 వేల రెస్టారెంట్లను తన అంతర్జాతీయ జాబితాలో చేర్చింది. ఇప్పుడు మన ఆంధ్రా స్పెషల్స్‌కు చోటుదక్కడం, అందులోను అందరూ ఇష్టపడే పులిహోర, పప్పుచారు, మిరపకాయ బజ్జీ, చద్దన్నం ఉండడం విశేషం.

ఏపీ, ఈశాన్య భారత్, బంగ్లాదేశ్‌లలో చద్దన్నం స్పెషల్

ఈ జాబితాలో 36వ స్థానంలో ఉన్న చద్దన్నం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో తరాలుగా సంప్రదాయ అల్పాహారంగా ఉంది. ఇంట్లో టిఫిన్స్ ఉన్నా చద్దన్నం తినేవారు కోట్లలో ఉన్నారు. అయితే.. ఈశాన్య భారతదేశంతో పాటు మన పక్కనున్న బంగ్లాదేశ్‌లో చద్దన్నం వారి దేశ సంప్రదాయ అల్పాహారంగా ఉంది. ప్రోబ్యాక్టీరియా (ఆరోగ్యానికి మేలుచేసే బ్యాక్టీరియా), కొద్దిగా పర్మెంటేషన్‌తో ఎంతో రుచిగా ఉండే ఈ చద్దన్నాన్ని భారత్, బంగ్లాతో పాటు పలు దేశాల్లో ఇప్పుడు ఈ ఫుడ్‌ను ఎంతో ఇష్టపడుతున్నారని, ఇష్టంగా తింటున్నారని టేస్ట్ అట్లాస్ నివేదిక పేర్కొంది. బెంగాల్‌లో 'పంటాబాత్'గా పేరున్న చద్దన్నం బెంగాలీ నూతన సంవత్సరం వేడుకలు, పహేలా బైషాఖీ పండుగ వంటి ప్రత్యేక సందర్భాల్లో చద్దన్నం ఉండాల్సిందేనని పలువురు ఈశాన్య, బంగ్లా, బెంగాలీ ప్రజలు పేర్కొనడం గమనార్హం. ఈ వంటకం సాధారణంగా తాజా పచ్చి మిరపకాయలు, ఉప్పు, ఉల్లిపాయలతో ఏపీ ప్రజలు తింటే.. వేయించిన చేపలతో బంగ్లా ప్రజలు తినడం ప్రత్యేకతగా పేర్కొంది.

తొలిస్థానంలో నిలిచిన దాల్ తడ్కా

టేస్ట్ అట్లాస్ ప్రకటించిన శాకాహార వంటకాల్లో ఉత్తర భారతదేశానికి చెందిన దాల్ తడ్కా తొలిస్థానంలో నిలిచింది. దక్షిణాదిన పప్పు కూరగా పిలిచే ఈ వంటకం ఉత్తర భారతదేశంలో దాల్ తడ్కాగా మారింది. ఆంధ్రాలో పప్పు కూరను పెసలు, బొబ్బర్లు, కంది, శనగ వంటి పలురకాల పప్పు దినుసులతో వండితే.. దాల్ తడ్కా మాత్రం కంది పప్పు, మసాలాతో చేస్తారు. రోటీ లేదా జీరా రైస్‌తో కలిపి ఎంతో ఇష్టంగా తింటారని చెబుతూనే ఈ వంటకానికి 4.4 స్టార్ రేటింగ్ ఇచ్చారు. దీని తర్వాత రెండో స్థానంలో పంజాబీ వంటకం షాహీ పన్నీర్, మూడోస్థానంలో మహారాష్ట్ర వంటకం మిసల్ (పలురకాల కూరగాయలతో కలిపి చేసేది), నాలుగోస్థానంలో మిసల్ పావ్ నిలిస్తే, ఐదోస్థానంలో 4.3 స్టార్ రేటింగ్‌తో ఆంధ్రా స్పెషల్ పెసరపప్పు కూర చోటు దక్కించుకుంది. మాంసాహార రుచుల కంటే భారతదేశపు సంప్రదాయ శాకాహార వంటకాలను ప్రపంచవ్యాప్తంగా ఇష్టపడుతున్నారని, 7, 5 స్టార్ హోటళ్లలోను ఈ రుచులకు ప్రత్యేక అభిమానులున్నారని నివేదిక పేర్కొంది.

నేడు 'హజ్ యాత్ర' ప్రారంభం

గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరనున్న తొలి విమానం

సాక్షి, అమరావతి/గన్నవరం: ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్-2024 యాత్ర సోమవారం ప్రారంభం కానుంది. రాష్ట్రం నుంచి ఈ ఏడాది 2,580 మంది హాజీల పవిత్ర యాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు ఉదయం 8 : 45 గంటలకు విజయవాడ ఎంబార్గేషన్ పాయింట్ (గన్నవరం విమానాశ్రయం) నుంచి తొలి విమానం బయలు దేరనుంది. మొదటి విమానంలో ప్రయాణించే 322 మంది హజ్ క్యాంపు నుంచి ఉదయం 4 గంటలకే గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్నారు. వారి సౌకర్యం కోసం గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఈద్గా జామా మసీదు వద్ద మదర్సాలోని హజ్ వసతి క్యాంపులో ఏర్పాట్లు చేశారు. శనివారం రాత్రి హజ్ క్యాంపు వద్దకు చేరుకున్న తొలి బృందానికి వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 24 గంటలు పనిచేసేలా మదర్సా వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటైంది. వ్యాక్సినేషన్, వైద్య సహాయం అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. మదర్సా వద్ద పరిశుభ్రమైన వాతావరణంలో టెంట్లు, ఎయిర్ కూలర్లు సిద్ధం చేసి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నారు. మహిళా పోలీసులను కూడా నియమించారు. మదర్సా (హజ్ క్యాంపు) నుంచి హాజీలను విమానాశ్రయానికి తీసుకెళ్లేందుకు ఆర్టీసీ ఏసీ బస్సు సౌకర్యం కల్పించింది. అధికారులు, సిబ్బంది సమన్వయంతో హజ్ యాత్రకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఎల్.అబ్దుల్ ఖాదర్ 'సాక్షి'కి తెలిపారు.



మదరసాలో హజ్ యాత్రికుల రిజిస్ట్రేషన్ కౌంటర్

వరుసగా రెండో ఏడాది

హజ్ యాత్ర కోసం ఈ ఏడాది కోటా కింద 2,902 మందికి కేంద్ర హజ్ కమిటీ అనుమతి ఇవ్వగా రాష్ట్రం నుంచి 2,580 మంది నమోదు చేసుకున్నారు. విజయవాడ నుంచి ఎంబార్గేషన్ పాయింట్‌కు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అనుమతి సాధించింది. దీంతో వరుసగా రెండో ఏడాది విజయవాడ ఎంబార్గేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్ర ప్రారంభం కానుంది. విజయవాడ నుంచి 728 మంది ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు విమానాల్లో ప్రయాణమవుతున్నారు. హైదరాబాద్ నుంచి 1,118 మంది, బెంగళూరు నుంచి 725 మంది, చెన్నై ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 9 మంది బయలుదేరనున్నారు. మక్కా, మదీనాలో యాత్రికుల కోసం ప్రతి 200 మందికి ఒక ఖాదీమ్-ఉల్-హుజ్జాజ్(స్వచ్ఛంద సేవకులు)ను నియమించారు.

ట్రోల్ ఫ్రీ నెంబర్..

హజ్ యాత్రికులు జూలై 1 నుంచి 21వతేదీ లోపు తిరిగి స్వస్థలాలకు చేరుకుంటారు. ఒక్కో హాజీకి సుమారు 40 రోజుల పర్యటనకు మాత్రమే అనుమతి ఉంటుంది. హ్యాండ్ బ్యాగేజీ కింద 8 కిలోలు, చెక్ ఇన్ లగేజీ కింద 20 కేజీల బరువున్న రెండు బ్యాగులను అనుమతిస్తారు. విజయవాడ హజ్ క్యాంపు వద్ద ఎస్‌బీఐ తాత్కాలిక కేంద్రంలో ఒక్కొక్కరికి రూ.4 లక్షల వరకు ఫారిన్ ఎక్స్ఛేంజీ అందిస్తున్నారు. తిరుగు ప్రయాణంలో గన్నవరం వద్ద ఒక్కొక్కరికి ఐదు లీటర్ల జామ్ జామ్ వాటర్ (పవిత్ర జలం) క్యాన్లను అందిస్తారు. యాత్రకు సంబంధించి అదనపు సమాచారం కోసం 1800 4257873 ట్రోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించవచ్చు.

మావోయిస్టు సభ్యుల లొంగుబాటు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో లొంగిపోయిన 13 మంది మిలీషియా సభ్యులు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీ పెదబయలు దళానికి చెందిన 13 మంది కీలక మిలీషియా సభ్యులు ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సమక్షంలో స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లొంగిపోయిన వారంతా పెదబయలు దళంలో పనిచేస్తున్నారని చెప్పారు. వీరిపై అనేక నేరాల్లో కేసులు నమోదై ఉన్నాయని.. 2014 నుంచి పనిచేస్తున్న వారు కూడా ఉన్నారని తెలిపారు. పెదబయలు మండలం మెట్టగూడకు చెందిన కిల్లో భీముడు అలియాస్ ఆజాద్‌పై 19, వంతాల నగేష్‌పై 8, పాంగి సిల్కనాయుడుపై 6, కిల్లో చిరంజీవిపై 5, వంతాల రాంబాబుపై 4, వంతాల దొన్నుబాబుపై ఒకటి, గుంటా మోహన్‌రావుపై ఒకటి, గిన్నెలకోటకు చెందిన గడుతూరి పంతులుపడాల్‌పై 4, మనుగూరి నాగరాజుపై ఒకటి, ఇనుపతీగలు గ్రామానికి చెందిన చిక్కుడు రామమూర్తిపై ఒకటి, చిక్కుడు గణేష్‌పై ఒకటి, బొంగజంగికి చెందిన పాంగి రామదాస్‌పై 6, జడిగుడ గ్రామానికి చెందిన పాంగి పల్సుపై 5 కేసులున్నాయని ఎస్పీ చెప్పారు. వీరంతా మావోయిస్టు కార్యకలాపాలకు సహకరించడంతో పాటు ప్రజాకోర్టుల నిర్వహణ, హింసాత్మక ఘటనలకు పాల్పడడం, మావోయిస్టుల సభలు, సమావేశాలకు హాజరవ్వడం వంటివి చేశారని తెలిపారు. వరుస ఎదురుకాల్పులు, మావోయిస్టుల సరెండర్లు, అరెస్టులతో పెదబయలు దళం ఉనికిని కోల్పోయిందని చెప్పారు. మారుమూల గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను పోలీస్ శాఖ విస్తృతంగా చేపట్టిందన్నారు. దీంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు మావోయిస్టులు ముందుకు వస్తున్నారని తెలిపారు. గిన్నెలకోట పంచాయతీలో రోడ్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సెల్ టవర్ల ఏర్పాటుతో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని చెప్పారు. గిరిజనులంతా అభివృద్ధిని కోరుకోవడంతో మావోయిస్టులకు ఆదరణ కరువైందన్నారు. లొంగిపోయిన వారు స్వేచ్ఛగా జీవించేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని ఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో చింతపల్లి, పాడేరు ఏఎస్పీలు శివకిశోర్, ధీరజ్, జి.మాడుగుల సీఐ రమేశ్, పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



మావోయిస్టు సభ్యులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా, ఇతర అధికారులు



భూతలస్వర్గం దిండి

కోనసీమ అందాల కనువిందు





మలికిపురం: కోనసీమ నయా కేరళగా అవతరిస్తోంది. పచ్చని చెట్లు..మనసు దోచే అందాల మధ్య లాహిరి లాహిరిలో అంటూ పడవ ప్రయాణం చేస్తూ..విందు ఆరగించాలి అంటే.. ఇప్పుడు కేరళ వరకు వెళ్లక్కర్లేదు. సరిగ్గా అక్కడ ఎలా ఉంటుందో..కోనసీమ అందాలను చూస్తే అదే ఫీలింగ్ కలుగుతోంది. ఈ నేల తెరలపై పరుచుకున్న ప్రకృతి సోయగాలు..ఆ సోయగాలుల తాకిడికి పరవశిస్తున్న పర్యాటక ప్రేమికులు..వెరసి కోనసీమ పర్యాటకం, టూరిస్టుల రాకతో పులకిస్తోంది. వేసవి కావడంతో కోనసీమలోని దిండి టూరిజంకు పర్యాటకుల తాకిడి అధికమైంది. మలికిపురం మండలంలోని గోదావరి తీరాన దిండి కేంద్రంగా ఇక్కడి టూరిజం దిన దిన ప్రవర్ధమానం చెందుతోంది. 2004లో అప్పటి సీఎం వైఎస్సార్ వేసిన టూరిజం అభివృద్ధి బీజం నేడు కల్పవృక్షంగా మారి అటు ప్రభుత్వానికి ఆదాయంతో పాటు, యువతకు ఉపాధి చూపడమే కాక కోనసీమలో ప్రకృతి అందాలను బాహ్య ప్రపంచానికి పరిచయం చేసింది. ఏటా ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న పర్యాటకులతో అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేట్ టూరిజం అభివృద్ధి చెందింది. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిండి కోకోనట్ కంట్రీ రిసార్ట్స్‌కి రాష్ట్ర టూరిజం శాఖ ఈ ఏడాది ఏకంగా రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఇతర ప్రైవేట్ టూరిజం కేంద్రాలు కూడా రూ.కోట్లలో పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జిస్తున్నాయి.

'సైబర్' ముప్పును గుర్తించండిలా!



నకిలీ వెబ్‌సైట్‌లు, లింక్‌లను పసిగట్టేందుకు ఎన్నో మార్గాలు

ఓపెన్స్ సోర్స్ సైబర్ టూల్స్‌తో సులువే అంటున్న సైబర్ సెక్యూరిటీ అధికారులు

స్మార్ట్‌ఫోన్లు వాడే వారు వివిధ మొబైల్ యాప్‌లను వాడుతూనే ఉంటారు. పలు రకాల పనుల కోసం ఎన్నో రకాల వెబ్‌సైట్లను వినియోగిస్తుంటారు. దీంతో ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు ఫిషింగ్ లింక్‌లను పంపి మోసాలకు తెరతీస్తున్నారు. అయితే ఇలాంటి అనుమానాస్పద వెబ్‌సైట్‌లు, లింక్‌లను ఓపెన్ సోర్స్ సైబర్ టూల్స్‌తో గుర్తించవచ్చని సైబర్ సెక్యూరిటీ అధికారులు చెబుతున్నారు. అవి ఏమిటంటే..

సాక్షి, హైదరాబాద్

యూఆర్ఎల్, అడ్రస్ బార్ పరిశీలన తప్పనిసరి

ప్రతి వెబ్‌సైట్ యూనిఫాం రిసోర్స్ లొకేటర్ (యూఆర్ఎల్) అడ్రస్‌లో https:// అని ఉంటే ఆ వెబ్‌సైట్ ఓపెన్ చేసేందుకు భద్రమైనదని గుర్తించాలి. అలాగే అడ్రస్ బార్‌లో లాక్ సింబల్ ఉంటే కూడా దాన్ని సురక్షితమైన వెబ్‌సైట్‌గా నిర్ధారించుకోవాలి. లేదంటే అది డేటా హ్యాక్ అయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించాలి.

కాంటాక్ట్ పేజీ తనిఖీ అవసరమే..

ఏదైనా కంపెనీకి సంబంధించి వెబ్‌సైట్ లింక్ మనకు వస్తే దానిలో కంపెనీ ఫోన్ నంబర్, ఈమెయిల్, కంపెనీ అడ్రస్ ఉన్నాయా లేదో చూడాలి. ఈ వివరాలు లేకపోతే అది నకిలీ వెబ్‌సైట్ అయ్యే అవకాశాలే ఎక్కువ.

కంపెనీకి సోషల్ మీడియా ఖాతాలున్నాయా?

చట్టబద్ధమైన కంపెనీలు తప్పకుండా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాయి. కంపెనీ చిరునామా కింద యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, 'ఎక్స్'వంటి సోషల్ మీడియా ఐకాన్‌లు జోడించి ఉంటాయి. వాటిలో సంబంధిత సమాచారంపై యూజర్ల రివ్యూలు ఉంటాయి. మోసపూరిత వెబ్‌సైట్‌లకు అలాంటి లింక్‌లు ఉన్నా అందులో ఏమీ నిజమైన అంశాలు ఉండవు.

వెబ్‌సైట్ల అక్షరాలు మారుస్తూ మోసాలు

సైబర్ నేరగాళ్లు నిజమైన వెబ్‌సైట్లను పోలి ఉండేలా పేర్లు పెడుతూ మోసగిస్తుంటారు. ఉదాహరణకు 'yahoo.com'ను కొద్దిపాటి మార్పులతో అందులోని అక్షరాలకు సున్నాలు చేర్చి 'Yah00.com'గా మారుస్తుంటారు. అలాగే అమెజాన్ వెబ్‌సైట్‌ను 'AmaZ0b.net'గా పెడుతున్నట్లు సైబర్ భద్రత నిపుణులు వివరిస్తున్నారు. నిజమైన వెబ్‌సైట్లను గుర్తించేందుకు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచిస్తున్నారు.

డొమైన్ ఏజ్ సరిచూసుకోవాలి..: సదరు వెబ్‌సైట్ డొమైన్ ఎవరి పేరిట రిజిస్టర్ అయ్యింది..ఎన్నాళ్లుగా యాక్టివ్‌గా ఉంది..ఎక్కడి నుంచి ఈ వెబ్‌సైట్‌ను నడుపుతున్నారు తదితర వివరాలు ఓపెన్ సోర్స్ టూల్ https://whois.domaintools.com/ లోకి వెళ్లి సదరు వెబ్‌సైట్‌లో సరిచూసుకోవచ్చు..

గ్రామర్ తప్పులతో పసిగట్టొచ్చు..: నకిలీ వెబ్‌సైట్‌ల పేర్లలో అక్షర దోషాలు ఉంటాయి. అందులోని కంటెంట్‌లోనూ వ్యాకరణ దోషాలు ఎక్కువ ఉంటాయి. ఇది కూడా నకిలీ వెబ్‌సైట్ గుర్తించేందుకు ఒక సూచన.

ప్రైవసీ పాలసీ ఉందా?..: డేటా ప్రైవసీ, చట్టాలు ఇతర అంశాలను నిజమైన వెబ్‌సైట్‌లు తమ ప్రైవసీ పాలసీలో క్షుణ్ణంగా పేర్కొంటాయి. కానీ నకిలీ వెబ్‌సైట్లలో ఈ వివరాలు సరిగ్గా ఉండవు.

ఇంటర్నెట్ టూల్స్ సాయంతో..: ఒక వెబ్‌సైట్ సురక్షితమైందో లేదో గూగుల్ సేఫ్ బ్రౌజర్ ట్రాన్స్‌పరెన్సీ రిపోర్ట్ ద్వారా తెలుసుకోవచ్చు. ఇందుకోసం https://transparencyreport.google.com/safe& browsing/ searchలోకి వెళ్లి మనం చెక్ చేయాలనుకొనే వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను నమోదు చేస్తే అది నిజమైనదో లేక నకిలీదో చిటికెలో తెలుస్తుంది. మనకు వచ్చిన లింక్‌లోని వెబ్‌సైట్‌లో ఉన్న కంపెనీ విశ్వసనీయత గురించి తెలుసుకునేందుకు https://www.bbb.org/ (Better Business Bureau)లో సెర్చ్ చేయవచ్చు. అలాగే isithacked, virustotal, phishtank, ftc, scamalert లాంటి ఓపెన్ సోర్స్ వెబ్‌సైట్లు, టూల్స్‌తో నకిలీ వెబ్‌సైట్ల నుంచి వచ్చే వైరస్, ఫిషింగ్ లింక్‌లు, మాల్‌వేర్‌లను గుర్తించొచ్చు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943